ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. అతిపీతివరుడు—జొన్నలగడ్డ రామలక్ష్మి

25. భూతంలాంటి సాక్షి—ప్రతాప రవిశంకర్

36. నేరానికి నేస్తం—కుమారి సవిత

48. లాకరు—వసుంధర

70. లాయరుగారమ్మాయి—చండిక సాంబశివరావు

92. వేటాడే సింహం—వి. ఎస్. రావ్

146. శశిరేఖ శపథం—కె.వి.వి. సత్యనారాయణరాజు

159. పులి మాటు—దీపిక

175. నరసింహావతారం—(సీరియల్) వసుంధర

నవలలు (సప్లిమెంట్)

3. ప్రేమ లేఖ—వసుంధర

50. వెంటాడే మృత్యువు—భీమవరపు పురుషోత్తం

94. రేపటి ప్రమాదం—కె.వి.యస్. ప్రకాశరావు

136. అగ్నిలహరి—సుంకరి రాంప్రసాద్

179. విషకన్య (సీరియల్)—బొమ్మిడి అచ్చారావు

ఇంకా— ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

జొన్నలగడ్డ రామలక్ష్మి
అతినీతిపరుడు

ఫైల్సు చూస్తోంది గౌతమి.

"అయ్యగారు పిలుస్తున్నారమ్మా!" అన్నాడు ప్యూన్.

గౌతమి లేచి ఆఫీసరు గదిలోకి వెళ్ళింది.

పెద్ద టేబులు వెనుక ఎగ్జిక్యూటివ్ చైర్‌లో హుందాగా కూర్చుని ఉన్నాడు జయదేవ్. గౌతమిని చూస్తూనే అతడు

కూలింగ్ గ్లాసెస్ తీసి బల్లమీద పెట్టి—"కూర్చో, గౌతమీ!" అన్నాడు.

గౌతమి అతడికెదురుగా కూర్చుంది.

"నే నిప్పుడు నిన్ను ఆఫీసు పనిమీద పిలవలేదు...." అన్నాడు జయదేవ్.

గౌతమి కుతూహలంగా అతడివంక చూసింది. అతడు చాలా హుందాగానూ, పెద్దమనిషి తరహాగనూ ఉంటాడు. సాధారణంగా తన పని ఏదో తనది. ఇతర విశేషాలు మాట్లాడడు.

ఆ ఆఫీసు జయదేవ్‌ది! అక్కడ అతడు ఆఫీసరేకాడు. అందరికీ యజమానికూడా! అంతా అతణ్ణి అభిమానిస్తారు. సత్ప్రవర్తనకు మారుపేరు జయదేవ్. అతడిప్పుడు తనతో ఏం మాట్లాడతాడు?

"నీ లోన్ అప్లికేషన్ చూశాను...." అన్నాడు జయదేవ్.

గౌతమి పదివేల రూపాయలకు లోన్ అప్లికేషన్ పెట్టుకుంది. ఆమె తండ్రికి కాన్సరు. అర్జంటుగా వైద్యం జరగాలి. తల్లి జెంగపెట్టుకుంది. ఆమెకు ఇద్దరు తమ్ముళ్ళు. ఇద్దరూ చదువుకుంటున్నారు.

ప్రస్తుతానికి వాళ్ళింట్లో గౌతమి ఒక్కతే ఉద్యోగం చేస్తోంది.

"నువ్వుద్యోగంలో చేరి—ఏడాది మాత్రమే అయింది. అప్పుడే పదివేలకు లోన్ పెట్టావు. వస్తుందనే అనుకున్నావా?" అన్నాడు జయదేవ్.

"మేముంటున్నది అద్దె యిల్లు. అమ్మ మెడలో బంగారం లేదు. తమ్ముళ్ళింకా చదువుకుంటున్నారు. నాన్న నిలవలన్నీ వైద్యానికి ఖర్చైపోయాయి. జబ్బ

తగ్గేదాకా ఆయనకు జీతం రాదు. మా కింకెక్కడా అప్పు పుట్టదు. అందుకని ఇక్కడ అప్లై చేశాను...." అంది గౌతమి.

"ఇక్కడ అప్పు దొరకదని తెలియదా?"

"తెలుసు. కానీ మీరు దయామయులని విన్నాను. అందుకే అప్పుకు కారణాలుకూడా వివరించాను—అప్లికేషన్లో...." అంది గౌతమి.

"అంటే—నేను నిన్ను కరుణించాలన్న మాట!" అన్నాడు జయదేవ్.

గౌతమి తలాడించింది.

"కరుణించడం అంత సులభం కాదు...." అన్నాడు జయదేవ్.

గౌతమి అతడివంక ప్రశ్నార్థకంగా చూసింది.

"నీకే అర్థమవుతుంది. ఉదాహరణకు నేనే నిన్నలా అడిగాననుకో...." అని అర్థోక్తిలో ఆగాడు జయదేవ్.

"అంటే?"

"నేను నిన్ను కరుణించమని అంటాను. అప్పుడు నువ్వేమంటావు?"

జయదేవ్‌కు డబ్బుంది. తనకు లేదు. అతడు తనను కరుణించమని ఎందుకంటాడు?—ఇదే ఉద్దేశ్యంతో—"మీరలా ఎందుకంటారు?" అంది గౌతమి.

"ఆలోచించు...."

గౌతమికి నిజంగానే ఏమీ స్ఫురించలేదు. అదే ఆమె అతడికి చెప్పింది.

"నా దగ్గర డబ్బుంది. డబ్బుతో నన్ను కరుణించమన్నావు. నన్ను కరుణించడానికి నీ దగ్గర ఏమీ లేదా?" అన్నాడు జయదేవ్.

గౌతమి ఉలిక్కిపడింది. అంతవరకూ జయదేవ్ గురించి ఆమె ఆ విధంగా ఆలోచించలేకపోయింది.

"ఏమన్నారూ?" అందామె.

"నేను నిన్ను కరుణిస్తాను — నువ్వు నన్ను కరుణిస్తే!"

చాలా సూటిగా చెప్పాడతడు. గౌతమికి షాక్ తట్టుకోవడానికి కాసేప్పట్టింది. "ఇంతవరకూ నన్నెవరూ ఇలా అడగలేదు...." అందామె.

"నాకు గతం వద్దు. నా ప్రశ్నకు జవాబు కావాలి."

"నన్నుగురించి మీరేమనుకుంటున్నారు?" రోషంగా అంది గౌతమి.

"ఆవేశపడకు. ఆవేశం వివేకాన్ని చంపుతుంది. మీ నాన్నకు వైద్యం జరుగుతుంది—నువ్వు నన్ను కరుణిస్తే!" అన్నాడు జయదేవ్.

"కరుణించక పోతే?"

"నీ ఉద్యోగం ఊడుతుంది—" అన్నాడు జయదేవ్ తాపీగా.

అతడు అన్న పద్ధతిని బట్టి—ఇలాంటి దతడికి కొత్త కాదనిపించింది గౌతమికి.

"మీకిది న్యాయం కాదు...." అందామె.

"నాక్కావలసింది న్యాయంకాదు. నువ్వు...."

"మీరు నన్ను పరీక్షిస్తున్నారు...."

"అలాంటి భ్రమలతో నా సహనాన్ని పరీక్షించకు...." అన్నాడు జయదేవ్.

గౌతమి లేచి నిలబడి—"ఉద్యోగానికి రాజీనామా యిస్తున్నాను...." అంది.

"నీ యిష్టం....నీ తండ్రికి అపరేషన్ జరగడాని కో

బంగారు అవకాశాన్ని వదులుకుంటున్నావు....” అన్నాడు జయదేవ్.

“మీ అసలురంగు బయటి జనానికి చూపిస్తాను....” అంది గౌతమి ఆవేశంగా.

“నాకు డబ్బుంది. దాంతో నాక్కావలసిన రంగు వేసుకోగలను. డబ్బుకోసం నువ్వే నన్ను వలలో వేసుకుందుకు ప్రయత్నించి విఫలం చెంది దుష్ప్రచారం ప్రారంభించావని చెప్పి నలుగురినీ నమ్మించగలను. జనం నమ్మినా నమ్మకపోయినా అప్పుడు నీ బ్రతుకు బజారు పాలవుతుంది.”

“నువ్వు చాలా దుర్మార్గుడివి....” అందిగౌతమి.

“నానుంచి పదివేలు అప్పు ఆశిస్తున్నావు. అది సరిపోతుందో లేదో కూడా నీకు తెలియదు. ఎలా తీర్చేదీ నీకు తెలియదు. పోయిన డబ్బు నాకు తిరిగి రాదు. నేను నిన్ను కోరుతున్నాను. అందులో నీక్కలిగే నష్టమేమీ లేదు. ఎవరికీ చెప్పకుంటే ఈ రహస్య మెవ్వరూ కనుక్కోలేరు. నిజానికి నువ్వు నీ అందంతో ఇంత డబ్బు సంపాదించ గలవేమో చూసుకో....అందులోనూ ఇంత గౌరవంగా..”

గౌతమి మాట్లాడలేదు.

“నా ఉదార స్వభావం గురించి నువ్వర్థం చేసుకోవడం లేదు. నువ్వు తెలివితక్కువగా రాజీనామా యిస్తానంటే ఈ క్షణంనుంచే అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాను. కావాలంటే ఆలోచించుకుందుకు నీ కోరోజు గడువిస్తున్నాను. కావాలంటే ఈ రోజుకు సెలవు తీసుకో. రేపు వచ్చి నీ నిర్ణయం చెప్పు. రేపటికి రాకపోతే నీ ఉద్యోగం ఊడిందనే అనుకో. నేనింకో అమ్మాయిని నీ స్థానంలో నియమిస్తాను....” అన్నాడు జయదేవ్.

"అంటే అందర్నీ యిదే విధంగా—ఇదే ఉద్దేశ్యంతో అపాయింట్ చేస్తారా మీరు?" అంది గౌతమి.

"అవును. కానీ ఇంతవరకూ ఎవరినీ నీకులా ఉద్యోగం నుంచి పీకేయాల్సిన అవసరం మాత్రం రాలేదు...." అన్నాడు జయదేవ్.

2

రోజంతా ఆలోచించింది గౌతమి. ఇంటికి వెళ్ళేసరికే ఆమె ఆవేశం సగానికి పైగా చల్లారింది.

తండ్రి ఆపరేషనుకు ఆలస్యం పనికిరాదని డాక్టరు హెచ్చరించాడుట. తల్లి దిగులుగా ఉంది. తమ్ముళ్ళు దిగులుగా ఉన్నారు. తండ్రి జీవితంమీద ఆశ వదులుకున్నాడు.

ఆలస్యమైతే తండ్రి దక్కడు. పోయిన ప్రాణాలు తిరిగి రావు.

తను తల్చుకుంటే తండ్రి ప్రాణాలు నిలపగలదు. కానీ అందుకు చెల్లించాల్సిన ప్రతిఫలం తన శీలం....

శీలం!

తండ్రి ప్రాణాలతో పోలిస్తే అర్థంలేని పదమది!

జయదేవ్ చెప్పనే చెప్పాడు....అంతా రహస్యంగా కొనసాగుతుందని....

గౌతమి త్వరగానే ఒక నిర్ణయానికి వచ్చింది. తనీ నిర్ణయానికి వస్తుందని తెలిసే జయదేవ్ తనకోరోజు గడు విచ్చాడని ఆమె కర్థమయింది.

మర్నాడాఫీసుకు వెళ్ళి జయదేవ్‌కి తన నిర్ణయం చెప్పింది.

"నిన్నభినందిస్తున్నాను. నీ సమస్యలన్నీ తీరి పోతాయి...." అన్నాడు జయదేవ్ ఉత్సాహంగా.

గౌతమికి ఉత్సాహంలేదు.

"ఇంట్లో బజారుకని చెప్పి బయల్దేరు. బజార్లో కాసేపు తిరుగు. సరిగ్గా ఆరున్నరకు ప్రకాశం సందులోకి తిరుగు. అక్కడ జనసంచార ముండదు. ఆ సందులో కుడివైపున రెండో యిల్లు నాది. అది కేవలం ఇలాంటి సరదాలకే! ఆ యిల్లు నాదని చాలామందికి తెలియదు. ఆ యింటి తలుపులు నీకోసం తెరిచి వుంటాయి. ఆ పక్కనే వున్న పిలక వారి సందులోంచి కూడా ఆ యింట్లోకి ప్రవేశించవచ్చు. నీకంటే ముందుగానే నే నా ఇంట్లో వుండి అన్ని ఏర్పాట్లూ చేస్తాను." అన్నాడు జయదేవ్ ఉత్సాహంగా.

"ఇదంతా ఏమిటి?" అంది గౌతమి.

"సీక్రెసీ .... తప్పుచేయడం తప్పుకాదు. తప్పును రహస్యంగా ఉంచాలి. అది నీకూ నాకూ మంచిది...." అన్నాడు జయదేవ్.

"మీరిలా ఎంతమందిని రప్పించుకున్నారు?" అంది గౌతమి.

"ఎంతమందిని రప్పించుకున్నానూ అన్నది నీకు అనవసరం. అయితే బజారు సరుకుపై నాకు మోజులేదు. నీ వంటి ముగ్ధలంటేనే యిష్టం...." అన్నాడు జయదేవ్.

3

సూర్యప్రకాశ్ కొత్తగా జర్నలిజంలో దిగాడు. అతడు సేకరించి పంపిన కొన్ని రిపోర్ట్సుకు పత్రికలలో మంచి రెస్పాన్స్ వచ్చింది.

"జర్నలిస్టుగా నీకు మంచి భవిష్యత్తుంది. సెన్సేషన్ కలిగించే వార్తలేమైనా సేకరించి పంపు. మంచి ప్రతిఫలముంటుంది...." అని రెండు ప్రముఖ దినపత్రికలతడికి రాశాయి.

సూర్యప్రకాశ్ చాలా సంతోషించాడు. గర్వపడ్డాడు.

అతడు తరచుగా కెమేరా తీసుకుని బయట తిరుగుతున్నాడు. అతడి భుజానికెప్పుడూ ఓ గుడ్డసంచీ వ్రేలాడుతూంటుంది. అందులో ఓ నోట్ బుక్కూ, కెమేరా ఉంటాయి.

ఆరోజు సూర్యప్రకాశ్ బజార్లో తిరుగుతున్నాడు. అతడి దృష్టిని గౌతమి ఆకర్షించింది.

గౌతమి హాండ్‌లూమ్ శారీ కట్టుకుంది. చెవులకు రింగులు తప్ప వంటిమీద ఇంకే ఆభరణాలూ లేవు. మనిషికి దగ్గరగా నడిస్తే గుప్పుమనిపించే పరిమళం లేదు. ముఖానికి కాస్మెటిక్సులేవు. అయినా అతడికామె ఎంతో అద్భుతంగా కనపడింది.

ఆమె ఎవరో తెలుసుకోవాలని అతడికి అనిపించింది.

సూర్యప్రకాశ్ గౌతమినే అనుసరిస్తున్నాడు. ఆమె ఎక్కడికి వెడితే అక్కడకు వెడుతున్నాడు. అదామెకు తెలియదు.

గౌతమి చివరకు ప్రకాశం సందులోకి తిరిగింది.

అది చాలా చిన్నసందు.

సూర్యప్రకాశ్ సందు బయట నిలబడ్డాడు. అతడికి గౌతమి కనపడుతోంది. ఓరకంట ఆమెనే గమనిస్తున్నాడతడు.

గౌతమి ఓ యింట్లోకి వెళ్ళడం చూశాడతడు.

కాసేపాగి సూర్యప్రకాశ్ తనూ ఆ యింటికి వెళ్ళి తలుపుతట్టాడు.

"ఎవరూ?" అంది లోపల్నుంచి ఓ పురుషకంఠం.

సూర్యప్రకాశ్ మళ్ళీ తలుపు తట్టాడు.

తలుపు తెరుచుకుందుకు కాసేపు పట్టింది.

అప్పుడు సూర్యప్రకాశ్ జయదేవ్‌ను చూశాడు.

"ఎవరు మీరు?" అన్నాడు జయదేవ్ చిరాగ్గా.

"రేషన్ కార్డులగురించి సమాచారం కావాలి. ఈ యింట్లో ఎందరున్నారు?"

"నేనొక్కడినే...." అన్నాడు జయదేవ్.

"మీరొక్కరేనా—ఇంకెవ్వరూ లేరా?"

"లేరు...."

"ఆలోచించుకోండి .... కోటా తగ్గిపోతుంది ...." అన్నాడు సూర్యప్రకాశ్.

"కోటాకోసం మనుషుల లెక్క ఎక్కువ చెప్పేరకం కాదు నేను...." అంటూ భళ్ళున తలుపులు వేశాడు జయదేవ్.

తలుపులు మూసుకున్నా గుప్పుమన్న పరిమళం ఇంకా అలాగే ఉండిపోయింది.

"చాలా ఖరీదైన సెంటు!" అనుకున్నాడు సూర్యప్రకాశ్.

అతడికి గౌతమి గురించి కుతూహలం బయల్దేరింది.

ఎవరామె?

ఆమె ఆ యింట్లో మెంబరు కాదా?

సూర్యప్రకాశ్ బుర్ర చురుగ్గా పనిచేసింది.

ఆమె కళ్ళలో బెదురుంది. ఆమె ఆ యింట్లో ప్రవేశించింది. ఆమె ఆ యింటి మెంబరు కాదు. తను వెళ్ళి తలుపుతడితే ఎవరో యువకుడు తలుపుతీశాడు. అతడి వంటికి ఘుమఘుమలాడే పరిమళముంది. ఆ యింట్లో తను తప్ప ఎవ్వరూ లేరన్నాడు.

ఆమె ఆ యింట్లో అడుగుపెట్టిందని చెప్పడం అతడికిష్టలేదు. ఇందులో ఏదో తిరకాసుంది. తన ఊహ రైటయితే అదతడి యిల్లు. ఆమె అతడినక్కడ రహస్యంగా కలుసుకుంటోంది. అంటే కాసేపట్లో ఆమె బయటకు

వస్తుంది.

సూర్యప్రకాశ్ ఓపికగా సందు మొగలో వేచి ఉన్నాడు.

కాసేపటికి గౌతమి ఆ యింట్లోంచి బయటకు వచ్చింది.

సూర్యప్రకాశ్ తిరిగి ఆమె ననుసరించాడు.

ఆమె బస్సెక్కితే ఆమె వెనుకనే తనూ బస్సెక్కాడు.

అప్పుడు గుప్పుమంది పరిమళం. అదే పరిమళం! ఇందాకా ఆ యువకుడు తలుపు తీసినప్పుడు వచ్చింది.

"నా ఆలోచన తప్పు కాలేదు...." అనుకున్నాడు సూర్యప్రకాశ్.

అతడు గౌతమి ననుసరించి వాళ్ళిల్లు తెలుసుకున్నాడు. చుట్టుపక్కల వాకబుచేసి ఆమె కుటుంబ పరిస్థితులు తెలుసుకున్నాడు.

"పిల్ల అందమైనది. ముఖంలో అమాయకత్వముంది. తప్పుదారిలో పడింది. ఎందుకో పాపం!" అనుకున్నాడు.

అప్పుడే అతడిలో రవంత ఆశ కూడా బయల్దేరింది.

ఆమె పేరు గౌతమి. తన కామె గురించిన రహస్యం తెలిసింది. ఈ రహస్యంతో బెదిరించి తనూ ఆమెను లొంగదీసుకుంటే....

అందుకామె యిల్లు అనువుకాదు.

అందుకే మర్నాడత డామె ఆఫీసు ముందు కాశాడు. గౌతమి రాగానే కాసేపాగి వెళ్ళి ఆమెను కలుసుకోవాలనుకున్నాడు. తనకు తెలిసిన విషయం చెప్పి బెదిరించాలనుకున్నాడు.

సూర్యప్రకాశ్ చూస్తూండగా ఆఫీసు తలుపులు తెరుచు

కున్నాయి. ఒకరొక్కరే ఉద్యోగులు లోనికి వెడుతున్నారు. గౌతమి కూడా లోపలకు వెళ్ళింది.

అతడు కాసేపు ఆఫీసుముందే ఆగాడు. గౌతమితో ఏమని మాట్లాడాలా అని ఆలోచిస్తున్నాడు. అతడి ఆలోచన లింకా సగంలో ఉండగానే ఆఫీసు ముందు కారాగింది. అందులోంచి జయదేవ్ దిగాడు.

అతణ్ణి చూసి సూర్యప్రకాశ్ ఉలిక్కిపడ్డాడు. జయదేవ్‌ను చూడగానే అతడికి గుర్తుపచ్చింది—ఖరీదైన సెంటు పరిమళం!

జయదేవ్‌ను తల్చుకుంటేనే చాలు అతడికా పరిమళమే సోకుతోంది. ఆ పరిమళం గౌతమివరకూ పాకిందన్న భావన అతడి మనసుల కదుల్తూనే ఉంది.

జయదేవ్ గురించి వాకబుచేసి అతడెవరో తెలుసుకున్నాడు సూర్యప్రకాశ్. అప్పుడతడికి అసలు విషయం అర్థమయింది.

తన ఆఫీసులో పని చేస్తున్న అమ్మాయిని—రహస్యంగా తనింటికి రప్పించుకుంటున్నాడు జయదేవ్.

ఇది తెలియగానే సూర్యప్రకాశ్ ఆలోచనలు మారిపోయాయి.

జయదేవ్ గౌతమిని రహస్యంగా కలుసుకుంటున్నాడు. అంటే తమ సంబంధం గురించి ఎవరికీ తెలియకూడదని అతడి తాపత్రయం. ఆ రహస్యం గౌతమి కెంత ముఖ్యమో—జయదేవ్‌కీ అంతే ముఖ్యం.

తను గౌతమిని బెదరించడంవల్ల ఆమెను పొందడం మినహా వేరే ప్రయోజన ముండదు. తనామెను పొందాలనుకున్నా రహస్యంగా ఎక్కడని కలుసుకుంటాడు? జర్నలిస్టుగా పదిమంది బ్రతుకులు బయట పెట్టాల్సిన

తను—తన జీవితం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. అది తన వృత్తికే ప్రమాదం.

పోతే జయదేవ్‌ని బెదిరిస్తే....తనకు డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో కావాలంటే గౌతమివంటి యువతుల్ని కొనుక్కోవచ్చు.

అంటే తను బ్లాక్‌మెయిలర్ అవుతాడా?

సూర్యప్రకాశ్ క్షణం ఆలోచించాడు.

జయదేవ్‌కి ఊళ్ళో పలుకుబడి ఉంది. మంచి పేరుంది. అతడు రహస్యంగా గౌతమిని కలుసుకుంటున్నాడు. ఇది పత్రికలకు పంపితే సంచలన వార్త కాగలదు. కానీ అందువల్ల గౌతమి జీవితానికి నష్టం....

సంచలన వార్తలకోసం తనో ఆడపిల్ల జీవితంతో ఆడుకోకూడదు....

సూర్యప్రకాశ్‌లో నిజంగా గౌతమిపట్ల జాలి పెరిగిందో—డబ్బుపట్ల ఆశ కలిగిందో చెప్పలేము కానీ అతడు చివరకు జయదేవ్‌ని బెదిరించి డబ్బు గుంజాలనే అనుకున్నాడు.

ఆ తర్వాత అతడు జయదేవ్ ఇంటి గురించీ, అతడికున్న మంచి పేరు గురించీ, గౌతమికీ అతడికీ జరిగే రాకపోకల గురించీ చాలా వివరాలు తెలుసుకుని ఓ పథకం వేశాడు.

4

"మిస్టర్ జయదేవ్!

ఎవరికీ తెలియకుండా ప్రకాశం సందులోని నీ యింట్లో నీ ఆఫీసులోని ఉద్యోగిని గౌతమితో నీవు కొనసాగిస్తున్న రహస్య ప్రేమకలాపం గురించి నేను తెలుసుకున్నాను. నీ రాసలీలలు ఫోటోలుగా

తీశాను. ఏ యే తేదీలలో ఏయే సమయాల్లో మీరు కలుసుకున్నారో ఆ వివరాలన్నీ నా దగ్గరున్నాయి.

మచ్చలేని ప్రవర్తనతో అతినీతిపరుడిగా వెలుగొందుతున్న అవినీతిపరుడివి నువ్వు. నీ జాతకం పత్రికాముఖంగా పదిమందికీ పరిచయం చేయాలనుంది. అయితే ఓ ఆడపిల్ల జీవితంతో ఆడుకోవడం ఇష్టంలేక ఆ పని చేయడంలేదు. కానీ నీవు నేను చెప్పినట్లు చేయకపోతే ఏమైనా చేయగలను నేను.

ఈ ఉత్తరం అందిన వెంటనే—ఈ కవర్లో నేను జతపర్చిన కవర్లో రెండువేల రూపాయలు—అన్నీ వందరూపాయల నోట్లుంచి — ఆఫీసు నుంచే పోస్టు చేయి. అడ్రసు కూడా నువ్వు రాసే శ్రమ లేదు. నేనే రాశాను. ఆ డబ్బు నాకు అందేక నీ సదుద్దేశ్యం గురించి నాకు తెలుస్తుంది. అప్పుడు మనం కలుసుకుని మళ్ళీ మాట్లాడుకుందాం. నీకు మచ్చరాని విధంగా వ్యవహారం సెటిల్ చేసుకుందాం—

ప్రస్తుతానికి సెలవు

నీ

శ్రేయోభిలాషి."

ఉత్తరం రాయడమయేక మరోసారి చదువుకున్నాడు సూర్యప్రకాశ్. తను చాలా బాగా రాశేనని తన్ను తనే మెచ్చుకున్నాడు.తర్వాత ఓ కవరుమీద—"పి. సుందరం" అన్న పేరుతో అడ్రసు వ్రాశాడు. ఉత్తరాన్నీ ఆ కవర్నీ అతడు ఓ కవర్లో పెట్టి జయదేవ్ అడ్రసు వ్రాసి, స్టాంపు అంటించి పోస్టు చేశాడు.

ఆ ఉత్తరం జయదేవ్‌కి ఏ పోస్టాఫీసు ద్వారా అందు తుందో అతడికి తెలుసు. సూర్యప్రకాశ్ ఆ పోస్టాఫీసువద్ద వేచి ఉండి ఏ రోజు తన ఉత్తరం జయదేవ్‌కు చేరుకుం టోందో చూశాడు.

ఆ రోజు అక్కడే కాశాడు.

జయదేవ్‌కి ఉత్తరం ఉదయం పది గంటల కందింది. మధ్యాహ్నం రెండు గంటలకు జయదేవ్ ఆఫీసు నుంచి ప్యూ నొకడు వచ్చి ఉత్తరం పోస్టు చేశాడు.

అక్కడే ఉన్న సూర్యప్రకాశ్ అంతా శ్రద్ధగా గమని స్తున్నాడు. పోస్టాఫీసు మరీ ఎదురుగా లేకపోయినా— జయదేవ్ ఆఫీసు నక్కణ్ణించి గమనించడం తేలికే!

ప్యూన్ చేతిలోని కవరు—తను జయదేవ్‌కి పంపిందే నని అతడు గ్రహించాడు. ప్యూన్ వెళ్ళిపోగానే అతడు తేలికగా నిట్టూర్చాడు.

ఇప్పుడు తనా కవరు సంపాదించాలి!

సూర్యప్రకాశ్ పోస్టు డబ్బా వంకనే చూస్తున్నాడు.

రెండున్నరకు డబ్బా క్లియర్ చేయడానికి పోస్టుమన్ వచ్చాడు. సూర్యప్రకాశ్ అతణ్ణి సమీపించాడు.

"సార్?" అన్నాడు.

పోస్టుమన్ ఉలిక్కిపడి సూర్యప్రకాశ్ వంక ప్రశ్నార్థ కంగా చూశాడు.

సూర్యప్రకాశ్ అతడికి తన చేతిలోని ఉత్తరం చూపించాడు. జయదేవ్‌ని అతడు పోస్టు చేయమన్నలాంటి కవరే అది!

పోస్టుమన్ చేయి చాపాడు.

"సార్—చిన్న పొరపాటు జరిగిపోయింది. మీరే

నాకు సాయపడాలి—" అన్నాడు సూర్యప్రకాశ్.

అతడు హుందాగా, పెద్దమనిషి తరహాగా ఉన్నాడు. తనను సార్ అన్నందుకు పోస్టుమన్ సంతోషించాడు.

"నేను మీకేం చేయగలను సార్!" అన్నాడు పోస్టుమన్.

"ఇలాంటి ఉత్తరమే ఇంకొక టిందులో పోస్టు చేశాను. నిజానికది రిజిష్టరు పోస్టులో వెళ్ళవలసిన కవరు. పొరపాటున ఈ ఉత్తరం పోస్టు చేయబోయి అది చేసేశాను—" అన్నాడు సూర్యప్రకాశ్ దీనంగా.

పోస్టుమన్ సానుభూతిగా—"దాందేముంది సార్! ఇప్పుడే చూద్దాం—" అంటూ పోస్టుబాక్స్ తెరిచాడు.

సూర్యప్రకాశ్ గుర్తుకోసం ప్రత్యేకమైన కవరు వాడాడు. దానికి తోడు శాంపుల్ కవరతడి చేతిలో ఉండనే ఉంది. పోస్టుమన్ సులభంగా కవరు తీశాడు. సూర్యప్రకాశ్ చేతిలోని ఉత్తరాన్నందుకున్నాడు.

రెండూ ఒకేరకం కవర్లు. రెండింటిపైనా ఒకే రకం దస్తూరి.

పోస్టుమన్ సందేహించకుండా కవర్లు మార్చేశాడు.

సూర్యప్రకాశ్ తన పథకం పారినందుకెంతో సంతోషించాడు. కానీ కవరందుకోగానే అతడికి రవంత నిరుత్సాహం కలిగింది. ఇరవై వందరూపాయల నోట్లను మోసేటంత బరువులేదు.

అతడు పోస్టాఫీసు నుంచి తిన్నగా ఇంటికి వెళ్ళి అప్పుడే కవరు తెరిచాడు.

కవర్లో ఓ ఉత్తరముంది.

"కబడ్దార్!

నా సంగతి నీకు తెలియదు. నువ్వెవరో నేను

తెలుసుకోగలను. నీ లాంటి వాళ్ళకు నేను భయ పడను. నన్ను కలుసుకుందుకు మరో ప్రయత్నం చేస్తే అది నిన్ను కటకటాల వెనక్కు పంప గలదు. నీ కెలా బుద్ధి చెప్పాలో నాకు బాగా తెలుసు. వేటగాణ్ణి రెచ్చగొట్టిన దుష్ఫలి మవ్వు. పరిణామాలకు సిద్ధంగా ఉండు.

ఇట్లు
గ్రేట్ హంటర్."

సూర్యప్రకాశ్ తెల్లబోయాడు.

జయదేవ్ ఇలా జవాబు రాస్తాడని అనుకోలేదు.

ఇప్పుడు తనేం చేయాలి?

గౌతమి, జయదేవ్‌లు కలుసుకుంటున్న విషయం మాత్రం అతడికి తెలుసు. వారి రహస్య ప్రేమకలాపాల నతడు ఫొటోలుగా తీయలేకపోయాడు. అందుకతడికి ధైర్యం చాలలేదు. ఊరికే జయదేవ్‌ని బెదిరించడానికని అతడు ఫోటోల గురించి రాశాడు. కానీ ఫలితం కనబడ లేదు.

తన అడ్రసు నిజమైనదే ననుకుని జయదేవ్ తన ఉనికి తెలుసుకోగల ననుకుంటున్నాడా? అతడు తన గురించి ఎలా తెలుసుకుంటాడు? తన నెలా వేటాడతాడు? తనకెలా బుద్ధి చెపుతాడు?

సూర్యప్రకాశ్‌కి భయం వేసింది. కోపమూ వచ్చిందీ.

జయదేవ్ బలవంతుడు. అతడితో విరోధం ప్రమాద కరం.

తన అసహాయతను గుర్తించేక సూర్యప్రకాశ్ కోప మంతా గౌతమివైపు తిరిగింది. ఆమె అందం అతడి నాక

ర్షించింది. అతడమెను వెన్నాడాడు. అదే చివరకు సూర్య ప్రకాశ్‌ని బ్లాక్‌మెయిలింగ్‌వైపు ప్రోత్సహించింది.

ఎంతో విలువైన సమయం వృధా అయింది.

వ్యవహారాన్నిలా వదలిపెట్టకూడదు. బలవంతుణ్ణెదిరించడానికి భయమైతే బలహీనులను వేధించాలి.

గౌతమి ఆడది. అందులోనూ భారతదేశంలోని ఆడది. అటుపైన ఆర్థిక బలంలేని ఆడది. అన్నింటికీ మించి దారి తప్పిన ఆడది.

జయదేవ్ సూర్యప్రకాశ్‌ను పేటాడతానని బెదిరించాడు. సూర్యప్రకాశ్ గౌతమిని పేటాడాలనుకున్నాడు.

5

"మీరెవరో నాకు తెలియదు. ఆఫీసు నుంచి బయటకు రాగానే అర్జంటుగా పార్కులో ఎందుకు మాట్లాడాలన్నారో తెలియదు—" అంది గౌతమి.

"అన్నీ వివరంగా చెబుతాను—" అన్నాడు సూర్యప్రకాశ్.

"చెప్పండి!" అంది గౌతమి.

"నాకు డబ్బు కావాలి—" అన్నాడు సూర్యప్రకాశ్.

గౌతమి విని ఊరుకుంది.

"అర్జంటుగా రెండువేలు...." అన్నాడు సూర్యప్రకాశ్.

గౌతమి ఆశ్యర్యంగా "మీ రెవరితో మాట్లాడుతున్నారో తెలుసా?" అంది.

"ఏం?"

గౌతమి అతడికి తన ఆర్థిక పరిస్థితిని వివరించి చెప్పింది.

సూర్యప్రకాశ్ నవ్వి—"ఆ విషయం నాకూ తెలుసు.

నేను మీ జీతంలోంచీ, యింట్లోంచీ డబ్బు తెమ్మని అడగడం లేదు. నా క్కావలసింది—జయదేవ్ మీ కిస్తున్న డబ్బులో వాటా!" అన్నాడు.

"జయదేవ్ ఎవరు....?" అంది గౌతమి ఏమీ ఎరుగనట్లు.

"నాకు మీ యిద్దరి గురించిన వివరాలన్నీ తెలుసు. నే నొక జర్నలిస్టును. వివరాలన్నీ పత్రికల్లో వేయించ గలను. కానీ మీ జీవితం నాశనమవుతుంది. నా కారణంగా మీ జీవితం నాశనంకావడం నా కిష్టంలేదు. అయితే అందుకు కొంత ప్రతిఫలా న్నాశించడంలోనూ తప్పులేదు. రెండువేలు చాలా చిన్న మొత్తం—" అంటూ సూర్యప్రకాశ్ వారిద్దరి గురించీ తనకు తెలిసిన దంతా చెప్పాడు.

గౌతమి తెల్లబోయింది. బుకాయించి ప్రయోజనం లేదని గ్రహించింది. తన పరిస్థితి ఒప్పుకుని—"అతడు నా కిచ్చే డబ్బులో వాటా ఇచ్చుకోలేను. నాకు జన్మనిచ్చిన తండ్రి కోసం నే నిది చేస్తున్నాను—...." అందామె.

సూర్యప్రకాశ్ ఆమెతో మరికాసేపు మాట్లాడి—ఆమె నుంచి తనకేమీ డబ్బు రాదని గ్రహించేక—"అయితే పోనీ—అప్పుడప్పుడు నన్ను కూడా జయదేవ్ అనుకో గలరా?" అన్నాడు.

"అంటే!"

"మీ రెలాగూ దారి తప్పారు. కాలుజారారు. ఆ రహస్యాసా దాచడాని కింకేమి చేసినా కొత్తగా అంటే పాప మేమీ ఉండదు—" అన్నాడు సూర్యప్రకాశ్.

గౌతమి నిట్టూర్చి—"నా అసహాయత నుపయోగించుకోవాలని చూస్తున్నారు మీరు...." అంది.

"తప్పు నాది కాదు. మీ అందానిది—" అన్నాడు

సూర్యప్రకాశ్.

"ఈ విషయమై నేను బాగా ఆలోచించాలి. నాకు గడువు కావాలి—" అంది గౌతమి.

"గడువిస్తాను. కానీ వారంరోజులు మాత్రం...." అన్నాడతడు.

"నా కా గడువు చాలు. సరిగ్గా వారం రోజుల తర్వాత మనం ఇదే పార్కులో ఇదే సమయంలో కలుసుకుందాం—" అంది గౌతమి.

"ఆ తర్వాత మీ కింక గడువు పెంచడం జరుగదు. ఈ వారంరోజులూ బాగా ఆలోచించండి—" అన్నాడు సూర్యప్రకాశ్.

6

సరిగ్గా నాలుగురోజుల తర్వాత సూర్యప్రకాశ్‌కు జయదేవ్ నుంచి కబురు వచ్చింది. ఆశ్చర్యం, భయం రెండూ కలిగినప్పటికీ అతడు జయదేవ్‌ను కలుసుకున్నాడు.

"అతినీతిపరుడని అంతా అంటారు నన్ను. నన్నవినీతిపరుడని రుజువు చేయాలనుకున్నావు నువ్వు. నిన్ను నేను సులభంగా కనుగొన్నాను. ప్రజల్లో నీతిని పెంచవలసిన పత్రికా విలేఖరివి. నువ్వు అవినీతికి పాల్పడతావా?" అన్నాడు జయదేవ్.

సూర్యప్రకాశ్ నెమ్మదిగా—"నా అవినీతి మీ అవినీతిని మాపలేదు—" అన్నాడు.

"అవినీతి నాది కాదు—నీది;" అన్నాడు జయదేవ్.

"ఎందుకని? ఒక అసహాయురాలు, అబల ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే—అది సావకాశంగా తీసుకుని ఆమె శీలాన్ని హరించాలనుకున్నారు. అది అవినీతి కాదా?"

"ఎవరు చెప్పారు నీ కీ విషయం?"

"ఒక మధ్య తరగతి ఆడపిల్ల సంప్రదాయానికి వ్యతిరేకంగా దారితప్పాడానికి కారణా లన్వేషించే పద్ధతులు నాకు తెలుసు...."

"గౌతమి దారితప్పలేదు...."

"అది మీ పరిభాష...."

"నేను, గౌతమి ప్రేమించుకున్నాం. ఒకరినొకరు అవగాహన చేసుకుందుకు రహస్యంగా కలుసుకుంటున్నాం."
అన్నాడు జయదేవ్.

"అవగాహన ఎన్నాళ్ళు?"

"అయిపోయింది. ఇప్పుడామె నాకు కాబోయే భార్య!"

సూర్యప్రకాశ్ తెల్లబోయాడు.

జయదేవ్ నవ్వి—"నేనెప్పుడూ నీతిని వదలిపెట్టలేదు. గౌతమి డబ్బు ఇబ్బందిలో వుంది. అది ఆసరాగా చేసుకుని ఆమెతో ఏకాంతాన్ని సంపాదించాను. అది కేవలం అవగాహనకోసం. ఆమె అమాయకత్వం, పవిత్రత—నన్నాకర్షించాయి. మేము పెళ్ళి చేసుకుంటున్నాం...."అన్నాడు.

సూర్యప్రకాశ్ వెంటనే అక్కణ్ణించి లేచి వెళ్ళిపోయాడు. అప్పుడతడికి తనంటే అసహ్యం వేసింది.

ఒక ఆగర్భశ్రీమంతుడు అందుబాటులో ఉన్న ఆడదాన్ని అర్ధాంగిగా స్వీకరించాలనుకుంటే—ఆ విశేషాన్నుపయోగించుకుని ఆ అతివను పొందాలనుకున్నాడు తను.

నైతికంగా తనకిది చెప్పుకోదగ్గ పతనం!

గౌతమి కాళ్ళమీద పడి క్షమార్పణ వేడుకొనడంకోసం మాత్రమే అతడు వారంరోజులు గడువు తర్వాత ఆమెను పార్కులో కలుసుకున్నాడు. ఆమెను చూసినపుడు క్షమించమనడానికి కూడా అతడికి గొంతు పెగలలేదు.

"సూర్యప్రకాశ్ గారూ! మీ ఋణం ఈ జన్మకు తీర్చుకో

లేను" అంది గౌతమి.

"నా ఋణమా? మీరు పరిహాసమాడుతున్నారు" అన్నాడు సూర్యప్రకాశ్.

"జయదేవ్ నన్ను కామించాడు. రహస్యంగా నన్ను రప్పించుకున్నాడు. మీరతడి బండారం తెలుసుకున్నారు. ఇంతవరకూ అతడి బండారం బయటపడలేదు. మచ్చలేని తన ప్రవర్తనకు మచ్చ ఆపాదించబడడాన్నతడు సహించ లేక తన కామకలాపాన్ని ప్రేమకలాపంగా మార్చి సమాజంలో తనకున్న ఇమేజ్ నిలబెట్టుకున్నాడు.

ఒక పత్రికా విలేఖరి దృష్టిలో తను తప్పుచేశానన్న భావముండకూడదని అతడి భావన. అదే మా వివాహానికి దారితీసింది. మీరు కలగజేసుకోకపోతే ఈ వివాహం జరిగి ఉండేదికాదు. అయితే ఇది మీరు ఋజువు చేయలేని విశేషం....."అని

"జయదేవ్ ఎటువంటివాడైనా అతడితో వివాహం నా అదృష్టమని అంతా అనుకుంటారు. అందరూ భావించే అదృష్టమే నాక్కావాలి. అటుపైన జీవితంలో భర్తను తప్ప పరపురుషులను స్పృశించలేదన్న తృప్తి కూడా నాకు మిగులుతుంది. నేను సంతోషంగా జయదేవ్‌ను పెళ్ళిచేసుకుంటాను. వివాహమయ్యేక మీకు తప్పకుండా రెండువేలూ యిచ్చుకుంటాను. దాంతో మీ ఋణం తీరుతుందనుకోను. కానీ చంద్రుడికో నూలుపోగు...."

గౌతమి వెళ్ళిపోతూంటే జరిగింది కలో, నిజమో తెలియక సూర్యప్రకాశ్ చాలాసేపు కూర్చుని ఉండిపోయాడు.

అయితే వివాహమైన కొద్దిమాసాలకు గౌతమి నుంచి సూర్యప్రకాశ్‌కు రెండు వేలరూపాయలు అందిన విశేషం మాత్రం నిజమే-భ్రమకాదు!

□

ప్రతాప రవిశంకర్

భూతంలాంటి సాక్షి

అదృష్టం జారిపోదు. మనుషుల్ని నీడలా వెంటాడుతూనే వుంటుంది. ఇప్పుడు నన్ను వెంటాడుతూనే నాతో మద్రాసు మహానగరానిక్కూడా వచ్చింది.

బస్సుదిగాను. దిగినవెంటనే ఎటూ వెళ్ళలేదు. అక్కడే విశాలంగా ఎత్తుగా పెరిగిన చెట్టుకిందే నిలబడ్డాను.

పైమెంతయ్యిందోనని చేతికున్న వాచీకేసి చూడలేదు. ఎందుకంటే బస్సు దిగటానికి ఒక్క నిముషం ముందు గానే చూశాను. అంటే ఇప్పుడు ఐదునిముషాలు తక్కువగా ఏడుగంటలయివుంటుంది.

బజారు దీపాలు వెలిగాయి.

పాండీబజారు బాగా రద్దీగావుంది. షాపులనిండా జనం కదులుతున్నారు. మద్రాసు నాకు కొత్తకాదు. బాగా పాత కూడా కాదు. ఫర్వాలేదు. ఓ మాదిరిగా తెలుసు. నా స్నేహితుడొకడు కొన్నేళ్ళక్రితం సినిమా అవకాశాల కోసం స్టుడియోల చుట్టూ తిరిగినప్పుడు వాడి డబ్బుతోనే మద్రాసును కొన్నిసార్లు చూశాను.

సిగరెట్టు బయటకు తీస్తూ చూశాను. పెట్టెలో మూడే సిగరెట్లు వున్నాయి. వెలిగించి పక్కకు చూసినప్పుడు ఒక యువతి భుజానికి ఎర్రటి బేగ్ తగిలించుకుని నిలబడి వుంది. నన్నే చూస్తోంది.

రేవతేమో అనుకున్నాను. కాని-కాదు. చటుక్కున ఎవరైనా చూస్తే రేవతనే అనుకుంటారు—ఆమె ఎవరో తెలిసినవాళ్లు. ఒకప్పుడు రేవతి కొంతమందికే తెలుసు.

ఇప్పుడలాకాదు. ఆమెను కూడా అదృష్టం నీడలా వెంటాడి మద్రాసుకు నెట్టుకువచ్చి మహానటిగా మార్చేసింది. ఆమె నటించిన మొదటి చిత్రం గొప్ప సంచలనాన్ని కలిగించి ఇంకా రన్నవుతూనేవుంది.

రేవతి ఎడ్రసువున్న కాయితం నా పర్సులోవుంది. కాని నాకు బాగానే గుర్తుంది.

నడుస్తుంటే ఒక ఆలోచన వచ్చింది. ఏదైనా షాపులోనించి ఆమెకు టెలిఫోన్ చెయ్యాలనుకున్నాను. ఆమె షాక్ ఫీలవుతుంది. నేను ఆమె ఇంటికి వెళ్ళటానికి

ముందుగానే ఎక్కడికయినా వెళ్లిపోవచ్చు నన్ను వదిలించు కునేందుకు___

అందుకే నేను రేవతికి టెలిఫోన్ చెయ్యలేదు.

పదినిముషాల నడకతర్వాత ఆమె ఇంటి దగ్గరకు వచ్చాను. మరీ పెద్ద బంగళాకాదు. ఆమె ఆ ఇంట్లో అద్దెకు వుంటోందని నాకు తెలుసు.

గేటుదగ్గర దీపం వెలుగుతోన్నది. ఎవడో గోడ దగ్గర నిలబడి సిగరెట్టు కాలుస్తున్నాడు.

"రేవతి వున్నదా?"

వాడు ముందు మాట్లాడలేదు. ఒక్క క్షణం నన్ను చూసి "మీరెవరు?" అనడిగాడు.

మళ్ళీ అడిగాను "రేవతివుందా?"

"ఇప్పుడే స్టుడియోనించి వచ్చింది. ఎవర్నీ లోపలకు రానివ్వొద్దని చెప్పింది"

నవ్వేను.

"నా కారు చెడిపోయింది దార్లో. అందుకే నడిచి వచ్చాను. ప్రొడ్యూసర్ రామానుజం పేరు నువ్వువిన్లేదా?" వాడి కళ్లలోకి నవ్వుతూ చూసి అడిగాను.

వాడు ఇంకేమీ మాట్లాడలేదు. ప్రొడ్యూసర్లను వెనక్కు పంపితే ఉద్యోగం వూడుతుందని వాడికి తెలిసి వుండాలి.

లోపలకు వెళ్ళమన్నాడు.

వసారాలో దీపం మసగ్గా వెలుగుతోంది. లోపల్నించి సన్నని సంగీతం వినపడుతోంది. బెల్ నొక్కాను.

ఒక్క నిముషానికి నలభైయేళ్ళ మనిషి బయటకువచ్చి ఏదో అడగబోయింది. కాని "రేవతి వుందా?" అని అడిగేసరికి "ఎవరొచ్చారని చెప్పమంటారు?" అన్నది.

"ప్రొడ్యూసర్ రామానుజం" అన్నాను నవ్వి.

చటుక్కున లోపలకు వెళ్ళిపోయింది.

వసారాలో నిలబడివున్నాను.

ఐదు నిముషాలకు రేవతి వచ్చింది. గుర్తుపట్టలేక పోయాను. మేకప్ చేసుకునివుంది. ఇంకా తుడుచుకోలేదు.

"నువ్వా!"

"అవును. ప్రొడ్యూసర్ రామానుజం" అంటూ మళ్ళీ నవ్వాను.

"నిజమే అనుకున్నాను. ఎందుకు అబద్ధం చెప్పావ్?" అన్నది కొంచెం కోపంగా.

"నేనని చెబితే నువ్వు బయటకు వచ్చేదానివేనా?"

"ఏం? నువ్వంటే భయపడుతున్నానని అనుకుంటు న్నావా?" అదోలా నవ్వుతూ అడిగింది.

"అవును. నీ గతానికి భూతంలాంటి సాక్షిని....భయ పడతావనే అనుకున్నాను. అందుకే అబద్ధం చెప్పాను"

"ఇది సినిమాలోకం. ఇక్కడ చాలామందికి అటు వంటి గతమే వుంటుంది. లోపల కూర్చుందాం" అంటూ నన్ను ఆమె ప్రయివేటుగదిలోకి తీసుకువెళ్ళింది.

ఇద్దరం ఎదురెదురుగా కుర్చీల్లో కూర్చున్నాం.

"ఎప్పుడో ఒకరోజు నువ్వు వస్తావని నాకు తెలుసు. వచ్చావు" అన్నది రేవతి.

నవ్వి "నన్ను మర్చిపోలేదన్నమాట" అన్నాను.

"నా జీవితాన్ని నాశనం చేసినవాడ్ని అంత సులభంగా మరచిపోతానా?"

"కాదు. ఇప్పుడు నువ్వు వెలుగులోకి వచ్చావ్. నా మీద కసి తీర్చుకోటానికే నువ్వు సినిమాల్లో చేరావు కదూ?"

"నా భవిష్యత్తుకోసం నేను నటిగా మారాను. నాకు ఎవరిమీదా కసిలేదు. అన్నీ మరచిపోయాను. ఇప్పుడు నాకు నా భవిష్యత్తు ముఖ్యం" అన్నది రేవతి సీరియస్‌గా.

"నాకర్థంకాదా....ఒక్క సినిమాతోనే నువ్వెంతో ఎదిగి పోయావు. నువ్వింకా పైకిరావాలి."

"థాంక్ యూ...." అన్నదామె నా కళ్ళలోకి చూస్తూ.

"ఇంతకీ ఎందుకొచ్చావ్? సినీ నటిగా నన్ను చూడా లనా?" అందామె మళ్ళీ.

"కాదు. సినీ నటుల్ని చూడాలనే క్రేజు నాకులేదు. రేవతిగా నిన్ను చూడాలని ఒకప్పటి నీ మొగుడిగా కొన్ని రోజులు నీతో గడపాలనీ వచ్చాను." అన్నాను సిగరెట్టు వెలిగిస్తూ—

రేవతి ఉలిక్కిపడింది. కొంచెం భయంగా నన్ను చూసింది. నాక్కావలసింది ఆ భయమే. ఆ భయంతోనే నేను రేవతిని ఎక్స్‌ప్లాయిట్ చెయ్యాలి.

ఉన్నట్టుండి రేవతి నవ్వి "నువ్వంటే ఇంకా నాకు ఇష్టంవుందనే అనుకుంటున్నావా?" అన్నది.

"ఇష్టం న్నా లేకపోయినా భరించకతప్పదు. అంతే కాదు. నేను ఆర్థికంగా చిక్కుల్లో ఇరుక్కున్నాను. కొంచెం డబ్బుకూడా నువ్వు ఎరేంజ్ చెయ్యాలి" అన్నాను పొగవదులుతూ.

"పెద్ద ప్లానుమీదే వచ్చావు. ఇదంతా జరుగుతుందనే అనుకుంటున్నావా?"

పెద్దగా నవ్వేను.

"అవును. మామూలుగా ఐతే జరగదు. కాని ఇప్పుడు జరుగుతుంది. అలా జరిగేట్టుగా నేను ఏర్పాట్లతోవచ్చాను."

"ఏర్పాట్లా!" మళ్ళీ భయంగా అడిగింది రేవతి....

"అవును. చెప్పమంటావా?" అడిగాను.

"మనిద్దరికీ పెళ్ళయ్యిందనీ, విడిపోయామనీ ఫీల్డులో అందరికీ చెబుతావా?" అన్నది.

నవ్వి "అందులో వింతలేదు. అదేంకాదు. ఇంకో ఏర్పాటువుంది" అన్నాను.

"ఏమిటా ఏర్పాటు?" ఈసారి భయంగా క్యూరియస్‌గా అడిగింది రేవతి.

"చెప్పను. నువ్వే చూడు" అంటూ జేబులోనించి ప్లాస్టిక్ కవరుతీసి అందులోవున్న ఒక ఫోటోను ఆమె కిచ్చాను.

అంతే_నేను వూహించినట్టుగానే షాక్ తిన్నది ఆమె. భయంతో ఆమె శరీరం వణికిపోవటాన్ని గమనించి నవ్వుతున్నాను.

"బావుందా? అందంగా వుందికదూ!"

"ఎప్పుడు తీశావ్?" కోపాన్ని అణుచుకుంటూ అడిగింది.

"ఎప్పుడయితేనేం? ఇప్పుడు నాకు ఉపయోగ పడుతుంది. అప్పుడే అభిమాన సంఘాలు తెరిచిన నీ అభిమానులు నీ గుడ్డల్లేని ఫోటోలను లైన్లో నిలబడి కొనుక్కుంటారు. కదూ?"

"నువ్వు మోసగాడివి. మనిషివికాదు" అన్నది ఆ ఫోటోని ముక్కలుగా చించి—

"నువ్వు ఏమైనా అనుకో....నాకు డబ్బుకావాలి. నీకు పరువు నిలవాలి. డబ్బులిచ్చి దాన్ని నిలబెట్టుకో."

"ఎంతకాలం?"

"తెలీదు. నువ్వు బాగా సంపాదించు, నా నోరు మూయించు."

"ఎందుకిలా నన్ను బాధపెడుతున్నావ్?" నా కళ్ళలోకి చూస్తూ అడిగింది.

"ఏ మనిషైనా సులభంగా డబ్బు సంపాదించే మార్గాన్నే వెతుకుతూ వుంటాడు. నే నీ మార్గాన్ని సెలక్టు చేసుకున్నాను. ఇంతకీ ఏమంటావ్?" అన్నాను.

"ఆ నెగెటివ్ మిగిలిన ఫోటోలు ఇవ్వు. వెయ్యి రూపాయలిస్తాను."

"వెయ్యిరూపాయలా?" అన్నాను పెద్దగా నవ్వి.

"నీ ఒకరాత్రి సంపాదన ఎంత?" అన్నాను.

"షటప్" అరిచింది.

"ఆల్‌రైట్....నాకెంతకావాలో చెబుతాను. ఆ నెగెటివ్ నీ కివ్వను. అది నా దగ్గరే వుంటుంది. నెలకు ఐదువేలు నువ్వు నాకివ్వాలి."

"ఐదువేలా!"

"అవును. ఐదువేలు నీకో లెక్కకాదు. నువ్వు ఒప్పుకోకపోతే పదివేలు చేస్తాను. ఆలోచించుకో" అన్నాను కుర్చీలో వెనక్కువాలుతూ—

ఆమె మాట్లాడలేదు. ఆలోచిస్తూ వుండిపోయింది. రేవతి ఒప్పుకుంటుందని నాకు తెలుసు. నటిగా ఉజ్వల భవిష్యత్తును ఆమె వూహించుకుంటోన్నది. నా దగ్గర వున్న ఫోటో నెగిటివ్ ఆమె భవిష్యత్తును నవ్వులపాలు చేస్తుంది.

"సారీ....నేనివ్వలేను" అన్నది చటుక్కున.

"ఐతే నీ భవిష్యత్తును నువ్వు కాల్చేసుకుంటావా?" అన్నాను.

"వద్దు....నన్ను భయపెట్టకు. పదివేలిస్తాను. ఆ నెగెటివ్ ఇవ్వు. నాకు మళ్ళీ కనపడకు."

"ఆల్ రైట్....నీకు డబ్బే ముఖ్యం అని అర్థమ య్యింది. నాకూ్కడా డబ్బే ముఖ్యం. నేనేం చెయ్యాలో నాకు తెలుసు. ఎవర్ని కలుసుకోవాలో ముందుగానే నిర్ణ యించుకున్నాను" అని లేవబోయాను.

"ఎవర్ని కలుసుకుంటావ్?" ఖంగారుగా అడిగింది.

"సినీతార సుందరి. ఎవరికయితే నువ్వు పోటీగా తయారయ్యావని అనుకుంటున్నదో ఆమె."

"ఎందుకు ఆమెను కలుసుకోవటం?"

"అర్థం కాలేదా? ఈ ఫొటో నిన్ను దెబ్బతీయాలంటే ఆమెకి బాగా ఉపయోగపడుతుందనుకుంటాను."

"వద్దు. నువ్వు సుందరిని కలుసుకోవద్దు" ప్రాధేయ పడుతున్నట్టుగా అన్నది.

"ఐతే నువ్వు నా బేరాన్ని ఒప్పుకున్నట్టేనా?"

"ఈ రాత్రి నాకు టైమివ్వు. ఆలోచించుకుని రేపు నా నిర్ణయాన్ని చెబుతాను. ప్లీజ్....కాదనకు."

జాలి కలిగింది ఆ మొహాన్ని చూసి. ఒక్క నిముషమే.

"ఆల్ రైట్....ఈ ఒక్కరాత్రి. రేపు ఉదయం ఎని మిది గంటలకు నిన్ను కలుసుకుంటాను."

ఆమె తల వూపి గోడనున్న గడియారాన్ని చూసి "ఇక నేను బయల్దేరాలి" అన్నది రేవతి.

"ఎక్కడికి?"

"స్టుడియోకి. షూటింగ్ వుంది. ఇంకో పది నిము షాల్లో కారు వస్తుంది."

"వెళతాను. ఎడ్వాన్సుగా ఒక వెయ్యి రూపాయలివ్వు ఈ రాత్రి గడవాలి" అంటూ నవ్వేను.

రేవతి నాకేసి అసహ్యంగానే చూసి ఐదునిముషాలకు వెయ్యి రూపాయలు ఇచ్చింది.

"థాంక్ యూ" అన్నాను.

"ఇంతకి నువ్వు ఎక్కడ దిగావ్?" అడిగింది.

"హోటల్ రోహిణి....నిద్ర పట్టకపోతే వచ్చెయ్యి. కబుర్లు చెప్పుకుందాం" అన్నాను.

రేవతి మాట్లాడలేదు. అక్కడనించి వెళ్ళిపోయింది.

బయటకు వచ్చాను.

ఎనిమిది గంటలు దాటిపోయింది.

ఆటోరిక్షా పిలిచాను. ఎక్కి ఎడ్రస్ చెప్పాను. ఆటో పరుగుదీస్తోంది రోడ్లమీద. నా అదృష్టం నన్ను వెంటాడుతూనే వుంది. నెలకు ఐదువేల బేరానికి రేవతి తప్పకుండా ఒప్పుకుంటుంది.

* * *

గాలిలో తేలిపోతున్నట్టుగా వుంది.

కుర్చీలో వెనక్కి వాలిపోయాను. వేళ్ళమధ్య సిగరెట్టు ఎర్రగా వెలుగుతోంది. అప్పటికే సగం బాటిల్ ఖాళీ అయిపోయింది. ఆలోచనలు అదుపుతప్పుతున్నాయి. రేవతి వస్తే బావుంటుందనుకున్నాను.

ఒకప్పుడు ఆమె నా భార్య. ప్రేమించి పెళ్ళి చేసుకుని ఆమె జీవితాన్ని నేనే నాశనం చేశాను. కాని ఆమె నా మీద కసితో జీవితంలో పైకి వస్తోంది. ఆమె ఎదుగుదలతో నేను లాభం పొందాలి.

సిగరెట్ ను ఎష్ట్రేలో నొక్కాను. జారిపోయింది. సిగరెట్ ముక్క కింద కాలిమీద పడింది. చుర్రుమన్నది. కాలు విదిలించాను.

కంట్రోలు తప్పుతున్నాను. నాకు తెలుసు. కళ్ళు మూసుకుపోతున్నాయి. ఏదో అగాథంలోకి జారిపోతు

న్నట్టుగా అనిపించింది. అంతే. ఆ తర్వాత నాకేమీ తెలేదు.

* * *

కళ్లు తెరిచాను. ఇంకా ఏడుగంటలు కాలేదు. ఏదో కాలుతున్న వాసన వస్తోంది.

ఆశ్చర్యం కలిగింది. కుర్చీలోనే నిద్రపోయాను. తల కిందికి వంచి చూశాను. అంతే. షాక్ తగిలినట్టు ఉలిక్కి పడ్డాను. టేబుల్ కిందగా నా ప్యాంటు, షర్టుపూర్తిగా తగల బడిపోయి వున్నాయి. ప్యాంటు ఇంకా కొంచెం కాలు తూనే వుంది.

అంటే - రాత్రి కాలు విదిలించినప్పుడు సిగరెట్టు ముక్క వాటిమీద పడివుంటుంది. స్టాండుమీద నించి అవి జారి కిందపడివుంటాయి.

చటుక్కునలేచి ముందుకు వంగి చూశాను.

ఏడుపు వచ్చింది. కొరడాతో వీపుమీద కొట్టినట్ల య్యింది. ప్యాంటు జేబులో వున్న మనీపర్సు పూర్తిగా కాలిపోయింది. అందులోనే డబ్బంతా వుంది. అంతే కాదు. ఎంతో విలువయిన రేవతి నెగటివ్ కూడా వుంది.

ఇప్పుడేం చెయ్యాలి?

హోటల్ బిల్లు ఎలా చెల్లించాలి?

గబగబా ఫోన్ దగ్గరకు నడిచాను. రిసీవర్ తీసుకుని ఆపరేటర్‌తో రేవతి నెంబర్ చెప్పాను.

రెండు నిముషాల్లో కనెక్షన్ వచ్చింది.

రేవతి "హలో" అంటోన్నది.

"నేను రేవతి."

"నువ్వా?"

"అవును. ఇప్పుడే బయలుదేరుతున్నాను. ఇంతకీ

ఏం నిర్ణయించుకున్నావ్? ఒప్పుకున్నట్లేకదూ" అన్నాను కొంచెం గంభీరంగా-ఐనా ఎందుకో నా గొంతు వణికింది.

"ఏమిటీ ఒప్పుకునేది? ఒక్క రూపాయి కూడా ఇవ్వను. నీ ఇష్టం వచ్చినట్టు చేసుకోవచ్చు" చాలా మామూలుగా అన్నది.

ఉలిక్కిపడ్డాను.

"ఏమిటి నీ ధైర్యం," అన్నాను గట్టిగా.

"నీకూ తెలుసు కదా....ఇప్పుడు నీ దగ్గర ఆ నెగెటివ్ లేదు. కాలిపోయింది."

ఇంక నా ఆశ్చర్యాన్ని అణచుకోలేకపోయాను.

"నీ కెట్లా తెలుసు?"

"రాత్రి స్టుడియోనించి ఇంటికి వెళుతూ నీ గదికి వచ్చాను. బాగా మత్తులో వున్నావు. నీ బట్టలు కాలు తున్నాయి. అప్పుడే చూశాను ఆ పర్సు ఆ ప్లాస్టిక్ కవరు కూడా - సంతోషంగా బయటికొచ్చాను. అర్థమయ్యిందా?" పెద్దగా నవ్వింది ఫోన్లో.

కత్తితో కోస్తున్నట్టు ఫీలయ్యాను.

"పెద్ద ఎత్తు వేశావు, చివరకు చిత్తయిపోయావు. సెంటిమెంట్లు నీకు నచ్చవుకానీ ఆడదాని కన్నీటికివున్న శక్తి నీకు అర్థం కాదు. ఇంతకీ డబ్బు కూడా పూర్తిగా కాలిపోయిందా? వెరీసారీ....నువ్వొక్కడివే మిగిలి పోయావు" రేవతి ఇంకా హేళనగా ఫోన్లో నవ్వుతోంది.

మైగాడ్! ఇప్పుడు బాగా గుర్తుకు వస్తోంది. ఆమె నవ్వులో అసలు నిజం ఏమిటో నాకు ఇప్పుడు బాగా అర్థ మవుతోంది. నాకు బాగా గుర్తు-రాత్రి నేను మత్తులోకి జారిపోయే ముందు నా పేంటు, షర్టు స్టాండుకు తగిలించ బడి వున్నాయి. □

నేరానికి నేస్తం

కుమారి సవిత

మునివేళ్ళతో తలుపుమీద చిన్నగా చప్పుడు చేసాడు పాతికేళ్ల వయసున్న నటరాజు.

సన్నటి సవ్వడి - ఆ తర్వాత నిశ్శబ్దం.

చిరాకు పుట్టుకొచ్చింది నటరాజుకి.

“సిటీలోవుంటూ కూడా కాలింగ్‌బెల్ పెట్టించుకోని

కొంప కొంపేనా?!'' మనసులో తిట్టుకున్నాడు.

"ఎవరది?"

అంది లోపల్నుంచి ఓ గొంతు తియ్యగా.

జవాబివ్వలేదు నటరాజు.

ఇవ్వకుండా తలుపు చప్పుడు రెట్టింపు చేసాడు.

మధ్యలో ఎందుకో ఓమారు అనుమానమేసి, వెనక్కి తిరిగి రోడ్డుకేసి చూసాడు.

ఆ రోడ్డు అలా సాగి సందు చివర్న మెయిన్‌రోడ్‌లో కలుస్తుంది. జనం నడుస్తున్నారు - హడావుడిగా ఆ రోడ్డుపై.

బిజీ లైఫ్——

ఈ మహానగరంలో ఎవరి ప్రపంచం వాళ్ళది——

ఎవడికివాడు పరిధులు గీసుకొంటున్నారు.

అది 'తనలాంటి వాళ్ళకి' చాలా మంచిది!

అర్థాంతరంగా అంతమైపోయాయి నటరాజు ఆలోచనలు——తలుపు తెరుచుకోవటంతో.

తలుపు తెర్చిన ఆమెవైపు తదేకంగా చూసాడు నటరాజు.

గృహిణులకి ప్రతీకలా వుందామె - ఒక్కమాటలో చెప్పాలంటే.

"ఎవరు నువ్వు?'' చిరాకుగా నటరాజు వాలకాన్ని చూస్తూ అడిగిందామె.

నిజంగానే ఆ సమయంలో నటరాజు వాలకం ఎవరికైనా కొద్దిగా చిరాకు తెప్పించకమానదు.

నలిగి, మాసిపోయిన బట్టలు, వాటిమీద అక్కడక్కడా రంగుల మరకలు, చిందర వందరగా నుదురుమీద పర్చుకొన్న జుట్టు——

"ఎవరు నువ్వు?"

"నాపేరు రవూఫ్ మేడమ్! మిసెస్ రోమాకౌర్ పంపించారు నన్ను. రంగులు వెయ్యాల్సిన పనేదన్నా వుందేమో—చెయ్యమని" గొంతు సర్దుకుని మృదువుగా చెప్పాడు నటరాజు.

అంతకు నాలుగురోజుల మునుపే ఆ లొకాల్టిలో ఎవ రెవరు వుంటున్నారో, ఆ ఫ్లాట్‌ల అసలు యజమాను లెవరో అన్ని వివరాలు సేకరించాడు రొటీన్‌గా.

అయిదేళ్ళుగా ఆ వృత్తిలోనేవుంటున్న నటరాజుకి ఇదంతా రొటీన్.

ఆవిడ మొహంలో అపనమ్మకాన్ని గుర్తించి, అన్నాడు నటరాజు. "మీరు నమ్మటం లేదనుకొంటా! విజయకృష్ణా పురం, సెక్టార్ నంబర్ 5 లో వుండే మిసెస్ రోమాకౌర్ దగ్గర్నుంచి సరాసరి వస్తున్నాను. ఆవిడ యింటికి రంగులు వేసి.

ఇక్కడ గాంధీపురంలో మీ యింటికి రంగులు వేయ మని డబ్బులిచ్చి, పంపించారావిడ నన్ను."

ఈసారి ఆవిడ మొహం వెలిగింది సంతోషంతో.

"మొన్న 'ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్'లో కన్పించి నప్పుడు, చెప్పాను—మిసెస్ రోమాకౌర్‌కి. మంచి పెయింటర్‌ని పంపించమని, గోడలు బాగా మాసిపోయాయి. సమయానికి వచ్చావ్."

బదులుగా చిన్ననవ్వు నవ్వాడు నటరాజు.

ఇలా ఫ్లాట్స్ అద్దెకిచ్చిన తర్వాత రంగులు వేయించే పాపాన ఏ ఫ్లాట్ యజమానిపోరు సామాన్యంగా.

ఆ ఫ్లాట్‌లో అద్దెకుండేవాళ్ళే రంగులు వేయించుకో వాలి. సహజంగానే వాళ్ళకంత తీరికా, వోపికా వుండవు.

అలా రోజులు వెళ్ళబెట్టేస్తారు.

ఎప్పుడో ఏడాదికోసాం బుద్ధిపుట్టినప్పుడు రంగులు వేయించుకుంటారు.

ఇదంతా నటరాజుకి తెలుసు.

తెలుసు అనడంకన్నా తెలుసుకొన్నాడు అనడం సబబు.

"లోపలికి రా! ముందు చూద్దువు."

తనంతట తానే కోరి, ప్రమాదాన్ని ఆహ్వానించిందా స్త్రీ.

నటరాజు పథకంలో మొదటిభాగం విజయవంతం అయ్యింది.

రెండు గదుల వాటా అది.

చిన్నయిల్లే అయినప్పటికి చాలా అందంగా అమర్చబడి వున్నాయి అన్నీ.

మొదటిగదిలో ఈజీచైర్స్, టీపాయ్, ఓ ప్రక్కగా బీరువా, టేబిల్‌మీద టేప్‌రికార్డర్, మడతపెట్టబడి గోడకి ఆన్చబడ్డ వైరుమంచాలు. చాలా ఖరీదైన సామగ్రి.

అన్నింటినీ పరీక్షగా చూసి, మెదడులో పదిలపర్చుకొన్నాడు.

మనసులో చకచకా లెక్కలు కట్టాడు అన్నింటికి కలిపి, ఎంత వస్తుందా అని.

"ఇది కిచెన్‌రూమ్, దీనికి కూడా రంగులు వెయ్యాలి" రెండోగది చూపిస్తూ, చెప్పిందావిడ.

అలాగేనన్నట్లు తలాడించాడు—నటరాజు.

అతనికా క్షణాన మాట్లాడ బుద్ధెయ్యలేదు.

ఆమెలోని అందం గమనిస్తున్నాడు. లేపాక్షిశిల్పపు వొయ్యారాలన్నీ ఆమెలో వున్నాయి.

క్షణం....క్షణకాలం....నటరాజుకి ఆమెపట్ల కోర్కె కలిగింది.

కాని అది క్షణకాలమే!

"ఎప్పుడూ రెండు నేరాలకి పొత్తు కుదరదు. వెంట వెంటనే రెండురకాల నేరాలు చెయ్యకూడదు"—ఇది నటరాజుకి అతని నేరానుభవం నేర్పిన సత్యం!

ఈసారి తన చూపుని ఆమె అందాలపట్లకాక, ఆభరణాల వైపుకి మళ్ళించాడు.

చెవికి దుద్దులు, మెడలో సన్నటి బంగారపు గొలుసు, ఎడమచేతి మధ్య వేలికి వేంకటేశ్వరస్వామి బొమ్మవున్న బంగారపు వుంగరం, రాళ్ళగాజులు....

హుషారుగా విజిలేసాడు నటరాజు. "ఎంత మేడమ్? ఓ గంటన్నరలో రంగులు వేసెయ్యవచ్చు."

జరగబోయేది తల్చుకుని, సంతోషపడ్డాడు.

"అహ-ఇప్పుడొద్దు! ఇవన్నీ సర్దుకొని, పక్కన బెట్టాలి. గోడలు దులుపుకోవాలి. ఆయన యింట్లో లేరు. వస్తే, సర్దుకోవటంలో సాయం చేస్తారు" హడావుడిగా అన్నదావిడ.

"సరే మేడమ్! నేను మధ్యాహ్నం రెండుగంటల ప్రాంతంలో వస్తాను" అని చెప్పి బయటికొచ్చాడు నటరాజు.

బయటికొచ్చేటప్పటికి పొరుగింటావిడ వుంది.

ఎంతో ఆసక్తిగా నటరాజుని పట్టిపట్టి చూస్తూ, అన్నదావిడ "రంగులు వేసేవాడివా! మా వాటాకి వెయ్యాలి? ఎంత కావాలంటావ్?"

ఓ అంకె చెప్పాడు నటరాజు.

అది తక్కువ అంకె కావడంతో అడిగిన ఆవిడ కళ్ళు మిలమిలా మెరిసాయి.

"నేను అన్నీ దులిపి వుంచుతాను. మధ్యాహ్నం ఆ

చేత్తోనే మా వాటాకి కూడా రంగెయ్యి" చెప్పిందావిడ.

నటరాజు రోడ్డుమీదకి నడిచాడు.

అతని పెదవులపై సంతోషంతో కూడిన చిరునవ్వు.

2

నటరాజు ఎనిమిదో క్లాసుతో ఫుల్‌స్టాప్ పెట్టేశాడు చదువుకి.

ఆ తర్వాత ఓ లారీ షెడ్డులో పనిచేశాడు. నెమ్మదిగా టిక్కెట్లు బ్లాకులో అమ్మటం మొదలుపెట్టాడు.

అంతే!—

వరుసగా నేరాలమెట్లు ఎక్కేసాడు.

జేబు దొంగతనాలనుంచి దారిదోపిడీలు—

రకరకాల నేరాలు!

ఎప్పటికప్పుడు కొత్త పద్ధతుల్లో నేరాలు ఎలా చెయ్యాలనేది ఆలోచిస్తూ, అమలులో పెడుతుంటాడు.

రొటీన్‌గా గాంధీపురంలో సెక్టార్ 4లో వుంటున్న వాళ్ళ చిరునామాలు యథాలాపంగా సేకరించాడు.

ఒక్కొక్కళ్ళ దగ్గర ఎంత డబ్బు లేదా విలువైన వస్తువులుంటాయనేది తెలుసుకోవడం కష్టసాధ్యమైంది నటరాజుకి.

అవి తెలుసుకోకుండా గుడ్డిగా యింట్లోకి జొరబడటం ఒక రకంగా రిస్కే!

రిస్క్ తీసుకోవడం నటరాజుకి ఎప్పుడూ యిష్టముండదు.

తీరా యింట్లోకి జొరబడిన తర్వాత వందో, రెండొందలో సరుకు దొరికిందంటే దాన్ని మించిన అవమానం మరొకటి వుండదు.

ఓ దొంగతనం చేసాడంటే, అందులో రెండువేలకి

తక్కువ కాకుండా సంపాదించాలనేది నటరాజుకున్న సిద్ధాంతం.

ప్రొద్దున మొత్తం నాలుగు యిళ్ళు చూసాడు. నాలుగు యిళ్ళ వాళ్ళకి మధ్యాహ్నం రంగులేస్తానని చెప్పాడు.

ఒకేసారి నాలుగిళ్ళు—

ఇరవై వేలకి ఎట్టి పరిస్థితుల్లో తక్కువ వుండదు.

మనసులో దొంగతనానికి కావల్సిన పరికరాలన్నీ తను సమకూర్చుకొన్నాడో లేదో ఆలోచించాడు.

నటరాజు కుడిచెయ్యి అప్రయత్నంగానే అతని మంచం ప్రక్కనే చిన్న స్టూలుమీద వున్న 'క్రైమ్ మాస్టర్' పుస్తకాన్ని అందుకొంది.

పేజీలు తిప్పి, రచయిత 'గాండీవి' వ్రాసిన "దొంగ గారు" కథ తీసాడు!

ఎంతో ఆప్యాయంగా ఆ కథని మరోమారు చదివాడు నటరాజు.

రంగులు వేసేవాడి వేషంలో వెళ్ళి, యింటిని దోచు కోవడమనే ఆలోచన నటరాజు మదిలో రూపుదిద్దుకోవ టానికి కారణం ఆ కథయే!

'దొంగగారు' కథా యితివృత్తం అదే!

3

"ఇల్లంతా సర్దేశారా మేడమ్?" మోపెడ్ యింటి ముందాపి, రంగుల డబ్బాలు, బ్రష్‌లు, స్ప్రేయర్ లోప లికి తీసుకొస్తూ అడిగాడు నటరాజు.

"ఆఁ, అంతా సర్దేసాను! పావుగంట నుంచి చూస్తూ కూర్చున్నాను" చెప్పిందావిడ చిరునవ్వుతో.

గోడలని సీరియస్‌గా పరీక్ష చేస్తున్నట్లు నటించాడు నటరాజు.

పెదాలు ఓ క్షణం బిగబెట్టి, ఏదో ఆలోచించినట్లు ఫోజు పెట్టాడు.

ఆవిడ కుర్చీలో కూర్చుని నటరాజుని చూస్తూంది—

"గోడలకి స్ప్రే పెయింటింగ్ అయితే బావుంటుం దేమో మేడమ్?" అన్నాడు నటరాజు స్ప్రేయర్‌ని చేతి లోకి తీసుకొంటూ.

"స్ప్రే పెయింటింగ్—బా ంటుందంటావా?"

"అద్భుతంగా వుంటుంది" అంటూ చటుక్కున స్ప్రేయర్ ఆమెవైపు తిప్పి, ఆమె మొహం మీదికి స్ప్రే చేసాడు నటరాజు—మెరుపుకు రెట్టింపు వేగంతో.

స్ప్రేయర్‌లో వున్న మత్తుమందు బయటికొచ్చింది. ఆ మత్తుమందు బయటికొస్తుండగా చప్పున ఊపిరి బిగ బట్టాడు నటరాజు రెండు నిమిషాలపాటు.

ఏం జరుగుతుందో అర్థం చేసుకొనే లోపలే, ఆవిడ స్పృహతప్పి పడిపోయింది.

తలుపుకి గొళ్ళెం పెట్టేసి, చకచకా తన పని తాను పూర్తి చేసుకొన్నాడు నటరాజు—ముక్కుకి జేబురుమాలు అడ్డం కట్టుకుని, (మత్తుగాలి ఏ మాత్రం పీల్చకుండా)

చెవి దుద్దులు, బంగారపు గొలుసు, వుంగరం, గాజులు, వెండి సామాను, బీరువాలోని రెండు పట్టుచీరలు, ఏడొం దల రూపాయల నగదు, టేప్‌రికార్డర్ అన్నీ ఖాళీ రంగుల డబ్బాల్లో సర్దేసాడు.

మొత్తం ఎనిమిది నిమిషాల్లో అతని దొంగతనం విజయవంతంగా పూర్తయ్యింది.

ఓ మంచం వాల్చి, ఆవిడ్ని దానిమీద పడుకోబెట్టాడు. చూసేవాళ్ళకి నిద్రపోతుందనే భ్రమ కలిగించేలా దుప్పటి కప్పాడు.

తలుపు దగ్గరికి వేసి, బయటికొచ్చాడు నటరాజు.

ఇంకా మూడిళ్లు వున్నాయి ప్రక్కప్రక్కనే. ఆ మూడిళ్ళు దోచుకోవటానికి అరగంటకన్నా ఎక్కువసేపు పట్టదు.

కాని ఈ అరగంటలో ఈవిడకి మెలకువ వస్తే—?

సామాన్యంగా రాదు. మత్తుమందు గంటన్నర పని చేస్తుంది.

'తను కంప్యూటర్ వేగానికి రెట్టింపుతో పని చెయ్యాలి—' ఓ దృఢనిశ్చయానికొచ్చాడు నటరాజు.

ఆ మధ్యాహ్న సమయంలో ఆడవాళ్ళు ఒక్కళ్ళు మాత్రమే తప్ప, యింకెవరూ వుండరన్న నటరాజు ఆలోచన నిజమైంది.

మరో ఏడు నిమిషాల్లో రెండో యిల్లు-

ఆపై ఎనిమిదినిమిషాల్లో మూడో యిల్లు-

ఆరున్నర నిమిషాల్లో నాలుగోయిల్లు-

రంగుల డబ్బాలన్నీ ఒక సంచీలో సర్ది, హేండిల్ కి తగిలించాడు.

మోపెడ్ స్టార్ట్ చెయ్యబోయాడు. కదలలేదు.

ఒక్కసారిగా ముచ్చెమటలు పట్టేసాయి నటరాజుకి.

మోపెడ్ టైర్లలోగాలి ఎవరో తీసేసారు-టైరుని బ్లేడుతో కోసారు.

గుండెలు వేగంగా కొట్టుకొన్నాయి నటరాజుకి.

ఆ సందుని చూసాడు. ఎవరూలేరు. అంతా నిర్మానుష్యం!

మరి ఎవరు చేసారిది?

ఆలోచించుకొనే వ్యవధి ఏమాత్రం దక్కలేదు నటరాజుకి ఆ సమయంలో.

అయితే ఆ తర్వాత మాత్రం నటరాజుకి తీరిగ్గా ఆలోచించుకోవడానికి కావల్సినంత ఖాళీ దొరికింది-జైల్లో.

నాలుగడుగులు వేసాడో లేదో, ఓ పోలీస్ జీప్ అతని ప్రక్కన వచ్చి ఆగింది.

4

పోలీస్‌స్టేషన్‌లో లాకప్‌రూమ్‌లో దిగులుగా కూర్చుని వున్నాడు నటరాజు.

అతనికి విపరీతమైన కసిగావుంది.

ఇన్నేళ్ళ దొంగజీవితంలో ఒక్కసారికూడా పోలీసుల లిస్టులోకి ఎక్కలేదు.

ఇప్పుడే-జీవితంలో తొలిసారి!

తన ప్లాన్-ఎక్కడ వికటించింది?

ఆ 'గాండీవి'గాడు రాసినట్లే, అంతా నిమిషాల్లో పకడ్బందీగా చేసాడు తను.

కథలో దొంగ దొరకలేదు.

తను దొరికాడు.

గాండీవిని ఓ పచ్చి బూతుమాట తిట్టుకుంటేగాని, నటరాజుకి కాస్తో, కూస్తో సంతృప్తి కలగలేదు.

"నా పేరు 'గాండీవి'! ఇన్ఫర్మేషన్ కోసం మీ దగ్గరకొచ్చాను" ఇన్‌స్పెక్టర్‌తో చెప్పాడు అప్పుడే స్టేషన్లో కొచ్చిన ఓ మధ్య వయస్కుడు.

"ఓహ్—రైటర్ గాండీవి! కొత్త క్రైమ్ కథకోసం సమాచార సేకరణా?! మీకు తోడ్పడటం నా అదృష్టంగా భావిస్తున్నాను. మీరు ప్రతి కథ శ్రద్ధ తీసుకొని, పకడ్బందీగా వ్రాస్తారు" కాంప్లిమెంట్ యిచ్చాడు ఇన్‌స్పెక్టర్.

చిరునవ్వు నవ్వాడు గాండీవి.

లాకప్ రూమ్‌లో కూర్చుని ఈ సంభాషణ వింటున్న

నటరాజు గట్టిగా అరిచాడు. "నీవల్లేరా—నేను జైలుపాలయ్యింది! రేయ్ గాండీవి—నీ కథ చదివి, దాని ప్రకారం దొంగతనం చెయ్యబోయి...." ఆవేశం నటరాజుని మిగిలిన వాక్యం పూర్తి చెయ్యనివ్వలేదు. పళ్ళు పటపటా కొరికాడు.

గాండీవికి అది సడన్ షాక్—"తను వ్రాసే క్రైమ్ కథలు యిలా హాని చేస్తున్నాయా సమాజానికి? తనిచ్చే ట్విస్ట్‌లు (నేరస్తుడు దొరక్కుండా) ఇలా నేరాలకి పురి కొల్పుతున్నాయా పాఠకుల్ని?"

ఆ షాక్‌నుంచి తేరుకోవటానికి గాండీవికి తక్కువ సమయమేమీ పట్టలేదు.

మరుక్షణం ఇన్‌స్పెక్టర్ లాకప్‌రూమ్ దగ్గరకొచ్చాడు. "ఏరా నీ బుర్రలో పుట్టిన పురుగుకి ఈ గాండీవిగారి కథ ప్రాణంపోసిందా?! భేష్, బావుంది.

ఆ కథలో నేరస్తుడు దొరకలేదు కనుక, అదే పద్ధతిలో చేస్తే నువ్వు తప్పించుకోవచ్చును అనుకొన్నావట్రా?!

ప్చ్, నీకు నిజం చెప్పనా?! క్రైమ్ కథలు నేరాల్ని ప్రోత్సహించవు. ముందు జాగ్రత్త పడేలా చేస్తాయి. పాఠకుల మెదడుకి పదును పెడతాయి.

ఏ కథ చదివి నువ్వు నేరం చేసావో, అదే కథ కాలక్షేపానికి చదివిన ఓ సామాన్య మహిళా పాఠకురాలు నిన్ను పట్టిచ్చింది చట్టానికి. నువ్వు ఎనిమిది నిమిషాల్లో ప్రతాపరావు యింట్లోనుంచి బయటికొచ్చెయ్యటం యథాలాపంగా చూసిన ఆ పాఠకురాలికి నీపట్ల ఆసక్తి పుట్టింది. గాండీవి గారి కథ గుర్తుకొచ్చి, నువ్వు అదే బాపతు అనుకొంది.

మొదటి యింట్లో మత్తుమందు ప్రభావంలో పడివున్న ప్రతాపరావు భార్యని చూసింది. ఇంటిముందున్న నీ

మోపెడ్ టైర్లు కోసి, గాలి తీసింది—నిన్ను వేగంగా కదలనివ్వకుండేందుకు.

వెంటనే మాకు ఫోన్ చేసిందావిడ.

ఆవిడ స్టేట్ మెంటిస్తూ, వ్రాసిన చివరివాక్యం ఏమిటో తెలుసా?

"గాండీవి గారి కథ చదవకపోతే, ఇలాంటి తెలివిగల నేరస్తులు కూడా వుంటారని, ఇంత పకడ్బందీగా నేరాలు చేస్తారన్న ఆలోచనే నాకొచ్చేది కాదు. పెయింటర్ వేషంలో వచ్చిన ఆ దొంగపట్ల అనుమానం కలిగించింది ఆ కథే—అని" బిగ్గరగా నవ్వుతూ చెప్పాడు ఇన్ స్పెక్టర్.

"ఇడియట్ ని!" కసిగా పిడికిళ్ళు బిగించి, లాకప్ రూమ్ గోడలకేసి కొట్టుకున్నాడు నటరాజు.

అదే సమయానికి—

గాండీవి మెదడులో ఓ మెరుపు మెరిసింది—"ఈ ఇతి వృత్తాన్నే కథగా వ్రాస్తే?!" □

లక్షకో చెక్కు!

లాకరు!

వసుంధర

దయానిధి డ్రాయింగ్ రూంలో కూర్చుని భార్యతో మాట్లాడుతున్నాడు. అతడి భార్య వాసవి వ్యాపార విషయమై తీవ్రంగా వాదిస్తోంది.

చాలాకాలం దయానిధి రకరకాల వ్యాపారాలు చేశాడు. ఆయన కిద్దరు కొడుకులు, ఒకకూతురు. అందరికీ పెళ్ళిళ్ళై

పోయాయి. వ్యాపారాలు పిల్లల కప్పగించేసి తను వేరే బంగళాలో స్థిరపడ్డాడాయన.

ప్రస్తుతం ఆయన వయసు యాభై అయిదు. మనిషి దృఢంగానూ, ఆరోగ్యంగానూ ఉన్నాడు. భార్య వాసవి కూడా చూడ్డానికి యాభై ఏళ్ళ మనిషిలా కనపడదు. ఇద్దరూ వయసుకంటె పదేళ్ళు చిన్నగా అగుపిస్తారు.

బంగళా మరీ పెద్దదీ కాదు, చిన్నదీ కాదు. డైనింగు హాలు, వంటగది కాక మొత్తం ఆరు గదులున్నాయి. అందులో నాలుగింటికి అటాచ్‌డ్ బాత్స్ వున్నాయి. ఒకటి డ్రాయింగురూం. ఆరోగది ఈ అయిదింటికంటె పెద్దది. అందులో వున్నాయి నాలుగు సేఫ్‌డిపాజిట్ లాకర్లు. ఒకోదాంట్లో రకరకాల సైజుల అరలున్నాయి. ప్రతి అరకూ పటిష్టమైన తలుపు, విశిష్టమైన తాళం, ప్రత్యేకమైన కోడ్‌నంబరు ఉన్నాయి.

అరల సైజునుబట్టి అద్దె రోజుకు పదిరూపాయల నుంచి ప్రారంభమై వందరూపాయల వరకూ ఉంటుంది.

వ్యాపారం నుంచి విరమించుకున్నాక దయానిధి ఈ లాకర్ల వ్యాపారం ప్రారంభించాడు. దీనివల్ల నెలకు యాభై వేల నుంచి లక్షరూపాయలకు తక్కువ కాకుండా సంపాదిస్తున్నాడు దయానిధి. అది కేవలం ఇన్‌కంటాక్సు వారికోసం చెప్పే అంకె అనీ—ఆయన ఆదాయం అంత కంటే ఇంకా బాగా ఎక్కువనీ చాలామంది అనుకుంటారు.

దయానిధి ఈ వ్యాపారం విషయంలో చాలా ఖచ్చితంగా వుంటాడు. తనవద్దకు వచ్చే కష్టమర్సుతో ఆయన "మీరు లాకర్లో ఏం దాస్తున్నదీ నాకు తెలియదు. మీరు దాచిన వస్తువు భద్రంగా వుంటుంది. అలా లేదంటే మీరే

అబద్ధం చెబుతున్నారని అర్థం. మీరు పూర్తిగా నన్ను నమ్మాలి. అలా నమ్మిన పక్షంలో మీ వస్తువు లక్కడ దాచుకోండి. దాచుకున్నాక మీరు చేసే ఫిర్యాదులకు నేను బాధ్యుణ్ణికాదు....'' అని చెబుతాడు.

దయానిధికి ప్రముఖ వ్యాపారస్థుడిగా పేరుంది. అందువల్ల ఆయనింత ఖచ్చితంగా చెప్పినప్పటికీ చాలమంది ఆయనవద్ద రహస్య పత్రాలు, విలువైన వజ్రాలు దాచుకుంటూనే వున్నారు. క్రమంగా ఆయన నిజాయితీకికూడా మంచిపేరు వచ్చింది.

ఎందరో ఆయన లాకర్లవల్ల ప్రయోజనం పొందుతున్నారు.

లాకర్లున్న గదిని స్ట్రాంగ్‌రూం అని పిలుస్తాడాయన. స్ట్రాంగ్ రూంలోనే దయానిధి ఇనప్పెట్టెకూడా వుంది.

ఆ గదిలో ఇనప్పెట్టె వుంచడం గురించి ఆయనకూ, భార్యకూ తరచుగా తగువవుతూంటుంది. అందులో ఇతరుల వస్తువులుంటున్నాయి. వాటిలో ఎన్నో విలువైనవి వుంటాయి. అందుకని ఆ గదిలో దొంగలుపడే అవకాశం ఎక్కువ. ఆ గదిలోనే తమ ఇనప్పెట్టెకూడా వుంటే అందరితోపాటు తమ ఆస్తి పోతుందంటుంది వాసవి. ఆమె కలవరపడడానికి కారణం—ఇనప్పెట్టెలో ఎప్పుడూ అయిదారు లక్షలకు తక్కువ కాకుండా క్యాషుంటుంది. పాతిక లక్షలు విలువచేసే ఆభరణాలున్నాయి.

తన ఇనప్పెట్టెను ఆ గదిలో వుంచడం—స్ట్రాంగ్ రూంపై తానుంచిన నమ్మకానికి నిదర్శనమంటాడు దయానిధి. తన సంపదకు భద్రత కల్పించుకోలేని వాడితరుల సంపదకు రక్షణ ఎలా కల్పించగలడన్నదాయన ప్రశ్న!

తమ ఇంటికి భద్రత ఏర్పాట్లు సరిగాలేవన్నది కూడా వాసవి బాధ. ఆస్తి నష్టమే కాక ప్రాణనష్టం గురించి కూడా ఆమెకు భయముంది.

ఇంటిచుట్టూ ప్రహారీగోడ వుంది. అది ఎత్తైనది. గోడపై అరంగుళాల ఎత్తున ముళ్ళ ఇనుపతీగె కూడా వుంది. రాత్రిళ్ళు ఆ తీగలోంచి కరెంట్ ప్రవహిస్తుంది.

ఇంటికి ఒక పెద్ద మెయిన్‌గేటు. గేటువద్ద ఇరవై నాలుగు గంటలూ కాపలా వుంటుంది. ఎనిమిదిగంటల కొకడు చొప్పున ముగ్గురు గూర్ఖా లా యింటికి కాపలాగా వుంటారు.

దయానిధి లాకర్ల వ్యాపారం ప్రారంభించి, నాలుగు సంవత్సరాలు కావస్తోంది. ఇంతవరకూ దొంగతనం గురించి ఒక్క ప్రయత్నంకూడా జరుగలేదు.

"పెద్ద పెద్ద బ్యాంకుల్నే పట్టపగలు దోచేస్తున్నారు. మనిల్లా గతుందా?" అంటుంది వాసవి.

"మనమున్న వీధిలోనే పోలీస్‌స్టేషనూ వుంది. మనకా భయంలేదు...." అంటాడు దయానిధి.

"పోలీసులు దొంగల్ని పట్టుకుందుకు సహకరించ గలరు. దొంగతనాల్నాపలేరు" అంటుంది వాసవి.

దయానిధి నవ్వి ఊరుకుంటాడు.

"ఈ వయసులో ఇంకా సంపాదన ఎందుకు?" అని వాసవికూడా అనదు. సంపాదనకు దయానిధి ఎన్నుకున్న పద్ధతికే వాసవి భయపడుతోంది. ఆ పద్ధతి ప్రమాదకర మైనదని ఆమె అనుమానం.

దయానిధి అందరికీ లాకర్సు ఇవ్వడు. అక్కడ లాకరు సంపాదించడానికి ప్రముఖుల హామీ కావాలి.

లాకర్లో వస్తువు దాచుకున్న వ్యక్తికి ఆ తాళంచెవి

యిస్తాడు దయానిధి. అతడు తాళంచెవి తిరిగివ్వకపోతే లాకర్ తాళం సిస్టం మార్చడానికయ్యే ఖర్చు హామీ వున్న ప్రముఖుడు ఇచ్చుకోవాలి. దయానిధి లాకరు తాళాలన్నింటికీ డూప్లికేట్సున్నాయి. అవన్నీ స్టేటుబ్యాంకు లాకర్లో వుంచాడు దయానిధి. ఊళ్ళోని మరో యిద్దరు ప్రముఖుల సమక్షంలో తప్ప ఆయన ఆ లాకరు తెంచే అవకాశం లేదు.

ఇన్ని జాగ్రత్తలు తీసుకునే వ్యవహారంపై నేరస్థుల దృష్టి పడకతప్పదు. ఇలాంటి చోటకు దొంగతనానికి వచ్చేవారు అన్నివిధాలా తయారై వస్తారు. వారి తయారీ ప్రాణాలు తీసేదిగా వుంటుంది.

ఈ వ్యాపారం వదిలిపెట్టమని వాసవి భర్తను పలుమార్లు హెచ్చరించింది. దయానిధి లక్ష్యపెట్టలేదు.

ప్రస్తుతం డ్రాయింగ్ రూంలో భార్యాభర్తలు కూర్చుని మాట్లాడుకుంటున్న విషయమిది కాదు.

సునీత గురించి ఎక్కదీస్తోంది వాసవి.

సునీత వయసిప్పుడు పాతికేళ్ళు. ఆమెకో అబ్బాయి. వాడికి నాలుగేళ్ళు. వాడు కడుపులో వుండగానే సునీత భర్త ప్రదీప్ చనిపోయాడు. ప్రదీప్ దయానిధి వద్ద పని చేసేవాడు. హఠాత్తుగా ప్రమాదంలో మరణించాడు.

దయానిధి సునీత కుటుంబానికి సంబంధించిన బాధ్యతలన్నీ తీసుకున్నాడు. ఆమె దర్జాగా బ్రతకడానికి ఏర్పాట్లు చేశాడు.

దయానిధి, సునీతల సంబంధం గురించి కొన్ని పుకార్లున్నాయి. దయానిధి వాటిని లెక్కచేయడం లేదు.

వాసవి పుకార్లకు భయపడాలంటుంది.

"పుకార్లకు భయపడ్డాను కాబట్టే ఆమెను వేరే ఇంట్లో

వుంచాను. లేకుంటే మనింట్లోనే వుంచి ఆదరించేవాణ్ణి"
అంటాడు దయానిధి.

"పోనీ ఆమెకు పునర్వివాహం చేయకూడదూ?"
అంటుంది వాసవి.

"ఆమె కిష్టంలేదు...."

"ఆమె కిష్టంలేదా—మీకా?" అంది వాసవి.

"ఆమె భర్తను ప్రాణాధికంగా ప్రేమించి అతడికి
తన్నుతాను ఆత్మార్పణ చేసుకుంది. మరో పురుషుణ్ణి తన
జీవితంలోకి భర్తగా ఆహ్వానించడానిక్కూడా ఆమె యిష్ట
పడడంలేదు. నేను తల్చుకుంటే డబ్బుతో ప్రలోభపెట్టి
ఏ యువకుడినైనా ఆమెకు భర్తగా తెస్తాను. కానీ ఆమె
అంగీకరించడంలేదు. అటువంటి అవకాశాన్నే వదులుకున్న
ఆమె ఇతరులతో కాలుజారుతుందా?"

"సునీతకు భర్తకంటే తన బిడ్డంటే ప్రేమ. వాడి
కన్యాయం చేయకూడదని ఆమె పునర్వివాహం చేసుకో
వడం లేదు. ఏ భాగ్యవంతుడినో నమ్ముకుంటే తన
సంసారం ఖర్చులు వెళ్ళిపోతాయని ఆలోచించి ఉంటుంది."

"అంతమాత్రాన బిడ్డమీదున్న ప్రేమ భర్తమీద లేదం
టావా?"

"లేదనే అంటాను. ఏ భాగ్యవంతుడైనా వయసులో
వున్న యువతికి—ఎందుకు సాయపడతాడు?" అంది
వాసవి.

"ఏమో—నేను సాయపడ్డం లేదూ" అన్నాడు భార్య
భావం అర్థంకానివాడిలా దయానిధి.

"మీగురించే నేనూ అంటుంట" అంది వాసవి.

సంభాషణ ఇంతవరకూ చాలాసార్లు వచ్చింది కానీ ఈ
రోజింకా స్త ముందుకు వెళ్ళింది: వాసవి భర్తను నిలదీసి

"నేను బ్రతికుండగా ఇది సహించలేను" అంది.

"నువ్వు భ్రమపడుతున్నావు" అన్నాడు దయానిధి.

"అలాగని మీరే నన్ను భ్రమపెడుతున్నారు. ఆమె బాధ్యతను మీరెందుకు తీసుకోవాలి?" అంది వాసవి.

చెక్కు రూపేణా ధనమివ్వడం మినహాయించి దయానిధి సునీతను కలుసుకునేది తక్కువ. కలుసుకున్నప్పుడు కూడా వారి ఏకాంతపు పరిమితి తక్కువ. అటువంటప్పుడు ఇతరుల విషయమెలా ఉన్నా కనీసం వాసవి తమ సంబంధాన్ని తప్పుపట్టకూడదని దయానిధి వాదించేవాడు.

ఈరోజు వాసవి ఆ వాదన కొప్పుకోలేదు.

"అవకాశాలు పదిమందికీ తెలిసేలా ఉపయోగించుకుంటారా? అందులోనూ ఇలాంటి విషయాలు భార్యకు బొత్తిగా తెలియనివ్వరు. మీరు బయటకు వెళ్ళినప్పుడల్లా నాకు నిజమే చెబుతున్నారన్న నమ్మకమేమిటి?" అందామె. అలాగని సునీత బాధ్యత తీసుకోవలసిన అవసరమేమిటని పదే పదే భర్తను నొక్కించింది.

చివరకు దయానిధి విసిగిపోయి "అయితే అసలు సంగతి చెప్పేస్తున్నాను విను. ప్రదీప్ లాకర్లను ప్రత్యేకంగా తయారు చేయడంలో సహకరించాడు. మామూలుగా బలమైన, దట్టమైన తలుపులతో తయారు చేయబడ్డ ఈ లాకర్లు, మన ఇనప్పెట్టెలలో ఓ ప్రత్యేకత వుంది. ఆ ప్రత్యేకత కారణంగా దొంగలు వాటిని దోచలేరు. ఆ ప్రత్యేకత నాకూ, ప్రదీప్‌కూ మాత్రమే తెలుసు" అన్నాడు.

"అయితే?"

"ఈ విషయం మూడో మనిషికి తెలిసింది. అతడెవరో నాకు తెలియదు. మన లాకర్ల రహస్యం తెలియ

జేయమని అతడు ప్రదీప్‌ని సామ, దాన, భేద, దండో పాయాలుపయోగించి అడిగాడు. ఎప్పటి కప్పుడు ప్రదీప్ నాకు విషయం తెలియజేసేవాడు. ఆ మనిషెవరో తెలుసు కోవాలని నేను చాలా ప్రయత్నించాను. కానీ సాధ్యపడ లేదు. చివరికి ఒక రోజున ప్రదీప్ ఆక్సిడెంటుకు గుర య్యాడు. మరణించాడు.

ఆ మనిషి ప్రదీప్‌మీద పగ తీర్చుకున్నాడో, ఆ మనిషి తన్ను లొంగదీసుకోగలడని భయపడి ప్రదీపే ఆత్మహత్య చేసుకున్నాడో నాకు తెలియదు. అతడి చావు మన కార ణంగా అన్న విషయం నాకు తెలుసు. అతడిభార్య సునీత కూడా ఈ విషయం తెలియదు. ఇప్పుడు చెప్పు. ప్రదీప్ కుటుంబం నాకు బాధ్యత అవునా, కాదా?" అన్నాడు దయానిధి.

వాసవి ఆశ్చర్యంగా "చాలా కొత్తవిశేషం విన్నాను. ఇది మీరు నానుంచి చాలాకాలం దాచారు" అంది.

"ఇందులో నీకు చెప్పుకుని సాధించేదేమీ లేదుగదా! నీ సాధింపు భరించలేక ఇప్పుడైనా ఈ విషయం చెప్పాను" అన్నాడు దయానిధి.

"నాకు మీరు చెప్పకుండా దాచారంటే నాకింకో అను మానం కలుగుతోంది."

"ఏమిటది?" అన్నాడు దయానిధి.

"ప్రదీప్‌కు కీలకమైన రహస్యమే తెలుసు. వ్యాపా రస్థు లటువంటివాణ్ణి బ్రతకనివ్వరంటారు. మూడో మనిషి గురించి మీరు చెప్పినది నమ్మతగ్గదిగా లేదు. మీ రహస్యం మూడో మనిషిదాకా వెళ్ళకుండా మీరే ప్రదీప్‌ని........"

ఆమెను మధ్యలో ఆపి—"నువ్వు నన్ననుమానిస్తు న్నావా?" అన్నాడు.

"నా పదహారో ఏట మీతో కాపురానికి వచ్చాను. ఇప్పుడు నాకు ఏభై ఏళ్ళు...." అంది వాసవి గంభీరంగా.

"అంటే - నేనే ప్రదీప్‌ని హత్యచేసి ఆ పాపభీతితో సునీతకు సాయపడుతున్నానంటావా?" అన్నాడు దయానిధి కోపంగా.

"అలాగనలేను కానీ-మీ రెవరికి సాయపడ్డా అందుకు కారణం స్వార్థం కాకపోతే పాపభీతే అయుండాలి" అంది వాసవి.

"నీ అనుమానం అర్థం లేదని ఋజువు చేయడమెలా?"

"ప్రదీప్ అమాయకుడు. మంచివాడు. స్వామిభక్తుడు. అతణ్ణి గనుక మీరు చంపించి వుంటే ఆ పాపం మిమ్మల్ని వదలదు. మీ లాకర్ల వ్యాపారంలో ఏదో దెబ్బ తగిలితీరుతుంది. నాకా నమ్మకముంది. ఇంతవరకూ అలా జరుగలేదు. కాబట్టి సునీతకు సాయపడడంలో మీకు స్వార్థముండే వుండాలనుకుంటున్నాను...." అంది వాసవి.

అప్పటి కామెతో అంతకు మించి మాట్లాడడం మేలు కాదని వూరుకున్నాడు దయానిధి. కానీ ఆయన బుర్ర తీవ్రంగా ఆలోచిస్తూనే వుంది.

అయితే వాసవి మాటలు నిజమవుతాయని అప్పట్లో ఆయనకు తెలియదు.

2

అర్ధరాత్రి పన్నెండు గంటల సమయం.

దయానిధి ఇంటిగోడ చుట్టూ ప్రదక్షిణం చేశారు నలుగురు వ్యక్తు... వారు ప్రదక్షిణం చేసిన విధానం అనుమానాస్పదంగా లేదు. వారు నలుగురూ కలిసి తిరగడం

లేదు. ఒకొక్కరికి కనీసం యాభై గజాల దూరముంది.

ముందుగా ఒక వ్యక్తి గేటు దగ్గర గూర్ఖాను పలకరించి అగ్గిపెట్టె అడిగాడు. గూర్ఖా అతడికి అగ్గిపెట్టె యిచ్చాడు. ప్రతిఫలంగా అతడు గూర్ఖాకి సిగరెట్టిచ్చి వెళ్ళిపోయాడు. గూర్ఖా ఆ సిగరెట్ వెలిగించడానికి తటపటాయించాడు. కానీ తనకదిచ్చిన వ్యక్తి పెద్దమనిషిలాగున్నాడు. వెంటనే వెళ్ళిపోయాడు కూడా.

గూర్ఖా ఇంకా సిగరెట్ వెలిగించకుండానే రెండో వ్యక్తి అతడి వద్దకు వచ్చాడు. మొదటి వ్యక్తిని వర్ణించి చెప్పి "నువ్వలాంటి మనిషిని చూశావా?" అనడిగాడు.

"ఎందుకు?" అన్నాడు గూర్ఖా.

"అతడొక స్మగ్లరు. నేనతణ్ణి అనుసరించి వస్తున్నాను. విలువయిన వజ్రాలను సిగరెట్లలో దాచి స్మగ్లింగ్ చేస్తున్నాడతడు. అతడెలా వెళ్ళాడో చెప్పగలవా?" అన్నాడు రెండో వ్యక్తి.

గూర్ఖా అతడికి దారి చూపించాడు.

రెండోవ్యక్తి వెళ్ళగానే గూర్ఖాకు తన దగ్గరున్న సిగరెట్ బరువుగా వున్నదని గుర్తుకు వచ్చింది. మొదటి వ్యక్తి వజ్రాలున్న సిగరెట్‌ను తాత్కాలికంగా తనవద్ద వుంచాడా? దానికోసం మళ్ళీ వస్తాడా? అందులోని వజ్రాలు తనే కాజేస్తే....

గూర్ఖా వెళ్ళి బల్లమీద కూర్చుని మొదటి వ్యక్తి తనకిచ్చిన సిగరెట్‌ను నెమ్మదిగా విప్పాడు. సిగరెట్ విప్పగానే ఏదో పరిమళం అతడి ముక్కుపుటాలకు సోకింది. గూర్ఖా కూర్చున్నవాడు కూర్చున్నట్లే అలా వుండిపోయాడు.

ఈలోగా మూడోవ్యక్తి అక్కడకు వచ్చాడు. బిగు

సుకుపోయి కూర్చున్న గూర్ఖాను నిలబెట్టాడు. నెమ్మదిగా లోపలకు తీసుకు వెళ్ళాడు. ఓ మొక్కచాటున పడుకోబెట్టాడు. అతడు కూడా గూర్ఖా డ్రస్సులోనే వున్నాడు.

తాపీగా వెళ్ళి గేటువద్ద బల్లమీద కూర్చున్నాడతడు.

ఆ తర్వాత బంగళా గోడకు ప్రదక్షిణం చేసినమిగతా వ్యక్తులూ లోపలకు వెళ్ళారు. గూర్ఖా వారికి విష్‌చేసి "త్వరగా పని ముగించుకుని రండి" అన్నాడు.

"తొందరేమీ లేదు. ఆ గూర్ఖా ఇప్పట్లో లేవడు. మేము నెమ్మదిగా పనులు చూసుకుని వస్తాం. నువ్వు మాత్రం నిద్రపోకు" అంటూ ముగ్గురూ లోపలకు వెళ్లారు.

గూర్ఖా సీట్లో కూర్చున్న వ్యక్తి తన మిత్రులవంకనే చూస్తున్నాడు. ఈలోగా అతడినెవరో పలకరించారు.

"ఎవరువాళ్ళు?"

ఆ వ్యక్తి వెనక్కు తిరిగాడు. ఒక అజానుబాహుడు కనిపించాడు.

"ఎవరు మీరు?" అన్నాడా వ్యక్తి.

"ఇంత రాత్రివేళ ఇంట్లోకి వెడుతున్నారు. ఎవరు వాళ్ళు?" అన్నాడా ఆజానుబాహుడు.

"ఎవరయితేనేం - అపాయింట్‌మెంటుంది" అన్నాడు గూర్ఖా.

"అయ్‌సీ" అని అజానుబాహుడు వెళ్ళిపోయాడు.

"ఎవరో దూరాన్నుంచి ఈ గేటును గమనిస్తూంటారన్నమాట!" అనుకున్నాడు గూర్ఖా బల్లమీద కూర్చున్న వ్యక్తి. తాము గూర్ఖామీద బలప్రయోగం చేసివుంటే బయటపడి వుండేవారు, తను గూర్ఖాని భుజంమీద చేయి వేసి లోపలకు తీసుకువెడుతున్న దృశ్యం చూసి అజాను బాహుడు వచ్చాడన్నమాట!

మళ్ళీ గూర్ఖాను యధాస్థానంలోకి తీసుకుని రావడ మెలాగో?

దూరాన్నుంచి ఓ ఆజానుబాహుడు తన్ను గమనిస్తు న్నాడన్న ఆలోచన అతణ్ణి భయపెట్టింది. అయితే ఆ ఆజానుబాహుడు దూరాన్నుంచి దయానిధికి ఫోన్ చేయ బోతున్నాడన్న విషయం తెలిస్తే అతడింక ఎంతగా కల వరపడేవాడో!

3

ఆ ముగ్గురు వ్యక్తులూ లోపల ప్రవేశించారు. తిన్నగా దయానిధి పడక గదిలోకి వెళ్ళారు. ఒకడు వెళ్ళి దయా నిధిని తట్టి లేపాడు. అతడితోపాటే వాసవికూడా వులిక్కి పడి లేచింది.

"కేకలు పెట్టకద్దు. మేము మీ యింటికి దొంగతనానికి వచ్చాం. నేను నాయకుణ్ణి' అన్నాడు దయానిధిని లేపిన వ్యక్తి.

దయానిధికీ, వాసవికీ నోట మాట రాలేదు.

"గూర్ఖానూ, గేటునూ దూరాన్నుంచి ఓ వ్యక్తి గమ నిస్తూంటాడని నాకు తెలుసు. అందుకు తగిన జాగ్రత్తలు కూడా నేను తీసుకున్నాను. ఇప్పుడు నీకావ్యక్తి ఫోన్ చేస్తాడు. నీయోగక్షేమాలు విచారిస్తాడు. నువ్వు కోడ్ భాషలో మొత్తం సమాచారం అతడికందించగలవని నాకు తెలుసు. అందుకే ఫోన్‌లో నువ్వేం మాట్లాడవలసినదీ కాగితంమీద ముందుగానే రాసి తెచ్చాను. అందుకు భిన్నంగా మాట్లాడేవా-ముందు నీ భార్య, అటుపైన నువ్వు తర్వాత ఈ బిల్డింగు...." అని ఆగి—"ఏమౌతాయో చెప్పనవసరం లేదుగా-అర్థం చేసుకోగలవనుకొంటాను" అన్నాడు నాయకుడు.

దయానిధి అయోమయంగా నాయకుడి వంక చూశాడు.

నాయకుడు మరోసారి వివరంగా అంతా చెప్పి ఓ కాగితం ఆయన కందించాడు. దయానిధి ఆ కాగితం వైపు చూస్తూండగా గదిలో ఫోన్ మ్రోగింది.

దయానిధి ఫోన్ అందుకున్నాడు. ఇద్దరు దొంగలు వాసవి కటూ యిటూ నిలబడ్డారు. ఇప్పుడు వారి చేతులలో పిస్తోళ్ళున్నాయి.

"హలో!" అన్నాడు దయానిధి.

"సార్ - క్షేమమా?"

"ఆహా - క్షేమమే!"

"ఎవరో ముగ్గురు లోపలకు వచ్చారు...."

"వాళ్ళు మనకు ముఖ్యులే!"

"సారీ సర్....మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను...."

"ఇటీజ్ వెరీ గుడ్‌వర్క్. కావాలంటే నువ్వుహాయిగా పడుకోవచ్చు...."

"థాంక్యూ సర్....నా డ్యూటీ నేను చేస్తాను."

"ఓ కే...." అని ఫోన్ పెట్టేశాడు దయానిధి.

"వెరీగుడ్!" అన్నాడు నాయకుడు.

"ఇప్పుడేం చేస్తావ్?" అన్నాడు దయానిధి.

"నీ యిల్లు దోస్తాను...." అన్నాడు నాయకుడు.

దయానిధి ముఖంలో ఖంగారు కనపడింది. నాయకుడతడినే గమనిస్తూ - "నేను శాంతికాముకుణ్ణి. బుద్ధిగా వున్నవారి జోలికి వెళ్ళను. అల్లరిచేస్తే నాఅంత చెడ్డవాడుండడు. నువ్వు నాకు సహకరిస్తే ఈ యింట్లో ఒక్క రక్తపుబొట్టు కూడా చిందదు...." అన్నాడు.

"నాకు ప్రాణాలంటే తీపి" అన్నాడు దయానిధి.

"ప్రాణంమీది తీపితో నువ్వు డబ్బు కూడబెట్టావు.

డబ్బు కోసం నేను ప్రాణాలకు తెగించాను. ఆ సంగతి ఈపాటికి నీ కర్థమై ఉండాలి....” అన్నాడు నాయకుడు.

“నేనేం చేయాలో చెప్పు—” అన్నాడు దయానిధి.

“నాదగ్గర నాలుగు లాకరు తాళాలున్నాయి. ఒకటి సేట్ ఈశ్వరదాసుది. ఆయన అయిదు లక్షల విలువచేసే వజ్రాలు నీ లాకర్లో దాచాడు. రెండవది వీరరాఘవులుది. అతడు డిఫెన్సుకి సంబంధించిన రహస్య సమాచారం లాకర్లో దాచాడు. మూడవది మాణిక్యాలరావుది. అతడి వద్ద బ్లాక్‌మెయిలింగుకు సంబంధించిన ఫొటోలున్నాయి. నాల్గవది కిషన్‌లాల్‌ది. రెండు లక్షల విలువచేసే మత్తు పదార్థాలు నీ లాకర్లో దాచాడు—” అన్నాడు.

“ఎవరెవరు ఏమేమి దాచారో నాకు తెలియదు. కానీ లాకరు తాళాలు నీదగ్గర కెలా వచ్చాయి?” అన్నాడు దయానిధి ఆశ్చర్యంగా.

“నాక్కావలసిన మనుషుల్ని నేను వెంటాడుతూనే ఉంటాను. వాళ్లు నాక్కావలసిన వస్తువుల్ని నీలాకర్లో దాచినట్లు నా మనుషులు చెప్పారు. వాళ్ళ దగ్గర్నుంచి లాకరు తాళాలు సంపాదించడం నాకు కష్టంకాదు....”

“వాళ్ళందరూ ప్రముఖులు. వాళ్ళనుంచి లాకరు తాళాలు సంపాదించడం సామాన్యుడి తరంకాదు....” అన్నాడు దయానిధి.

“నేను సామాన్యుణ్ణికాదు....” అని నవ్వాడు నాయకుడు - “పద—లాకరు తెరుద్దాం....”

దయానిధి, ముగ్గురు వ్యక్తులు, వాసవి స్ట్రాంగ్ రూంలో అడుగుపెట్టారు.

“ఓహో—నీ యినప్పెట్టి కూడా యిక్కడే ఉందన్న మాట! ఇందులో నాకు లాకర్లోకంటే విలువైనవే దొర

కొచ్చు" అన్నాడు నాయకు డుత్సాహంగా. అతడి కళ్ళు మెరిశాయి.

"లాకర్లో వస్తువులుపోతే నేను జవాబుదారీకాదు. అందులోనూ తాళాలు జాగ్రత్తపరచుకోలేని వాళ్ళ వస్తువుల భద్రతకు మొదలే గ్యారంటీలేదు...." అని—

"దయుంచి నా ఇనప్పెట్టి జోలికి వెళ్ళకు...." అన్నాడు.

నాయకుడు నవ్వి - "నీవంటివాళ్ళు లాకర్ల వ్యాపారమెలా చేస్తున్నారో - ప్రజలెలా నమ్ముతున్నారో ఆశ్చర్యంగా ఉంది. ఇతరుల వస్తువులకు భద్రత కల్పించడమే వ్యాపారంగా పెట్టుకున్న నీకు—నీ ఆస్తిపై ఉన్న శ్రద్ధ నీ వ్యాపారంపై లేదు. నువ్వు స్వార్థపరుడివి—" అన్నాడు.

"వ్యాపారంలో శ్రద్ధగానే ఉంటాను. పటిష్ఠమైన ఏర్పాట్లు చేశాను. కానీ నీ తెలివి నా తెలివిని మించింది. ఇక నా వ్యాపారం కూడా దెబ్బతింటుంది...." అన్నాడు దయానిధి దీనంగా.

"నీ వ్యాపారం దెబ్బతినాలన్నది కూడా నా ఆశయం. నీమూలంగా విలువైన వస్తువులు చిక్కడం నాబోటి వారికి కష్టంగా ఉంటోంది...." అని. "లాకర్ ఆపరేట్ చేయి. నువ్వెలా ఆపరేట్ చేస్తావో గతంలో స్వయంగా పరిశీలించాను. అందువల్ల పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తే నాకు తెలిసిపోతుంది—" అన్నాడు నాయకుడు.

అంటే ఈ నాయకుడు గతంలో తనింటికివచ్చి లాకర్లో ఏదో దాచుకుని వెళ్ళాడన్నమాట. అతదెవరో తెలుసుకుందామంటే వీల్లేకుండా ముఖానికి ముసుగుంది.

దయానిధి లాకర్ తలుపు తెరిచాడు. నాయకుడు తెచ్చిన తాళాలను నంబర్ల ప్రకారం కీహోల్స్‌లో

ఉంచాడు. కోడ్‌నంబర్స్ తిప్పి తాళం తిప్పగానే ఆ అరలు తెరుచుకున్నాయి. నాయకుడు ఉత్సాహంగా ఆ లాకర్లలో తనక్కావలసినవి తీసుకున్నాడు.

ఒక లాకర్లో వజ్రాలున్నాయి. మరో లాకర్లో అర్థం కాని కోడ్ భాషలో ఏవో కాగితాలున్నాయి. ఒకదాంట్లో ఫొటో నెగెటివ్సున్నాయి. మరోదాంట్లో మత్తుపదార్థాలవి కాబోలు చిన్నచిన్న గుడ్డమూట లున్నాయి.

"వెరీ గుడ్....ఇక నీ ఇనప్పెట్టె తెరు...." అన్నాడు నాయకుడు.

"ప్లీజ్....నన్ను దోచకు...." అన్నాడు దయానిధి.

"నీ యింటికి దొంగతనానికి వచ్చి నిన్ను దోచకుండా ఎలా వెడతాను?" అంటూ నాయకుడు గలగలా నవ్వాడు.

తప్పనిసరి పరిస్థితుల్లో దయానిధి తన ఇనప్పెట్టె తలుపులు కూడా తెరిచాడు. అందులోని నగలు, నోట్ల కట్టలు చూడగానే దొంగలకు కళ్లు జిగేల్మన్నాయి.

తమదగ్గరున్న ప్లాస్టిక్ సంచీలలోకి ఇనప్పెట్టెలోని దంతా తరలించారు వారు ముగ్గురూ.

వాసవి ఏడుస్తోంది. దయానిధి కళ్ళనీళ్లు తుడుచుకుంటున్నాడు.

దొంగలు విజయగర్వంతో తమ పని ముగించుకున్నారు.

"మిస్టర్ దయానిధీ! మేము వచ్చిన పనైంది. నువ్వే మమ్మల్ని స్వయంగా కార్లో మేము కోరినంతదూరం దిగబెట్టాలి. నీయింట్లో బాంబుపెట్టాను. కంట్రోలు నా చేతిలో ఉంది. ఏమాత్రం అతి తెలివికిపోయినా నీయిల్లు కూలిపోతుంది—నీ భార్యతోసహా!" అన్నాడు నాయకుడు.

దయానిధి తలాడించాడు.

దొంగల్లో ఒకడు—ఇంటికి ముఖద్వారం మినహాయించి మిగతా అన్నివైపులా తలుపులు వేసివచ్చాడు. తర్వాత ముగ్గురు దొంగలు, దయానిధి బయటకువచ్చారు. వాసవి ఇంట్లోనే ఉండిపోయింది.

ఇంటికి బయట తలుపు తాళంవేసి తాళంచెవి దయానిధి కందించాడు నాయకుడు. పోర్టికోలో కారుంది. అంతా కారెక్కారు. దయానిధి డ్రైవరుసీట్లో కూర్చున్నాడు. కారు మెయిన్‌గేటువరకూ వచ్చింది.

అక్కడ వాచ్‌మెన్ సీట్లో కూర్చున్న దొంగ లేచి వెళ్ళి మొక్కలచాటున పడిఉన్న గూర్ఖాను తట్టిలేపి దయానిధి వద్దకు తీసుకునివచ్చాడు. దయానిధి వాడిని మందలించాడు. వాడు భయపడుతూవెళ్ళి గేటు తీశాడు.

నాలుగో దొంగ కూడా కారెక్కాడు. కారు తిరిగి బయల్దేరింది.

దయానిధి ఆ దొంగలను కోరినచోట వదిలిపెట్టాడు.

"ఇంక బాంబు పేలదు కదూ?" అన్నదొక్కటే ఆయన ప్రశ్న.

"ఇంకో రెండు గంటలదాకా మాకే ప్రమాదమూ సంభవించకపోతేనే...." అన్నాడు దొంగల నాయకుడు.

దయానిధి కారు వెనక్కి తిప్పాడు. త్వరగా యిల్లు చేరాడు.

గేటువద్ద ఆజానుబాహుడున్నాడు. అతడు వాచ్‌మెన్‌తో మాట్లాడుతున్నాడు.

దయానిధి అతడితో—"ప్రమాదమేమీ లేదు. నువ్వు వెళ్ళొచ్చు. వచ్చి వెళ్ళినవాళ్ళు నా మనుషులే" అన్నాడు.

ఆజానుబాహుడు దయానిధికి నమస్కరించి—"మరి

నాకు సెలవు-" అన్నాడు,

"రేపు కనిపించు—నీకు ప్రత్యేకమైన బహుమతి నిస్తాను-" అన్నాడు దయానిధి. ఆజానుబాహుడు సంతోషంగా వెళ్ళిపోయాడు.

గూర్ఖా గేటు తెరిచాడు.

కారు వెళ్ళి పోర్టికోలో ఆగింది.

దయానిధి హడావుడిగా కారు దిగాడు. ఆయన బెంగంతా వాసవి గురించి. ఇలాంటి పరిస్థితికి ఆమె ఎన్నడూ గురికాలేదు. మానసికంగా ఎలాంటి షాక్ తిన్నదో యేమో!

దయానిధి తాళం తీశాడు.

వాసవి లోపల ఉందా లేదా అన్నదాయన భయం.

దొంగలు బయటనుంచి తలుపులన్నీ వేసినప్పటికీ తల్పుకుంటే ఇంట్లోంచి బయటపడడం ఆమెకు కష్టం కాదు.

"వాసవీ!" అన్నాడాయన.

"ఊఁ" అని బదులు వచ్చింది.

హడావుడిగా పడకగదిలోకి పరుగెత్తాడు దయానిధి.

మంచంమీద కూర్చుని ఉంది వాసవి. ఆమె కళ్ళలో బెదురు. ముఖంలో ఆదుర్దా. మనిషిలో వణుకు.

"వచ్చేరా?" అందామె.

"నువ్వు నిద్రపోలేదా?" అన్నాడు దయానిధి.

"వాళ్ళతో బయటకు వెళ్లారు. మీరు క్షేమంగా తిరిగి వచ్చేవరకూ నాకు నిద్రెలా పడుతుంది?" అంది వాసవి.

"ఇంట్లో బాంబు పెట్టారని తెలుసు నీకు. ఏక్షణాన

బాంబు పేలుతుందోనని భయం కలగలేదా? ఇంట్లోంచి తప్పించుకునిపోవాలనిపించలేదా?"

"వాళ్ళు చాలా పకడ్బందీగా పథకం వేసుకుని వచ్చారు. బయట ఎవరైనా ఈ యింటిమీదో కన్నుంచి కనిపెడుతున్నారేమో—నేను బయటకువస్తే వాళ్ళకుతెలిసి మీకేమైనా ప్రమాదం తలపెడతారని భయం వేసింది...."

దయానిధి ఆమెను దగ్గరగా తీసుకుని—"నీకు నేనంటే ఎంత ప్రేమ? నిన్ను భార్యగా పొందడం నా అదృష్టం.." అన్నాడు.

"నాకూ అలాగే అనిపిస్తోంది. మీరు నా భర్త కావడం నా అదృష్టం." అంది వాసవి వెంటనే.

"ఈరోజు ఉదయమే నన్నను మానించి బాధించావు. మర్చిపోయావా?" అన్నాడు దయానిధి నవ్వుతూ.

వాసవి తనూ నవ్వి మాట తప్పించి— "అవును.... మీరు దొంగతనం జరిగినా ఉత్సాహంగా ఉన్నారేమిటి?" అంది.

"అవన్నీ రేపు మాట్లాడుకుందాం...." అన్నాడు దయానిధి.

4

మర్నాడుదయం దయానిధి బాగా ఆలస్యంగా నిద్ర లేచాడు. అప్పటికి వాసవి స్నానం చేయడం కూడా అయిపోయింది. ఆమె భర్తను సమీపించి—"టిఫిను రెడీగా ఉంది. మీరు కాలకృత్యాలు త్వరగా తీర్చుకోండి—" అంది.

రోజూ ఉదయం ఆరింటికి ఇంటిపనులకీ, వంట పనులకీ ముగ్గురు మనుషులు వస్తారు. పదిదాకా ఉండి వెళ్ళి

పోతారు వాళ్లు. మళ్ళీ సాయంత్రం నాలుగింటికివచ్చి ఆరింటికి వెళ్ళిపోతారు.

"ఆలస్యంగా నిద్రపోయాంగదా - ఇంకా బద్ధకంగా ఉంది-" అన్నాడు దయానిధి.

"రాత్రి అంత హడావుడి జరిగితే మీ కసలు నిద్రెలా పట్టింది?" అంది వాసవి.

"ఏం—నీకు నిద్రపట్టలేదా?"

"ఎలా పడుతుంది? మనకున్నదంతా పోయింది. ఇక లాకర్ల వ్యాపారమూ కొనసాగదు. అన్నివిధాలా నాశమై పోయాం...." అంది వాసవి.

"అదా—నీ బెంగ. అయితే స్ట్రాంగ్ రూంకిరా...." అన్నాడు దయానిధి.

"ఎందుకు?"

"అన్నీ తెలుస్తాయి...." అని - "ఏకంగా స్నానం చేశాక ఇద్దరం శుచిగా వెడదాంలే...." అన్నాడు దయానిధి.

భర్త ఏదో దాస్తున్నాడని గ్రహించింది వాసవి. అతడు కాలకృత్యాలు తీర్చుకునేవరకూ ఆమె ఆతృతగా ఎదురు చూసింది.

ఇద్దరూ స్ట్రాంగ్ రూంకి వెళ్ళారు.

దయానిధి గది తలుపులు మూసి - కోడ్ నంబర్, తాళం ఉపయోగించి ఇనప్పెట్టె తలుపులు తెరిచాడు.

వాసవి తెల్లబోయింది.

ఇనప్పెట్టెలోని వస్తువుల్లో ఒక్కటి కూడా చెక్కు చెదరకుండా ఉన్నాయి. భార్య ఏదో అనబోయేలోగా-

"ఇనప్పెట్టెకుగానీ, లాకర్ కుగానీ రెండు కోడ్

నంబర్లున్నాయి. ఒక కోడ్ నంబరుకు తెరుచుకునే భాగంలో అన్నీ నకిలీవస్తువు లుంటాయి. రెండో కోడ్ నంబరుకు తెరుచుకునే భాగంలో అసలు వస్తువులుంటాయి. దొంగలను మభ్యపెట్టడానికిదో కొత్త పద్ధతి. ఎదురుగా అన్నీ కనబడితే దొంగ మన ప్రాణాలజోలికి రాడు. నా లాకర్ల వ్యాపారం తిరుగులేని దనడానికి కారణమిదే! రాత్రి దొంగలు తీసుకుని వెళ్ళినవి నకిలీ నగలు. నకిలీ నోట్లు."

అంటూ దయానిధి భార్యకు అర్థంకావడంకోసం ఇనప్పెట్టె తలుపుమీద మరో కోడ్ నంబరు తిప్పాడు. అప్పుడినప్పెట్టెలో కనబడుతున్న అర—గుండ్రంగా అర్ధవలయం పూర్తి చేసింది. ఇప్పు డినప్పెట్టె ఖాళీగా ఉంది.

దయానిధి నవ్వుతూ—"మళ్ళీ ఈ అరను నకిలీ సరుకులతో నింపాలి. ఈ రహస్యం నీకు చెప్పకపోదును. కానీ నిన్న ఉదయం నన్ను హంతకుడిగా అనుమానించావు. నా పాపం కారణంగానే మనింట్లో దొంగతనం జరిగిందని భ్రమపడతావు. నీ దృష్టిలో నేను హంతకుణ్ణి కావడం ఇష్టంలేక అసలు విషయం చెబుతున్నాను...." అన్నాడు.

ఆ వెనువెంటనే వాసవి ముఖంలో రంగులు మారాయి. "అయితే మీరు సునీతకు పాపభీతితోకాక స్వార్థంతో సాయపడుతున్నారన్నమాట! నిన్నరాత్రి దొంగతనం జరిగినప్పుడు నేనెంతో సంతోషించాను. మనకు సర్వం పోయినా, మీరు హంతకులైనా నాకు బాధలేదు. మీరు మాత్రం ఎప్పటికీ నావారే కావాలి. నావారుమాత్రమే

కావాలి. రాత్రి నాకు కలిగిన సంతోషం—ఇప్పుడు పోయింది." అంటూ కళ్ళనీళ్లు తుడుచుకుంది.

దయానిధి తెల్లబోయి భార్యవంక చూశాడు.

దొంగల మనసు కూడా అర్థంచేసుకున్న దయానిధి కిన్నేళ్ళు కాపురంచేసినా భార్య తననుంచి కోరేది తననే నన్న విషయం అర్థంకాలేదు.

"మీ మనసు కూడా ఇలాంటి లాకరే అనుకుంటాను. అది నాకు నకిలీ ప్రేమనిస్తోంది. రెండో కోడ్‌నంబరు సునీతవద్ద ఉంది, అదే అసలు ప్రేమనిచ్చేది—అవునా?" అంది వాసవి.

తన మనసు కూడా ఒక లాకరు కావడం - అది భార్య గుర్తించడం దయానిధిలో ఆలోచనలు రేపింది. ఆయన భార్యకు జవాబివ్వకుండా ఆలోచనలోపడ్డాడు. □

చిటపట చినుకులు

లాయరుగారమ్మాయి

—చండీక సాంబశివరావు

నన్నందరూ తెలివిగలవాడంటారు. నా తెలివితేటల్ని పరీక్షించుకోవాలని నా అభిలాష.

అందుకు నేను కాలేజీ పరీక్షలూ, సర్వీస్ కమీషన్ పరీక్షలూ కొలబద్దలుగా భావించటం లేదు. ఎందుకంటే నాలుగు రోజులు కష్టపడితే ఆ పరీక్షలు ఎవరైనా పాస్ గావచ్చును.

ఏదైనా సాహసంచేసి తద్వారా ఎదురయ్యే ఆపదలను తప్పించుకుని బయట పడటమే నిజమైన తెలివితేటగా నేను నమ్ముతున్నాను. అందుకు నేనో మార్గం ఎన్ను కున్నాను. ఎదురింటి లాయరుగారమ్మాయిని మానభంగం చేసి పట్టుబడకుండా దర్జాగా తలెత్తుకు తిరగాలన్నదే నా ఆలోచన.

లాయరు గారమ్మాయినే నేను ఎన్నుకోవడానికి రెండు కారణాలున్నాయి. మొదటిది ఆమె అందం. పందొమ్మి దేళ్ళ వారిజ ఎర్రగా పండిన జాంపండులా ఉంటుంది. ఎక్కువగా పల్లీపల్లీ చీరలు కడుతుంది. ముందునుండి చూస్తే పైట వున్న ప్రాంతం మతి పోగొడ్తుంది. వెనుక నుండి చూస్తే నడుము క్రిందిభాగం అరచేత్తో ఒక్క చరుపు చరచాలన్న పెట్టి పుట్టిస్తుంది. మానభంగం చెయ్యటానికి ఇనిస్పిరేషనిచ్చే ఆకారం.

ఇక రెండో కారణ మేమంటే - సగటు మధ్యతరగతి కుటుంబంలోని ఆడపిల్లను రేప్ చేస్తే కేసు పోలీసులదాకా వెళ్ళదు. ఆ అమ్మాయి ఆత్మహత్యయినా చేసుకుంటుంది. లేదా తల్లిదండ్రులు జరిగిన అత్యాచారాన్ని కడుపున పెట్టు కుని, ఏ అమాయకుడికో కట్టబెట్టి చేతులు దులుపు కుంటారు. ఏది జరిగినా ముందుగా ఇంటిల్లపాదీ మాన భంగం చేసినవాడ్ని అడ్డమైన తిట్లూ తిడతారు. నేనా తిట్లు పడటానికి మానసికంగా సిద్ధపడిలేను. పైగా చూస్తూ చూస్తూ బడుగు వర్గాల జోలికెళ్ళి నన్ను నేను తక్కువ చేసుకోలేను.

అదే లాయరుగారి అమ్మాయైతే తండ్రి నిప్పుతొక్కిన కోతిలా చిందులేస్తాడు. తోక తెగిన ఎద్దులా ఱంకెలేస్తాడు.

బోనులోపడ్డ సింహంలా గర్జిస్తాడు. ఇంకా అడవిలోని అన్ని రకాల జంతువుల చేష్టలూచేసి, నన్ను పట్టుకోవ డానికి కృతనిశ్చయంతో పూనుకుంటాడు. పోలీసులు రంగంలోకి దిగుతారు. అప్పుడుగదా నా మెదడుకు మేత; తెలివికి సిసలైన పరీక్ష.

మానభంగం చెయ్యాలని నా మనస్సు ఉవ్విళ్ళూరు తున్నప్పటికీ టైమ్ కోసం నిరీక్షించక తప్పలేదు. లేడికి లేచిందే ప్రయాణమన్నట్లు ప్రవర్తిస్తే ఒక్క నేరంతోనే చరిత్రకు తెర పడుతుంది.

మానభంగం చెయ్యటమంటే తాలింఖానాకెళ్ళి కసరత్తు చేసి వచ్చినట్లుగాదు. కనీసం ఓ పదిరోజులైనా ఆఫీసుకు సెలవు పెట్టాలసి వస్తుంది. ముందూ వెనకా ఎవరూ లేని వాడ్ని ఒక్కసారిగా అన్నిరోజులు సెలవు పెడితే 'ఎందుకూ?' అని ఆరా వస్తుంది.

కేవలం సెలవు పెట్టిన కారణంగా నేరం ఋజువు గాకున్నా, ఋజువు చేయటానికి పోలీసులకు ఓ దారి దొరుకుతుంది. వాళ్ల తెలివితేటలను తక్కువగా అంచనా వేసేందుకు వీల్లేదు. దారి దొరక్కపోతే సంవత్సరాల తరబడి పరిశోధించి ఫైళ్లు క్లోజ్ చేస్తారుగాని, సూదిమొన దూరే దారి దొరికిందంటే ఇరవయి నాలుగు గంటల్లో ఉచ్చు బిగిస్తారు.

అందుకే నేను ఆరు నెలల ముందే మానభంగం కార్యక్రమానికి అంకురార్పణగా ఎమ్. ఏ. ఎల్. ఎక్స్‌టర్నల్‌కి అప్లై చేశాను. ఆ పరీక్షల గురించి నేనెటూ పది రోజులు సెలవు తీసుకోవాలి. ఆఫీసులో హాల్ టికెట్ చూపించి సెలవు తీసుకుంటే సరి. పాస్‌గావాలని నాకెటూ లేదు

కాబట్టి నామ మాత్రంగా హాజరవుతాను. పరీక్షలయ్యే లోపు నా పని పూర్తి చేసుకుంటాను.

2

నేను ఎదురు చూస్తున్న హాల్‌టికెట్ రానే వచ్చింది.

పరీక్షల ప్రారంభానికి నాలుగురోజుల ముందే ప్రిపరేషన్ పేరు జెప్పి లీవ్ తీసుకున్నాను. సహోద్యోగులంతా పరీక్షలు బాగా రాయాలని నాకు బెస్ట్ విషెస్ చెప్పారు. నాకుమాత్రం మానభంగ కార్యక్రమానికే బెస్ట్ విషెస్ చెప్పినట్లన్పించింది.

మొదటిరోజు అవసరమైన సరంజామా తెచ్చుకుని మధ్యాహ్నం పన్నెండింటికల్లా టెలిస్కోప్ తయారు చేశాను. కిటికీ తలుపులు పై రెండూ తీసి ఇనుపచువ్వల మధ్యగా టెలిస్కోప్ ముందుభాగాన్ని ఉంచాను.

ఇప్పుడు నేను బెడ్ మీద పడుకుని టెలిస్కోప్ ద్వారా ఎదురింట్లో ఏం జరుగుతుందీ స్పష్టంగా చూడవచ్చు. అంటే నా రూమ్ కెదురుగా ఉన్న గదీ, మరియూ పోర్టికో చూడగలను.

ఆ రోజంతా టెలిస్కోప్ చూస్తూ రూమ్‌లోనే గడిపాను.

రెండవరోజు రూమ్‌నుండి మెయిన్‌రోడ్ మీదకు సైకిల్ మీద గంటకోసారి చొప్పున అరింటివరకూ తిరిగాను. ఆ తర్వాత రాత్రి తొమ్మిది దాటిన తర్వాత ఒకసారి, పదకొండు గంటలకు ఒకసారి మెయిన్‌రోడ్ వరకు వెళ్ళివచ్చాను. నాకు ఓ సంగతి స్పష్టంగా అర్థమైంది.

మూడవరోజు ఉదయమే రూమ్ తాళంవేసి మానభంగం చేయటానికి అనువైన ప్రదేశాలు చూడాలని బయలుదేరాను.

విజయవాడ దిక్కు సిటీకి నాలుగుమైళ్ళ దూరాన మామిడితోట ఒకటుంది. అక్కడ ఆదివారం ప్రార్థనలు జరుగుతాయి. మిగిలిన రోజులక్కడ వాచ్ మెన్ తప్ప ఎవరూ వుండరు. వాచ్ మెన్ నాకు బాగా తెలిసినవాడే!

మూడో కంటికి తెలియకూడదనుకుంటే మెడ్రాస్ బైపాస్ రోడ్డుపక్కన పొలాలు పనికొస్తాయి. బైపాస్ రోడ్డు ఇంకా పూర్తికాలేదు కాబట్టి వాహనాల రాకపోకలు లేవు. అక్కడ పట్టపగలు పని పూర్తిచేసుకున్నా చూసే దిక్కుండదు.

మూడవచోటు సాగర రూట్ లో రోడ్డుకు రెండు ఫర్లాంగుల దూరంలో వున్న కొండలూ, గుట్టలూ. రాత్రి పదింటి వరకూ అన్ని ప్రదేశాలు చూసి, మానభంగం చేస్తుండగా మధ్యలో రసాభాసపదని దృఢపరచుకున్నాను.

కాని ఆలోచించి చూస్తే నేనెంత పొరపాటు చేశానో అర్థమైంది. ఆ ప్రదేశాలు మానభంగం చేయటానికి చక్కగా ఉపయోగపడవచ్చు. కాని "నిన్ను మానభంగం చేస్తాను. ఫలానా ప్రదేశం పసందుగా ఉంది. అక్కడకు రా" అంటే పచ్చి తిరుగుబోతుగూడా ఒప్పుకుని చావదు.

ఏదో ట్రాప్ చేసి వారిజను తీసుకెళ్ళాలనుకుంటే, అక్కడ జనసంచారం లేకున్నా, వెళ్ళవలసింది జనారణ్యంనుండే గదా! అంటే ఎవరికళ్ళా పడకుండా పగటిపూట తీసుకెళ్ళలేం. చదువుకుంటున్న అమ్మాయిని ఎంత మభ్యపెట్టయినా గాని రాత్రివేళ ఊరి చివరకు రప్పించటం జరగని పని.

పైగా ఊరి చివరకు ఒక ఆడదాన్ని ఎత్తుకెళ్ళాలంటే నేను మరో ఇద్దరి సహాయమైనా తీసుకోక తప్పదు. ఆ ఇద్దరే రేపు నా పాలిట రంకు మొగుళ్ళు గావచ్చు. ఏమైతే

నేం: మానభంగం బయట ప్రదేశాలలో చెయ్యగూడదని నిర్ణయించుకున్నాను.

నాలుగోరోజు ఉదయం తొమ్మిదికల్లా తయారయి టెలిస్కోప్ చూస్తూ కూర్చున్నాను.

నేను అనుకున్నట్లుగానే తొమ్మిదిన్నరకల్లా వారిజ బయటకు వచ్చింది. తెల్ల గులాబీలు ఎంబ్రాయిడరీ చేసి ఉన్న రక్తవర్ణం ఉల్లీ ఉల్లీ చీరమీద అదేరంగు పాలియస్టర్ జాకెట్టు వేసుకుంది. ఎడమచెవి పైభాగాన ఎర్ర గులాబీ. టెలిస్కోప్‌లో చూస్తుంటే వారిజ అందం త్రీ-డి ఎఫెక్టులో కన్పించి నరాలు జివ్వుమన్నాయి.

రెండు నిముషాల్లో గది తాళంవేసి బయటపడ్డాను. సైకిల్ తీసుకుని రోడ్డుమీద కొచ్చేసరికి వారిజ నాలుగడుగులు ముందువెళ్తూ కన్పించింది. చీర బిగించికట్టిందేమో, అసలే గుండ్రటి పిరుదులు—చీరలో ఊపిరాడక పైకీ కిందకూ ఊగుతున్నాయి. మరి కొంచెంసేపట్లో నేను చేయబోయేపని తలుచుకుంటే ఒళ్ళంతా తిమ్మిరెక్కింది.

ఆ సమయంలో వీధిలో ఎవ్వరూ లేరు.

వారిజను సందు చివరివరకూ వెళ్ళనిచ్చాను. ఆ తర్వాత సైకిలెక్కి కుడికాలుతో పెడల్ గట్టిగా తొక్కాను. సైకిల్ మెరుపు వేగంతో ముందుకు కదిలింది.

అప్పుడే టర్నింగ్ తిరుగుతుంది వారిజ. ఏం జరిగిందో అర్థం గానంత వేగంగా ముందు టైరు ఆమె పిరుదులకు బలంగా ఢీ కొనటం, మనిషి బోర్లా పడటం జరిగిపోయాయి.

నేను పడిపోయిన సైకిలును లేపి జరగబోయే పరిణామానికి సిద్ధపడి నిల్చున్నాను. ఆమె లేచి ఒంటినంటుకున్న దుమ్ము దులుపుకుంది. మోచేయి గీరుకుపోయి

రక్తం వస్తుంది. అప్పుడు చూసింది జరిగిన అనర్థానికి కారణం ఎవరా అని! నా ముఖాన్ని వీలైనంత బాధతో నింపి దీనంగా చూశాను.

వారిజ రెండు నిముషాలు అలాగే నిల్చుండిపోయింది. ఆమె జరిగిన సంఘటనను జీర్ణించుకోలేకపోతుంది. అలా జరిగే అవకాశముందని ఎవ్వరూ ఊహించలేరు. ఆ తర్వాత క్రమంగా ఆమె మోము క్రోధంతో ఎర్రబడింది. పెదాలు ఆవేశంతో అదిరాయి. కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి.

"యూ....స్కౌండ్రల్" అని అరచి ఎడంచేత్తో ఎడం కాలు చెప్పు తీసింది.

నేను జరగబోయేది ఊహించాను. "సారీ మిస్. టర్నింగ్‌లో చూసుకోలేదు. మీరు చాలా కోపంలో వున్నారు. మళ్ళీ కలుస్తాను" అపాలజెటిగ్గా అనేసి సైకిల్‌ను ముందుకు పోనిచ్చాను.

3

ఐదవరోజు నుండీ పరీక్షలు మొదలయ్యాయి.

మధ్యాహ్నం రెండింటి నుండి ఎనిమిదింటివరకూ పరీక్ష సమయం. ఆర్ట్స్ కాలేజి నా పరీక్ష కేంద్రం.

ఒంటిగంటకే అక్కడకు చేరుకున్నాను. నా నంబరు ఏ రూములో వేశారో తెలుసుకునేందుకు నోటీస్ బోర్డు చూశాను. అక్కడ ఓ నోటీస్ నా దృష్టి నాకర్షించింది. ఎక్స్‌టర్నల్ ఎగ్జామ్స్ కారణంగా కాలేజీలో చదివే విద్యార్థులకు సెలవిచ్చినట్టు సారాంశం. సెలవులు ఈ ఒక్క కాలేజీకే యని నాకు సందేహమొచ్చింది.

"ఎక్స్‌టర్నల్ రాసేవాళ్ళందరికీ ఇదే సెంటరా?" నా పక్కనున్నతన్ని అడిగాను.

నే నడిగిన ఆ చిన్న ప్రశ్నకు అతను దాదాపు పది నిముషాలసేపు వివరాలు చెప్పాడు. బహుశా ఇలాంటి వాళ్ళు మాట్లాడే అవకాశం కోసమే చూస్తూ ఉంటా రేమో!

అతను అంతసేపు చెప్పినదాన్ని బట్టి పరీక్షలు అన్ని కాలేజీలలో జరుగుతున్నాయని తెలుసుకున్నాను. అంటే వారిజ పగటిపూట ఇంట్లోనే ఉంటుందన్నమాట. ఇది నాకు చాలా ఉపయోగించే విషయం.

"అందరికీ కామన్ సిలబస్సా?" అని ఎవరో అడిగినట్లున్నారు. ఇందాక నాకు చెప్పినతను రెట్టించిన ఉత్సాహంతో వివరిస్తున్నాడు. రూమ్ నంబరు చూసుకుని నేను అక్కడినుండి కదిలాను.

పరీక్ష రాసి బయటకు వస్తుంటే మెయిన్ గేటు దగ్గర మళ్ళా అతను కన్పించాడు. పేపరెంత ఈజీగా ఇచ్చిందీ వివరిస్తున్నాడు. చుట్టూ నలుగురైదుగురు ఆసక్తిగా అతని మాటలు వింటున్నారు.

ఆ రోజు రాత్రి అప్పటివరకూ జరిగిన పని సమీక్షించుకున్నాను—

ఎదురింట్లో ఉండేది మొత్తం ఐదుగురు. లాయరుగారు, ఆయన సతీమణి, కూతురు వారిజ ఇంటి సభ్యులు. లాయరుగారు ఉదయం పదిగంటలకు కోర్టుకెళ్తే రాత్రి ఏడుగంటలకు ఇల్లు చేరతాడు. ఆయన భార్యకు పక్షవాతం వచ్చి కాళ్ళు రెండూ పడిపోవటంతో, గత రెండు సంవత్సరాల నుండీ బెడ్ మీదే ఉంటుంది. ఆమెను అహర్నిశలూ కనిపెట్టుకుని ఉండేందుకు 'ఆయా' ఉంది. రోజూ ఉదయం ఒకసారి, రాత్రి ఒకసారి ఫ్యామిలీ డాక్టరొచ్చి చూసి వెళ్తాడు. వారిజ స్థానిక మహిళా కళా

శాల్లో బి. యస్సీ ఫైనలియర్ చదువుతోంది. వంటకూ వడ్డించటానికి మరో ఆడమనిషి ఉంది.

ఇహపోతే ప్రతినిత్యం ఆ ఇంటికొచ్చే మనుషులు డాక్టరు గాక మరో ఇద్దరున్నారు. ఒకడు పాలవాడు, రెండవాడు పేపరబ్బాయి.

చాలా కాలం క్రితమే అంచెలంచెలుగా సేకరించిన ఈ సమాచారంలో మార్పులేమీ లేవని మొదటిరోజు టెలిస్కోప్ ద్వారా గమనించి ధృవపరుచుకున్నాను.

పట్టపగలు ఆ వీధిలోని ఇళ్ళన్నీ తలుపులు మూసుకుని ఉంటాయి. ఇంచుమించు అందరూ ఉద్యోగస్థులైనందున, పది దాటితే ఆ వీధిలో జనసంచార ముండదు.

మొత్తంమీద పగలు పదకొండు గంటల నుండీ మూడు గంటలవరకు, రాత్రి పది దాటిన తర్వాత ఆ వీధి ఎడారిలా ఉంటుంది. రెండవరోజు నేను తెలుసుకున్న విషయ మిది.

మూడవరోజు ఆలోచననుబట్టి ఛాయరుగా రింట్లోనే వారిజను మానభంగం చేయాలని నిశ్చయించుకున్నాను.

అనుకోని సంఘటన ఎదురైతే మనుషులు రక రకాలుగా రియాక్టవుతారు. కొంతమంది ఎటువంటి సంఘటన ఎదురైనా క్షణాల్లో పరిస్థితిని ఎదుర్కొనగలరు.

వారిజ అలాంటిది కాదు. ఊహించని పరిణామ మెదురైతే ఆమె మనస్సు మొద్దుబారుతుందనీ, ప్రతిచర్యకు పూనుకునేందుకు కొంత టైమ్ తీసుకుంటుందనీ నాల్గవ రోజు ప్రాక్టికల్ చేసి తెలుసుకున్నాను.

అంతా సమీక్షించుకుంటుంటే, మానభంగం పూర్తి చేసినంత సంతృప్తి కల్గింది. మర్నాడు కార్యక్రమం గురించి ఆలోచిస్తూ నిద్రపోయాను.

4

ఉదయం పది గంటలకు లాయరు అంబాసిడరు కారులో బయటకు వెళ్ళడం చూశాను.

పదిన్నర గంటలకు ఆ ఇంటి చుట్టంలా దర్జాగా లోపలి కెళ్ళాను. పోర్టికో దాటి ముందు గదిలోకి అడుగుబెట్టాను. అది డ్రాయింగ్‌రూమ్‌లా ఉంది. రెండు సోఫాలు, అర డజను పైగా చైర్లు, టీపాయిమీద దిన వారపత్రికలూ ఉన్నాయి.

కాలింగ్‌బెల్ నొక్కుదామనుకునే టంతలోనే నౌఖరు వచ్చాడు. ఎవరికోసమనడగ్గానే వారిజ కోసమని చెప్పాను. వా డొకసారి. నన్ను అనుమానంగా (?) చూసి లోపలికి వెళ్లాడు. మరు నిముషంలో వారిజ బయటకు వచ్చింది. ఆమె ముఖంలో ఆశ్చర్యం ఇంతా అంతా కాదు.

"మొన్న జరిగిందానికి బాధపడ్తున్నాను. ఐయామ్.... సారీ, మీరు నన్ను క్షమించాలి లోకంలోని అమాయ కత్వమంతా ముఖంలో చూపించి అడిగాను.

ఆమె ఛీత్కారంగా చూసింది. ఆమె అలా చూడటం నాకేమీ ఆశ్చర్యమన్పించలేదు. ఇలా వచ్చి క్షమాపణ అడిగితే, ఆమె పరిచయం సంపాదించవచ్చని, తద్వారా ఆమె ప్రేమను సంపాదించి నేనేదో హీరోనై పోదామనీ— అనుకోవటంలేదు.

క్షమాపణ సాకుతో ఆ ఇంటిలోపలి గదులు చూడా లన్నదే నా ఆలోచన. అందుకే గొంతులో వీలైనంత పశ్చాత్తాపం నింపి, తల వొంచుకుని అన్నాను.

"నా మీద మీకు అసహ్యం ఉండటం సహజమే. మీ వంటి సంస్కారవతిని, సౌందర్యవతిని అవమానించటం

నిజంగా నేరమే. ప్రతి మనిషికీ కొన్ని దుష్ట క్షణా లుంటాయి. ఆ రోజు అలాంటి దుష్ట క్షణమే నా కెదురైంది. నేను పొరపాటు చేసినప్పటికీ బాధ బాధే కదా!....''

ఆమె ముఖంలోని మార్పును కనుకొనుకుల నుండి గమనించాను. ఇంకొంచెం బిగిస్తే లైన్లో పడ్తుంది. మళ్ళీ కావాలనే రిపీట్ చేశాను ఆమెకు నచ్చే మాటలు.

"మీ లాంటి సంస్కారవతిని, సౌందర్యవతిని అవమానించాను. నన్ను మీరు క్షమించరని తెలుసు.''

వారిజ ముఖం సంతోషంతో విప్పారింది. పొగడ్తకు లొంగని ఆడదే ఉండదు.

"అయ్యో....నిలబడే ఉన్నారు. కూర్చోండి'' అంది. నౌఖరుచేత కాఫీ తెప్పించింది. నా గురించి నా ఉద్యోగం గురించి అడిగి తెలుసుకుంది. తన కాలేజీ విశేషాలు కొన్ని చెప్పింది.

పావుగంట గడిచేసరికి నాకు ఇబ్బందిగా అన్పించింది.

సాధారణంగా చూసిపోవడానికి వచ్చే గెస్టులు అలా అన్పించగానే "వెళ్ళొస్తామండీ'' అని సెలవు తీసుకుంటారు. కాని ఇంటిలోపలి గుట్టుమట్టులను తెలుసుకోకుండా నేనెలా పోతాను?....!

ఎంతసేపు కూర్చున్నా ఆ డ్రాయింగ్‌రూమ్ దాటి లోపలికి వెళ్ళే ఛాన్సు లేదు. ఇలాంటి సమయాల్లోనే తెలివితేట లుపయోగించాలి.

"అందమైనవారి అభిరుచులు కూడా అందంగా ఉంటాయట. రూపంలో మీకు మీరే సాటి. మీ గది మీ అభిరుచుల కనుగుణంగా తీర్చిదిద్ది ఉంటారనుకుంటాను. నేను చూడొచ్చా?'' అన్నాను.

నా గురి తప్పలేదు. పౌగత్త కారణంగా ఆమె కళ్ళు సిగ్గుతో వాలిపోయాయి. "రండి....చూద్దురుగాని అని ఆహ్వానించింది.

డ్రాయింగ్‌రూమ్ దాటగానే హాలు. హాలు కిరువైపులా గదులున్నాయి. ఎడమపక్క—మూడో గది వారిజది. ఆమె గది కెదురుగా వారిజ తల్లి, ఆమెను చూసుకునే ఆయా వుంటారు. వారిజ నన్ను వాళ్ళమ్మ దగ్గరకి తీసుకెళ్తుం దేమోనని సంశయించాను. కాని ఆమె మాటవరసకు చెప్పి ఊరుకుంది. లాయరుగారుండేది మేడమీద గదిలో నట.

వారిజ వెనకే ఆమె రూమ్‌లోకి అడుగుపెట్టాను. నిజంగా మనోహరంగా ఉందా గది. ఎర్రటి తివాచి, ఫోం బెడ్డూ, డ్రెస్సింగ్ టేబులూ, స్టీరియో సెట్, టెలిఫోన్, గోడలకు తైలవర్ణ చిత్రాలు—ఒక్క ఎ.సి. మినహా అధునాతన సౌకర్యాలన్నీ ఉన్నాయి.

ఆ గది ప్రవేశద్వారానికి అభిముఖంగా గోడకు అందమైన కర్టెన్ వేలాడుతోంది. అటాచ్డ్ బాత్రూం అయివుంటుందనుకున్నాను. నేను అటే చూస్తూండటం గమనించి చెప్పింది వారిజ. "అది పెరట్లోకి దారి."

ఉలిక్కిపడ్డాను. "పెరట్లోకి దారా?" నా గొంతులో ఆశ్చర్యం ధ్వనించిందేమో నాకు తెలియదు.

ఆమె క్యాజువల్‌గా అటు నడిచి తలుపు తీసింది. ఒక్కసారిగా వెలుతురు లోపలకు ప్రవేశించింది. ఆమె వెనకే బయటకు నడిచాను. కుడిపక్కనే గోడ కానుకుని ఉన్నాయి బాత్రూం, లావెట్రీ.

"ఓల్డ్ కన్‌స్ట్రక్షన్....మా తాతయ్య కట్టించిన బంగళా

ఇది. అందుకే అటాచ్డ్ సిస్టం ఏ గదికీ లేదు. అఫ్‌కోర్స్ ఇదీ ఒక రకంగా ఎటాచ్డ్. కాకపోతే ఎక్స్‌టర్నల్...." చెప్పుకుపోతుంది వారిజ.

అవన్నీ నేను వినటంలేదు. అక్కడ గుబురుగా పెరిగిన మామిడిచెట్టునూ, దాని పక్కన చిన్నసైజు ఫారెస్టులా పెరిగిన ఇతర చెట్లనూ చూస్తున్నాను. ఖూనీకోరు కంటికి తెలియకుండా దాక్కోవటానికి అనుకూలంగా ఉందా మామిడిచెట్టు.

మరో పావుగంట తర్వాత ఆ ఇంట్లోనుండి సంతృప్తిగా బయటపడ్డాను.

5

రాత్రి పదకొండు గంటలయింది.

వీధంతా నిర్మానుష్యంగా ఉంది.

నల్లటిలుంగీ, నల్లలాల్చీ వేసుకున్నాను. కళ్ళు మాత్రం కన్పించేలా నల్లటి గంతలు కట్టుకున్నాను. వేలిముద్రలు పడకుండా ఉండేందుకు చేతికిగ్లవుస్‌లు తొడుక్కున్నాను. నుదుటన పసుపు రాసుకుని ఎఱ్ఱబొట్టు పెట్టుకున్నాను. కాళ్ళకు చెప్పులు వేసుకోలేదు. ఒక్క కళ్ళగంతలు మినహాయిస్తే నేను అయ్యప్పస్వామి భక్తుడిలా ఉన్నాను.

గేటు దూకి లాయరుగారి ఆవరణలో ప్రవేశించాను. ఆ ఇంట్లో కుక్కలు లేకపోవడం నా అదృష్టం. మెల్లగా అడుగులో అడుగువేసుకుంటూ భవనం ఎడమపక్కగా వెళ్ళి మామిడిచెట్టు ఎక్కాను. పొరపాటున ఎవరైనా వచ్చినా కనబడని విధంగా కొమ్మమీద కూర్చున్నాను.

క్షణాలు నిముషాలుగా మారుతున్నాయి. పదకొండు గంటలకు వచ్చిన నేను రాత్రి ఒంటిగంటవరకూ అలాగే కూర్చున్నాను. కాళ్ళు తిమ్మిరెక్కాయి. వారిజ బాత్‌రూమ్

కెళ్ళేందుకు బయటకు వస్తుందని నా అంచనా. ఆ నమ్మ కంతోటే కాపు కాశాను.

మరో అరగంట గడిచింది.

నా ఊహ తప్పుకాలేదు. వారిజ గది తలుపులు తెరుచు కున్నాయి. నా చేతికున్న వాచీ చూసుకున్నాను. సరిగ్గా ఒకటీ నలభై.

తెల్లటి నైట్‌గౌన్‌లో రాజహంసలా వయ్యారంగా నడుచుకుంటూ బాత్‌రూమ్‌లో కెళ్ళింది వారిజ. నేను క్షణం ఆలస్యం చెయ్యలేదు.

చెట్టు దిగాను. శబ్దంగాకుండా మునిగాళ్ళమీద వడి వడిగా ఆమె గదిలోకి ప్రవేశించాను. గదిలో నీలంరంగు జీరోవాట్లు బల్బు వెలుగుతోంది. నాలో భయంలేదు. ఉద్రేకంతో ఒళ్ళంతా సెగలు, పొగలు చిమ్ముతోంది. మెల్లగా మంచం కిందకు దూరాను.

బాత్‌రూమ్‌లో నీళ్ళ చప్పుడు, లైట్ తీసిన శబ్దం, తలుపు వేయటం-అన్నీ విన్పిస్తూనే ఉన్నాయి. వారిజ లోపలకు వచ్చింది. వెనక్కు తిరిగి తలుపులు వేస్తుంటే చూశాను. పల్చటి గౌనులో ఒళ్లంతా స్పష్టంగా కన్పిస్తుంది. మరి కొంచెం సేపట్లో ఆ అందమంతా నాదవబోతుంది.

బోల్టుపెట్టి డ్రస్సింగ్ టేబుల్ ముందుకు నడిచింది. అద్దంలో చూసుకుని ఒక్కసారి ఒళ్ళు విరుచుకుంది. ముఖం అద్దం దగ్గరగా జేర్చి చూసుకుంది. మళ్లీ నిలబడి వెనక్కు తిరిగింది. మెడను అలవోకగా పక్కకు తిప్పి వెనక్కు చూసుకుంది.

తన అందం ఎక్కడుందో ఆమెకూ తెలుసన్నమాట. అలా కాసేపు తన శరీరంలోని భాగాలను తన్మయంగా చూసుకుని మంచం ఎక్కింది. నా టెంపరేచర్ నార్మల్

దాటి చాలాసేపయింది. మంచం మీద ఆమె ఏంచేస్తుందో తెలియటంలేదు. మెత్తటి కదలిక. బహుశా దొర్లు తుందేమో!

వారిజ నిద్రపోతే తప్ప నేను మంచం కిందనుండి బయటకు రాలేను. క్షణాలు లెక్కపెట్టుకుంటూ....అరగంట గడిపాను. మంచంమీద ఏ కదలికా లేదని నిశ్చయించుకుని బయటకు వచ్చాను.

నిద్రపోతున్న వారిజను చూశాను. పండిన దొండ పండును నిలువుగా కోసినట్లు ఎఱ్ఱటి పెదాలు, పాల మీగడలో పనసరసం కలిపినట్లున్న మృదువైన చెక్కిళ్లూ, జీడిమామిడిపండులాంటి చుబుకమూ - నిజంగా అద్భుత సౌందర్యం.

నా చూపు ఆమె మెడదాటి కిందకు దిగింది. నా గుండె కొట్టుకోవటం స్పీడందుకుంది. ఎత్తైన ఆమె రొమ్ములు గాలి బెలూన్లలా పైకి ఉబుకుతున్నాయి. పలుచటి గౌనులో నుండి వాటి కదలికలు మరింత స్పష్టంగా కన్పిస్తున్నాయి.

ఇక వెయిట్ చెయ్యటం నా వల్ల కాదన్పించింది. మంచంమీద కూర్చుని, వారిజ ముఖంమీదకు వంగి కుడి చేత్తో ఆమె చెంపను మృదువుగా రాశాను. కళ్ళుతెరిచింది. ఆశ్చర్యంతో కెవ్వున అరవకముందే నా పెదాలతో ఆమె నోటిని మూశాను. చటుక్కున ఆమె రెండు చేతులను కదలకుండా నా రెండు చేతులతో అదిమిపట్టి మీదవాలాను.

వారిజ విపరీతంగా పెనుగులాడుతుంది. నాది ఏనుగు బలం. వెల్లకిలా పడిన బొద్దింకలా ఆమె అరంగుళం కూడా కదల్లేకపోతోంది.

ఐదు నిముషాలు ఆమె అధరామృతం తనివిదీరా గ్రోలాను. పెదాలను వదలకుండా, ఆమె ఎడమచేతిని

అదిమిపట్టిన నా కుడిచెయ్యి తీసి జేబులోనుండి గుడ్డ తీశాను. ఒకచేత్తో ఆమె నన్ను నెట్టటానికి ప్రయత్నిస్తూనే ఉంది.

నేను ఎడమచేయి కూడా తీశానంటే నన్ను వెనక్కి తోస్తుందని తెలుసు. ఒక్కసారి నోరు తెరిచిందంటే, నేను పట్టుబడినట్టే! అందుకే ముద్దు పెట్టుకుంటున్న ఆమె పెదాలను గట్టిగా కొరికాను. ఆమె బాధగా మూలిగింది. అదే అదనుగా ఎడంచేత్తో రెండు చెక్కిళ్ళను నొక్కిపెట్టి, నా నోటిని దూరంచేశాను. నెమ్మదిగా పొట్టమీద కూర్చొని కుడిచేతిలోని గుడ్డను నోట్లో కుక్కాను.

ఆమె చేతులతో నోట్లోని గుడ్డను తీసేయటానికి ప్రయత్నిస్తుంటే - ఆమె రెండు చేతులను వెనక్కిలాగి మరో గుడ్డతో కట్టేశాను.

వారిజ కళ్ళల్లో విస్మయం, భయం కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నాయి. ఇప్పుడు ఆమె చేయగల్గిందేమీలేదు. అంతా నా ఇష్టారాజ్యం.

మూడు గంటలకు మంచంమీదనుండి తృప్తిగాలేచాను.

బెడ్డంతా కల్లోలం జరిగిన చిహ్నాలు ఏర్పడ్డాయి. చిరిగిన గౌను. పగిలిన గాజులు, నిస్త్రాణంగా పడివున్న వారిజ.

అద్దంలో ఒకసారి చూసుకున్నాను. కళ్ళకున్న గంతలు అలాగే ఉన్నాయి. నేను చేసింది మూకీ మానభంగం. అంటే మాటలతో పనిలేకుండా చేశాను. వారిజ నన్ను గుర్తుపట్టలేదు. వచ్చినదారినే ఆ ఇంట్లో నుండి బయట పడ్డాను.

ఇప్పుడు నాకున్న ఒకే ఒక సమస్య - నా నల్లబట్టలు.

వారిజ గుర్తించగల్గింది వాటిని మాత్రమే.

జరిగిన సంఘటనలను విచారిస్తే అనుమానితుల జాబితాలో నేనూ ఉంటాను. నేరం నాపై రాకుండా చూసుకోవలసిన అవసరం నాకెంతో ఉంది.

అందుకే రూమ్‌కి రాగానే అ బట్టలను బాత్‌రూమ్‌లో వేసి, కిరోసిన్ పోసి తగులబెట్టాను. ఆ తర్వాత మసిపోయేటంతవరకూ నీళ్ళుకొట్టాను

హీటర్ మీద నీళ్ళు వేడిచేసుకుని తలారా స్నానంచేసి, హాయిగా నిద్రపోయాను.

6

నేను మళ్ళీ నిద్ర లేచేసరికి పదకొండయింది. నా గుండెలు భయంతో బితుకు బితుకుమంటున్నాయి. మెల్లగా కిటికీ రెక్కలు తీసాను.

లాయరుగారింటి నిండా పోలీసులు, జనం.

బయటకు వచ్చాను. మా వీధంతా ఎక్కడచూసినా గుంపులు గుంపులుగా జనం.

మా కాంపస్‌లో మిగిలిన పోర్షన్లలో ఉండేవాళ్ళు పిట్టగోడదగ్గిర నిలబడి చోద్యం చూస్తున్నారు.

"ఏమండీ ఏం జరిగింది?" అడిగాను.

"ఎక్కడున్నారు మీరు? ఇంత గొడవజరిగినా మీకు తెలీదా?" పై పోర్షన్‌లో ఉండే లెక్చరర్‌గారన్నాడు.

"అయన ఎగ్జామ్స్ అటండవుతున్నారు నాన్నా. లేటుగా పడుకుని ఉంటారు." వాళ్ళబ్బాయి అన్నాడు.

నేను మనస్సులోనే నా పరీక్షలకు థాంక్సు చెప్పుకున్నాను.

ఎదురింట్లో జరిగిన మానభంగం గురించి చెప్పారు. నిందితుడు ఎలా వచ్చినదీ. ఎంత దారుణంచేసినదే కథలా

చెప్పుకుంటున్నారంతా.

"ఇంత అమానుషం ఎవరు చేసి ఉంటారు?" అన్యాపదేశంగా అన్నాను.

"అయ్యో....మీకు తెలియదా?" లెక్చరర్ కొడుకు అడిగాడు. అ అడగటంలో నాకు తెలియనందుకు ఆశ్చర్యం ఉంది. చెప్పాలన్న కుతూహలం ఉంది.

"తెలియదు చెప్పు" అన్నాను.

"రేప్ చేసిందెవరో తెలిసిపోయింది. ఇడియట్.... ఇక్కడింత దారుణంచేసి, ఏమీ ఎరగని వాడిలా నిదరో తున్నాడట."

నా గొంతులో తడారిపోయింది. "ఎవరూ?...." అన్నాను గొంతు పెగుల్చుకుని.

"సుధీరట వాడిపేరు. హోటల్ రూమ్‌లో పడుకుని నిద్రపోతుంటే పోలీసులు పట్టుకున్నారు."

మానభంగం చేసినవాడు సుధీరా? అతనిప్పుడు పోలీసుల కస్టడీలో ఉన్నాడా?....అతన్ని వెంటనే కలుసుకొమ్మని నా మనస్సు చెబుతోంది.

7

సుధీర్‌ను చూడాలని నేను స్టేషన్ కెళ్ళగానే, ఇన్‌స్పెక్టరడిగిన మొదటి ప్రశ్న. "అతనికీ మీకూ ఏమిటి సంబంధం?"

ఇలా అడుగుతారని నాకు ముందే తెలుసు. ఫ్రీలాన్సు జర్నలిస్టుగా నన్ను నేను పరిచయం చేసుకున్నాను. 'అతివలపై అత్యాచారం' అనే వ్యాసం రాస్తున్నట్లు చెప్పాను. రాను రాను స్త్రీలకు రక్షణ కరువైందని నా ఆవేదన వెల్లడించాను. ఇలాంటి కిరాతక చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఆవేశంగా పలికాను. దోషులను

కఠినంగా శిక్షించాలని కోరాను. చివరగా మానభంగం జరిగి, ఇరవైనాలుగ్గంటలు గాకముందే దోషిని పట్టుకున్నందుకు ఇన్స్పెక్టర్ని అభినందించాను.

ఇన్స్పెక్టర్ ఈ చివరి మాటలకు సంతోషించాడు. "మీరెక్కడ పనిచేస్తున్నారు!" నవ్వు ముఖంతో అడిగాడు.

నేను చెప్పాను.

కానిస్టేబుల్ పిలిచి రెండు ఛాయ్ పంపించమని పురమాయించాడు. "మీరెళ్ళి మాట్లాడండి" అని నాకు పర్మిషనిచ్చాడు.

నన్ను సుధీర్ ఉన్న సెల్ దగ్గర వదిలి ఆ కానిస్టేబుల్ వెనక్కి వెళ్ళిపోయాడు. సెల్లోఉన్న వ్యక్తిని చూసి నేను ఉలిక్కిపడ్డాను. అతను ఎవరోకాదు. ఆరోజు ఎగ్జామ్స్ జరిగేచోట అడిగిన వాళ్ళందరికీ వివరాలు చెప్పిన వ్యక్తి.

"మీరు ఎం.ఏ. ఎక్స్టర్నల్ రాస్తున్నారుగదూ!" అడిగాను. అతను నన్ను గుర్తించాడు. అవునన్నట్లుతలూపాడు.

"మీరెందుకొచ్చారిక్కడికి?" అడిగాడు.

"మానభంగం చేసిన వాళ్ళ గురించి ఇన్నిరోజులూ పత్రికల్లో చదివాను. ఈరోజు కళ్ళారా చూద్దామని వచ్చాను." కఠినంగా అన్నాను.

"ప్లీజ్....నన్ను అంతమాటనకండి. నిజానికి నాకే పాపమూ తెలియదు." దీనంగా అన్నాడు. అతను పడ్తున్న మానసిక వ్యథ ముఖంలో స్పష్టంగా కన్పించింది.

"ఏ పాపమూ ఎరుగందే పోలీసులు నిన్నే ఎందుకు పట్టుకున్నారు?" ఎలాగైనా విషయం రాబట్టాలని అడిగాను.

అతను ఒకక్షణం తటపటాయించాడు చెప్పాలా వద్దా అని! కాని మరుక్షణం ఏమనుకున్నాడో ఏమో చెప్పటం ప్రారంభించాడు.

"మానభంగానికి గురికాబడ్డ వారిజ స్వయంగా నా మేనత్త కూతురు." సుధీర్ చెప్పిన మొదటిమాటకు నేను ఆశ్చర్యపడ్డాను. అయితే ఇంకా ఆశ్చర్యం కలిగిస్తుంది అతని కథ వింటే!

"మాది సంగారెడ్డి. నేను అక్కడే ఉద్యోగం చేస్తున్నాను. నాకు మొదటినుండీ వారిజ అంటే ఇష్టంలేదు. కాని వారిజకు నన్ను పెళ్ళిచేసుకోవాలనుంది. చాలాసార్లు ఈవిషయం నావద్ద ప్రస్తావించింది. నేను మృదువుగా తిరస్కరించాను. కారణ మడిగింది. తన అందానికి నేను తగనని చెప్పాను. నమ్మలేదు. అసలు విషయం చెప్పమంది.

"ఏమని చెప్పగలను? ఒక్కోమనిషిమీద అయిష్టం ఏర్పడుతుంది. వారిజలాంటి అమ్మాయిని చేసుకుని నేను సుఖపడలేనని నాకు అంతరాంతరాల్లో స్పష్టంగా తెలుసు. అందుకే వారిజను పెళ్ళాడే ఉద్దేశం లేదని మా పెద్దవాళ్ళకు కూడా ఖచ్చితంగా చెప్పేశాను. అంతటితో ఈ సమస్య దాటిపోయిందనుకున్నాను.

ఆ తర్వాత ఒకసారి ఈఊరు పనిమీదవచ్చి వాళ్ళింట్లో వారం రోజులున్నాను.

ఈసారి వారిజ పెళ్ళిగురించి నన్నడగలేదు. కాని ఓ రాత్రివేళ నన్ను తన గదికి పిలిచి కోరిక వెల్లడించింది. నేను ఆ క్షణంలో పొందిన ఆశ్చర్యం మాటల్లో చెప్పలేను. పెళ్ళిచేసుకోనక్కరలేదు. తనతో అనుభవం పంచుకొమ్మని కవ్వించింది.

అప్పుడే అర్థమయింది. వారిజకు నామీద ఉన్నది ప్రేమ కాదు, కోరిక. ఆ కోరిక తీరటానికి పెళ్ళిచేసుకోమంది. కాదనేసరికి డైరక్టుగా తన మనస్సులోది బయటపెట్టింది.

నా కిష్టంలేదని చెప్పాను. అయినా ఆమె వదల్లేదు.

వారిజ ఎంతగా బరితెగించిందంటే, తన ఒంటిమీద బట్టలు తీసేసి నన్ను రెచ్చగొట్టాలని ప్రయత్నించింది.

నేను విదిలించి కొట్టేసరికి కోడెనాగులా బుసలు కొట్టింది. నన్ను ఛండాలంగా తిట్టింది. చవటనంది. మగాడివి కాదంది. నా అంతు చూస్తానంది. మగాడ్ని ఆడది బలాత్కారంచేసే అవకాశంలేదు కాబట్టి నేను బయట పడ్డాను. ఆ మర్నాడు నేను ఊరెళ్ళిపోయాను.

ఆ తర్వాత వాళ్ళింటికెప్పుడూ వెళ్ళలేదు.

ఆ కారణంగానే ఎమ్. ఏ. పరీక్షలు రాయడానికి వచ్చి కూడా వాళ్ళింటికెళ్ళకుండా హోటల్లో దిగాను.

ఇప్పుడు నామీద కక్ష తీర్చుకోవాలని వారిజ తనను, నేనే మానభంగం చేశానని పోలీసులకు చెప్పింది. నాకేమీ తెలియదన్నా ఎవ్వరూ విన్పించుకోలేదు.

అసలు ఈ విషయాలను ఎవరికీ చెప్పలేదు. చెప్పినా ఎవ్వరూ నమ్మరు. నా దురదృష్టంకొద్దీ సంగారెడ్డిలో గాకుండా ఇక్కడ ఉన్నాను." అని ముగించాడు సుధీర్.

"అదన్న మాటసంగతి" మనస్సులో అనుకున్నాను. పైకిమాత్రం "ఊ....కథలు బాగానే చెప్తున్నావ్, నువ్వు తప్పించుకోలేవు" అనేసి అక్కడినుండి వచ్చాను.

"ఏమంటున్నాడు?" నన్ను చూస్తూనే అడిగాడు ఇన్‌స్పెక్టర్. ఆయన కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చుంటూ చెప్పాను. "తనకేమీ తెలియదంటున్నాడు."

"నేరం చేసిన ప్రతివాడూ అనే మొదటిమాటే ఇది. మానభంగం చేయబడ్డ యువతే చెప్పిన తరువాత ఇంక తిరుగేముంది? ఇతనికి ఆ యింటి గుట్టుమట్టులన్నీ తెలుసు. లాయరుగారి దగ్గిర బంధువుగదా! ఏ దురుద్దేశం లేకుంటే,

హోటల్లో గది ఎందుకు తీసుకున్నాడు? పైగా మానభంగం జరిగిన సమయంలో సుధీర్‌కు ఎలిబీలేదు. కేసు క్లియర్‌గా ఉంది. ఇతనే ఆపని చేశాడని నేను నమ్ముతున్నాను. అంతెందుకు? వారిజ సాక్ష్యం చాలు. మానభంగాల కేసుల్లో అత్యాచారానికి గురయిన మహిళ సాక్ష్యానికి ప్రాముఖ్యత నిస్తారు. వీడికి శిక్షపడటం ఖాయం." ఇన్‌స్పెక్టర్ వివరించిన తర్వాత నాలోఉన్న కొద్ది అనుమానం పటాపంచలైంది.

"అయితే కోర్టులో సుధీర్ నేరం ఋజువుచేయగలనంటారు?" అడిగాను.

"ముమ్మాటికీ" దృఢంగా పలికాడు ఇన్‌స్పెక్టర్.

ఆయనిచ్చిన 'టీ' త్రాగి బయటకు వచ్చాను. సిగరెట్ వెలిగించి ఆలోచిస్తున్నాను....

—రెండో మానభంగం ఎవరిని చేయాలా అని....! ☐

ఎరుపు?

వెంటాడే సింహం

వి.యస్.రావ్

లిఫ్ట్ నాలుగో అంతస్థులో అగింది.

శివరామ్ ఇవతలికి వచ్చి తన గదివేపు తీవిగా నడవ సాగేడు. తళతళలాడుతున్న మొసాయిక్ మీద, అద్దాల్లా పాలిష్ చేయబడిన బూట్లు టకటకమంటూ లయబద్ధంగా చప్పుడు చేస్తున్నాయి. తలుపు తోసుకుని 414 వ నంబరు

గదిలోకి ప్రవేశించాడతను.

బాత్‌రూమ్‌లోంచీ అప్పుడే ఇవతలికి వచ్చిన లత— అప్పుడే స్నానం చేసివచ్చిన ఖజురహో శిల్ప సుందరిలా వుంది. బాబ్డ్ హెయిర్‌లోంచీ నీళ్లు ముత్యాల్లా జారుతూ ఆమె శరీరాన్ని అణువణువునా అలంకరిస్తున్నాయి.

"హోటల్ బార్‌రూమ్‌లో ఒక సింహం ఆవురావు రంటోంది. నువ్వు త్వరగా తెమలాలి!" అన్నాడు శివ రామ్.

"ఏ అడివినుంచీ వచ్చిందా సింహం?" లత నవ్వుతూ టవల్తో జుట్టుని రుద్దుకుంటూ అడిగింది.

"ఉదయం నుంచీ అతన్ని నీడలా వెంటాడాను. అతని కోటుజేబుల్లో ధనలక్ష్మి మూలుగుతోంది. ఇవాళ రేసులో అతని పంట పండింది. అతను పందెంకాసిన గుర్రం మనకోసమే నెగ్గిందనిపిస్తోంది."

"డార్లింగ్, సింహాన్ని మన హోటల్‌కి ఎలా తోలు కొచ్చావ్?" లేస్ అండర్‌వేర్‌మీద మినీస్కర్ట్ తొడుక్కుంటూ లత ప్రశ్నించింది, నవ్వుతూ.

"నేను తోలుకురాలేదు. వేటాడే సింహం జంతువు లున్న అరణ్యం చేరుకున్నట్టు, అతనే ఇక్కడికొచ్చాడు!"

లత నవ్వుతూ స్కర్ట్‌మీద బ్లవుస్ తొడుక్కుంది. అయిదు నిమిషాల్లో ఆమె మేకప్ పూర్తయింది.

"హనీ, హిందీ సినీయాక్టర్ డేవిడ్ నీకు గుర్తున్నాడా? బార్ రూంలోకి వెళ్లు. అలాంటి పోలికలున్న వ్యక్తి బ్రౌన్ సూటులో బస్తాలా కూచుని జానీవాకర్ విస్కీ సేవిస్తూంటాడు. గర్ల్స్‌ని తినేసేలా చూస్తూంటాడు. అందంగావున్న ఆడది కంటబడితే అతను ఐస్సైపోతాడని నేను కనిపెట్టాను. నిన్ను చూడగానే నీళ్ళుకారిపోతాడు!

నిన్ను నా సిస్టర్‌గా పరిచయంచేసుకో. అతను పానకంలా విస్కీ సేవించేలా చూడు. నీతో పావుగంట కూచోగానే జపాన్‌లో గీషాతో కూచున్నట్టు అయిపోవాలతను! అర్థమైందా?" శివరామ్ నవ్వుతూ ప్రశ్నించాడు.

లత సగర్వంగా నవ్వింది. "పావుగంటలో అతన్ని హైదరాబాదునుంచీ జపాన్‌కీ, అక్కణ్నుంచీ సరాసరి పారిస్‌కి తీసికెళ్ళిపోతాను!"

శివరామ్ హుషారుగా లేచి నిలుచున్నాడు. "గో ఎహెడ్ అండ్ డూ ఇట్! నువ్వు రంగంలో ప్రవేశించిన ఇరవై నిమిషాల్లో నేను కలుసుకుంటాను." అంటూ శివరామ్ బాత్‌రూమ్‌లో దూరాడు.

2

ఎయిర్ కండిషన్డ్ బార్‌రూమ్‌లో ప్రవేశించి, శివరామ్ కాసేపు అలాగే నిలబడ్డాడు.

ఎర్రలైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి. బెల్లీ డాన్సర్ లిల్లీ స్టేజిమీద డిస్కో-రిథమ్‌కి అనుగుణంగా, భయంకరమైన ఉదరశూల వచ్చిన రోగిలా, నిలబడే విలవిల్లాడుతోంది.

మెత్తటి గడ్డిలావున్న తివాచీమీద శివరామ్ అడుగులు వేయసాగేడు. రౌండ్‌టేబుల్స్ చుట్టూకూచున్న కస్టమర్స్ డ్రింక్స్ సేవిస్తూ, వొళ్ళు మరిచిపోయి మత్తుగా బెల్లీడాన్స్ తిలకిస్తున్నారు.

స్టేజికి కొంచెం దూరంలో కూచున్న లతను గుర్తించి అతను అటువేపు నడిచాడు. లత అతన్ని చూడగానే చిరునవ్వు నవ్వింది.

శివరామ్ ఆమె ముందుకూచున్న వ్యక్తిని పరాకాయించి చూశాడు. అతను పొట్టిగా, లావుగా వున్నాడు. బట్టతల

మీద ఎర్రటి వెల్తురు మెరుస్తోంది.

లత నవ్వుతూ అతనితో ఏమిటో చెప్తోంది; తగ్గు స్వరంలో. ముందుకు వంగి ఆమె అతని ముందున్న గ్లాసులో ఎర్రటి జానీవాకర్ విస్కీని నీట్‌గా పోసింది. అతను విస్కీని చూడ్డంలేదు. బాగా కిందికి కత్తిరించిన ఆమె బ్లవుజ్‌లోంచీ బైటపడ్డానికి తన్నుకుంటున్న ఆమె సౌందర్య కేంద్రాలమీదే అతని చూపులు—మదపుటేనుగు కుంభస్థలంమీద అంకుశాల్లాగా నాటుకుపోయివున్నాయి. అతనింకా శివరామ్ ఉనికిని గుర్తించలేదు.

శివరామ్ చిన్నగా దగ్గాడు. "హై బ్రదర్!" లత హుషారుగా అరిచింది. అతని బట్టతల ఎవరో తిప్పిన గ్లోబులా చివాల్న పక్కకి తిరిగింది. అతని కళ్లు పైకి ఉబికి, రోషంతో చూస్తున్న పోట్లగిత్త కళ్ళని గుర్తుకు తెస్తున్నాయి.

"మిస్టర్ వర్మా, మీట్ మై బ్రదర్ శివరామ్. బ్రదర్ మిస్టర్ వర్మ, లీడింగ్ మాన్యుఫ్యాక్చరర్ ఆఫ్ అండర్ గార్మెంట్స్!" లత హుషారుగా పరిచయం చేసింది.

వర్మలేచి నిలబడ్డాడు. సగంపైగా ఖాళీ అయిన జానీ వాకర్ బాటిల్నీ, చివాల్న లేచిన వర్మనీ శివరామ్ ఆశ్చర్యంతో చూశాడు. వర్మ చెయ్యి అతని చేతిని వొడిసి పట్టుకుంది. తన చెయ్యి ఎలుగ్గొడ్డు చేతిలో ఇరుక్కున్నట్టనిపించింది శివరామ్‌కి.

"డిలైటెడ్ టు మీట్ యూ, మిస్టర్ వర్మా!" అన్నాడు శివరామ్.

"మైప్లెషర్, మిస్టర్ శివరామ్!" వర్మ చిన్నగా నవ్వాడు. "మీ సిస్టర్ చాలా చలాకీ అయిన యువతి. అయామ్ సారీ, లత ఆరంజ్ జూస్ తప్ప అమృతం

ముట్టుకోడంలేదు. విస్కీ అందానికి వన్నె తెస్తుందని ఆమెకి మీరు చెప్పివుండాల్సింది!"

శివరామ్ నవ్వుతూ కూచున్నాడు.

"మీరేం తీసుకుంటారు?" వర్మ హుషారుగా ప్రశ్నించాడు.

"చిల్డ్ బీర్."

వర్మ నిరుత్సాహంతో చూశాడు. "నా విస్కీలో పాలు పంచుకోండి!"

శివరామ్ నవ్వాడు. "పాలలో పాలు పంచుకోగలను గానీ, విస్కీలో పాలు పంచుకోలేను! హాట్ డ్రింక్స్ నా తత్వానికి సరిపడవు."

"వెరీబాడ్....ఓకే....తత్వాన్ని అనుసరించి తాగడం మంచిది," అంటూ వర్మ హుషారుగా ఈలవేశాడు. బేరర్ రాగానే బీర్ ఆర్డరిచ్చాడు.

శివరామ్ దృష్టిని బెల్లీడాన్సర్ లిల్లీమీద కేంద్రీకరించాడు. వర్మ అతనివేపు చూశాడు. "మిస్టర్ శివరామ్, ఫర్గెట్ దట్ సిల్లీడాన్సర్. ఆ పిల్ల బెల్లీడాన్స్‌ని హైలైట్‌గా యీ హోటల్‌వాళ్లు ఎందుకు చిత్రిస్తున్నారో నాకు అర్థం కావట్లేదు. కనీసం నా కంపెనీ తయారుజేసే అండర్ వేర్‌నీ, బ్రాసియర్స్‌నీ ఆ పిల్లకి తగిలించి వుండాల్సింది!"

"నిజంగా?" శివరామ్ నవ్వుతూ ప్రశ్నించాడు.

"ముమ్మాటికీ. నా మట్టుకు నాకు ఆ డాన్సర్ని చూడ్డం కన్నా మీ సిస్టర్ని చూస్తూ కూచోటం ఎంతో బాగుంది. కొంతమంది ఎంత వొళ్లు హూనం చేసుకున్నా ఆకర్షణ పుట్టదు. లకలాంటి వాళ్ళు కదిల్తేచాలు; కళ్లు బైర్లు కమ్ముతాయ్! డోంట్ మిస్టేక్ మీ...." అన్నాడు వర్మ లతను మెప్పుగా చూస్తూ.

లత నవ్వింది. శివరామ్ శృతి కలిపాడు. "అయామ్ హాపీ. సిస్టర్ మీకు నచ్చింది...." అన్నాడు. బేరర్ బీర్ పెట్టివెళ్లాడు. శివరామ్ గ్లాసుని అందుకుని వర్మవైపు చూశాడు.

"మీకోసం!"

వర్మ కొంచెం మత్తుగా అతన్ని చూశాడు. చూపుల్ని మెల్లగా లతవైపు తిప్పాడు. "నాకోసం, మీకోసంకాదు: లతకోసం!" అన్నాడు ఉత్సాహంగా. గ్లాసులోని విస్కీని పానకంలా తాగేశాడు.

శివరామ్ బీర్ చప్పరిస్తున్నాడు.

నిమిషాలు దొర్లుతున్నాయి.

వర్మ తాత్కాలికంగా శివరామ్‌ని మరిచిపోయి, ఆప కుండా లతకు కబుర్లు చెప్తున్నాడు. మధ్య మధ్య లత నవ్వు అతని మాటలను పంక్చుయేట్ చేస్తోంది. ఆ నవ్వు విస్కీ మీద కోక్‌లా, వర్మమీద పనిచేస్తోందని శివరామ్ గమనిస్తు న్నాడు. వర్మ గ్లాసులోకి విస్కీబాటిల్ని ఖాళీచేసింది లత. వర్మచెయ్యి కొద్దిగా వణుకుతూ సోడా బుడ్డీని అందుకో బోయింది. లత చెయ్యి అతని చేతిని తాకింది.

"పాలల్లో నీళ్ళు కలిపినట్టు విస్కీలో సోడా ఎందుకు కలుపుతారు?" ఆమె నవ్వుతూ అడిగింది.

వర్మ పగలబడి నవ్వాడు. "వెల్‌సెడ్! పాలల్లో నీళ్లు కలపకూడదు!" అంటూ గ్లాసుని అందుకున్నాడు. శివరామ్ అతన్నే చూస్తున్నాడు. వర్మ మొహం గాలికొట్టిన బంతిలా వుబ్బివుంది. విస్కీ అతన్ని మేఘాలమీద నడిపిస్తోందని అతని వాలకం చెప్తోంది. రెప్పవేయకుండా అతను లతనే చూస్తున్నాడు. లత అలసటగా రెండు చేతుల్ని పైకెత్తి

వొళ్ళు విరుచుకుంది. ఉక్కిరి బిక్కిరవుతున్న ఆమె బ్లౌజుని ఉక్కిరి బిక్కిరవుతూ చూశాడు శర్మ.

"బాటిల్ ఖాళీ అయిపోయింది!" అంది లత శర్మను చూసి నవ్వుతూ. శర్మ అతికష్టంమీద తన చూపుల్ని లత మీంచీ బాటిల్‌వైపు తిప్పాడు.

"ఇంకా కావాలా?" హుషారుగా ప్రశ్నించాడు శర్మ రెప్పపాటులో ఆమెవైపు చూస్తూ. లత మాట్లాడకుండా నవ్వింది. శర్మ బేరర్ని కేకేశాడు. అతను రాగానే మరో జానీవాకర్ బాటిల్ పట్రమ్మన్నాడు. శివరామ్ శర్మను పరీక్షగా చూశాడు. ఇంకా తాగితే అతను కాళ్ళు విరిగిన బర్రెలా ఇక్కడే పడిపోతాడు! గ్లాసులో మిగిలివున్న బీర్‌ని తాగేసి అతను చిన్నగా దగ్గాడు.

"మిస్టర్ శర్మా, మీరు చెప్పింది నిజమే. డాన్స్ హారిబుల్‌గా వుంది. పదకొండు కావొస్తోంది. మేం వెళ్తాం...."

శర్మ గాబరాగా చూశాడు. "నోనోనోనో....ఐలైక్ యువర్...యువర్ సిస్టర్స్ కంపెనీ...ఇక్కడే కూచోండి!"

శివరామ్ తల అడ్డంగా వూగించాడు. లత లేచి నిల బడింది. శర్మ మొహాన్ని నిరుత్సాహం, విచారం ఆక్రమిం చాయి. విస్కీ ఇచ్చిన ఆవేశంలో అతను ఏడ్చేస్తాడేమో అనిపించింది శివరామ్‌కి.

"మిస్ లతా నన్నిలా వదిలి వెళ్ళిపోతావా?" శర్మ కంఠం ప్రాధేయపడింది. లత అతని దగ్గరగా నడిచి భుజమ్మీద చెయ్యివేసింది. శర్మ తల పైకెత్తి ఉమర్ ఖయ్యాం సాఖీమొహంలోకి చూసినట్టు చూశాడు.

"శర్మగారూ, క్షమించాలి. ఇక్కడ బోర్ కొడ్తోంది." అంది లత. శర్మ తూలుతూ లేచి టేబుల్‌మీద చేతులు

ఆన్చి నిలబడ్డాడు. అతని నిట్టూర్పు విస్కీవాసనని చిమ్మింది. "మిస్ లతా....మరో హోటల్‌కి....క్లబ్బుకి.... వెళ్దామా?" అతను ఆశగా, అమాయకంగా ప్రశ్నించాడు.

లత జవాబు చెప్పకుండా నవ్వింది. శివరామ్ కల్పించు కున్నాడు. "మిస్టర్ వర్మా, అది వీలుకాదు...."

వర్మ మత్తు దిగిపోయినట్టనిపించింది. అతను కళ్ళని ఒకసారి శివరామ్ వైపు తిప్పి, మళ్ళీ లతమీద దృష్టిని కేంద్రీకరించాడు. "మిస్ లతా, మన పరిచయం ఈ టేబుల్‌మీదే ఆగిపోతోంది. ఐ వాంట్ టు నో మోర్ ఎబౌట్ యూ!" అన్నాడు ఆవేశంతో.

"దెన్ లెటస్ గోటు అవర్ రూమ్." శివరామ్ సూచించాడు.

"యస్. అక్కడ హాయిగా కబుర్లు చెప్పుకోవచ్చు!" లత హుషారుగా అంది. వర్మ మొహం నవ్వుతో వెడల్పుగా అయ్యింది.

"లత ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చేస్తా. ఫాలో యూ టుది హెల్!" వర్మ ఉద్రేకంతో అన్నాడు. లత నవ్వింది.

"బేరర్, బిల్!" వర్మ అరిచాడు. బేరర్ జానీవాకర్ బాటిల్ని టేబుల్‌మీద వుంచి, గబగబా వెళ్లాడు. రెండు నిమిషాల్లో బిల్లుతో తిరిగొచ్చాడు.

వర్మ కోటు జేబులోంచీ వందరూపాయల కట్టలు పైకి తీశాడు. వాటివైపు అర్థంకానట్టు చూసి, టేబుల్‌మీద పడేసి, జేబులు వెతకసాగేడు. కాస్సేపు తంటాలుపడి, కోటు లోపలి జేబులోంచీ పర్సు తీశాడు. వందరూపాయల నోట్లనీ, యాభై రూపాయల నోట్లనీ ఇవతలికిలాగి బిల్లు చెల్లించి, చిల్లరంతా బేరర్ని తీసేసుకొమ్మన్నాడు. టేబుల్

మీదున్న వందరూపాయల కట్టల్ని తీసి కోటుజేబుల్లో కుక్కుకుని, నవ్వు మొహంతో లతవైపు చూశాడు.

"మిస్ లతా, నౌ టేక్ మీ టు యువర్ హెవెన్!" అన్నాడు హుషారుగా. లత చిరునవ్వుతో టేబుల్‌మీదున్న కొత్త బాటిల్ని అందుకుంది. వర్మ ఆమెను మెచ్చుకుంటూ చూశాడు. శివరామ్ దారి తీశాడు.

3

లత సరాసరి బెడ్‌రూమ్‌లోకి దారితీసింది.

కవ్విస్తూ కదుల్తోన్న ఆమె వెనకభాగం మీదే చూపులు తాపడం అయిపోయిన వర్మ గాలానికి తగులుకున్న బలిసిన చేపలా ఆమెను వెంబడించాడు. లత మంచం పక్కనే వున్న టీపాయ్‌మీద విస్కీబుడ్డీని వుంచి, వర్మకు చిరునవ్వుతో మంచం చూపించింది. వర్మ మంచంమీద బస్తాలా కూలబడ్డాడు.

కుషన్డు కుర్చీలో చతికిలబడి శివరామ్ సిగరెట్ వెలిగించాడు.

లత చకచకా అటూ ఇటూ తిరుగుతోంది. జిగురు బెల్లానికి అతుక్కుపోయిన ఈగల్లా వర్మచూపులు, మినీ స్కర్టూ, ట్రాన్స్‌పరెంట్ బ్లవుజూ ధరించిన లత శరీరాన్నే అంటిపెట్టుకుని వుండిపోయాయి. ఫ్లోరసెంట్ లైట్ వెల్తుర్లో ఆమె అందం వర్మకి ట్రేస్ పేపర్ వెనక బొమ్మలా స్పష్టంగా కనిపిస్తోంది.

"ఇప్పుడేవస్తా," అంటూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది. లత శరీరాన్ని మరుగుపరుస్తూ మూసుకున్న బాత్‌రూమ్ తలుపు మీంచి తన చూపుల్ని వర్మ శివరామ్‌వేపు తిప్పాడు.

"మిస్టర్ శివరామ్, ఇంతకీ మీరేం చేస్తున్నారు?" వర్మ ప్రశ్నించాడు.

"పెద్దలు సంపాదించి పోగేసిన డబ్బుని రీజనబుల్‌గా ఖర్చుచేస్తున్నా. అదే నా ఉద్యోగం!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

వర్మ కళ్ళు పెద్దగాచేసి చూశాడు. "యూ ఆర్ లక్కీ. నా పెద్దలు నన్ను ఫుట్‌పాత్ మీద వదిలేశారు! ఈ చేతుల్తో, ఈ బుర్రతో అంతా నేను ఆర్జించాను," అన్నాడు వర్మ.

"పోనీలెండి. యువర్ చిల్డ్రన్ విల్ బీ లక్కీ!" శివరామ్ చిరునవ్వుతో అన్నాడు. వర్మ తలాడించాడు. కళ్ళు చిట్లిస్తూ శివరామ్‌వైపు చూశాడు.

"ఇక్కడికెందుకొచ్చారు?"

"ఈ ఊళ్ళో చెల్లికిపెళ్ళి సంబంధం చూశాను. ఇంట ర్వ్యూకి వచ్చాం."

వర్మ నాలుక చప్పరించాడు. "లతలాంటి చురుకైన యువతిని పెళ్ళిద్వారా సంసారం అనే పంజరంలో బంధించడం అన్యాయం!" అతని నోట్లోంచి మాటలు ముద్దగా వస్తున్నాయి.

"పెళ్ళిచేసుకోకుండా ఏం చెయ్యమంటారు? జీవితానికి అర్ధం వుండాలిగా?" బాత్‌రూమ్ ముందునుంచీ లత కంఠం ప్రశ్నించింది. యజమాని విజిల్ విన్న బుల్‌డాగ్‌లా తల తిప్పి ఆమె వైపు చూశాడు వర్మ.

ఉలిపిరి కాగితంతో తయారైనట్టున్న పింక్ కలర్ నైట్‌గౌన్ని ధరించిన లత నాట్యం చేస్తున్నట్టు కదిలి వస్తోంది. అప్పుడప్పుడే కప్పుకుంటున్న నివురువెనక నిప్పులా లత శరీరం పల్చటి నైట్‌గౌన్‌లోంచీ మెరుస్తోంది. వర్మ నోరు అప్రయత్నంగా తెరుచుకుంది. ఎర్రగా వున్న అతని కళ్ళు లత నైట్‌గౌనుని కోరికతో వాలిచే

స్తున్నాయి. లత అతనికేసి చిలిపిగా నవ్వుతోంది.

"చెప్పండి. పెళ్ళి చేసుకోకుండా ఏం చెయ్యమంటారు?" లత అతన్ని హెచ్చరించింది.

వర్మ, ఆమె వొంపుల మధ్య ఇరుక్కుపోయిన చూపుల్ని బలవంతంగా ఇవతలికి లాగాడు. "లతా, నీ లాంటి బ్యూటీ నాలుగ్గోడల మధ్య ఖైదీ అయిపోరాదు. దట్ విల్ బీ ఎ లాస్ టు ది నేషన్!" అన్నాడతను. లత రెప్పలు టపటప లాడిస్తూ అర్థం కానట్టు చూసింది. వర్మ సీరియస్‌గా చూశాడు.

"నా కంపెనీ తయారుచేసే అండర్ గార్మెంట్స్‌కి ఇంటర్‌నేషనల్ లెవెల్లో బ్రహ్మాండంగా పబ్లిసిటీ ఏర్పాటు చేయాలనుకుంటున్నా. నిన్ను మాంచి జీతంమీద మోడల్‌గా తీసుకుంటాను. ప్రపంచంలోని ఫస్ట్‌క్లాస్ పత్రికల్లో నీ ఫోటో—నా ప్రొడక్ట్స్‌ని ధరించిన నీ ఫోటో పబ్లిష్ అవుతుంది. నువ్వు కళ్ళు మూసి తెరిచేలోగా ప్రొడ్యూసర్లు నీ ముందు క్యూలో నించుంటారు...."

"ఐ డోంట్ లైకిట్!" శివరామ్ అడ్డొస్తూ అన్నాడు.

"....యువర్ బ్రదర్ శివరామ్ నీ ఏజెంటుగా వ్యవహరిస్తాడు. అచిరకాలంలో నువ్వు నోట్లకట్టల మీద కూచుంటావు. నోట్లకట్టలమీద పడుకుంటావు. నోట్లకట్టలమీద నడుస్తావు!' వర్మ శివరామ్ మాటని వినిపించుకోకుండా అన్నాడు.

శివరామ్ లతకేసి చూశాడు. లత వర్మ పక్కనే మంచంమీద కూచుంది. వర్మ తాగుతున్న విస్కీ గ్లాసుని టీపాయ్‌మీద పెట్టి, ఆమెవైపు తిరిగాడు. లత రెండు చేతుల్నీ బాబ్డ్ హెయిర్‌లోనికి పోనిచ్చి, సర్దుకుంటూ నవ్వింది. ఆమె నవ్వు దీపకరాగంలాగా అతనిలో ఏదో

మంటని సృష్టిస్తోంది. అతని కనుగుడ్లు గోలీకాయల్లా కిందికి రాలిపోతాయేమో అనిపించింది శివరామ్‌కి.

"మీ ప్లాన్ బాగుంది....కానీ...." లత అలసట నటిస్తూ ఆవులించింది చేతుల్ని పైకెత్తి వొళ్ళు విరుచుకుంటూ.

"డోంట్ సే కానీ! లతా, నీకు తెలీదు. నీ బ్రదర్ శివరామ్‌కీ తెలీదు. నువ్వు .... మోడలింగ్ కోసమే పుట్టావు!"

లత నవ్వుతూ పైకి లేచింది. నాట్యసుందరిలా ఫోన్ దగ్గరకు అడుగులేసింది. "ఆకలవుతోంది. మిస్టర్ వర్మా, మీకేం కావాలో చెప్పండి" అందామె ఫోన్ని అందుకుంటూ. వర్మ మౌనంగా, ఆమెనే చూస్తున్నాడు. లత చలాకీగా తల విదిలించి, చెవుల్ని కప్పిన బాబ్డ్ హెయిర్ని పక్కకి ఎగరేసుకుంది. ఆమె చెయ్యి రిసీవర్ని, చెవికి ఆనించింది. శివరామ్ వర్మను ఒకసారి చూసి, లతవైపు తిరిగాడు.

"నాకు చపాతీ కుర్మా!" అన్నాడు.

వర్మ ఉలిక్కిపడ్డాడు. "నేను కూడా చపాతీ తీసుకుంటా. ఆర్డర్ సమ్ చిప్స్ అండ్ కాష్యూనట్స్!" అన్నాడు హుషారుగా. లత ఆర్డరిచ్చి, మళ్ళీ మంచంమీదికి చేరింది.

కొద్దిసేపటికి బజర్ చప్పుడైంది. "కమిన్!" అన్నాడు శివరామ్. యూనిఫామ్‌లో వున్న బట్లర్ గదిలో ప్రవేశించాడు. లత ఆర్డరిచ్చిన పదార్థాలన్నీ టీపాయ్‌మీద సర్ది, వినయంగా నిలబడ్డాడు. వర్మ పర్సుకోసం నిమిషంపాటు జేబులన్నీ వెతికి, బట్లర్‌కి అయిదురూపాయల టిప్ ఇచ్చాడు. బట్లర్ సలాంచేసి వెళ్ళిపోయాడు.

లత ముందుకి వంగి, ప్లేట్లోని జీడిపప్పుని అందుకుంటోంది. ఆమె శరీరం వర్మ ముంజేతిని నొక్కుతోంది. తను కోటూ, షర్టూ వేసుకున్నందుకు వర్మ అంత మత్తులోనూ విచారించాడు. తను మొదటిసారిగా వెండితెర మీదికి ఎక్కించిన మందాకిని పెర్ఫార్మెన్స్‌ని నిశితంగా, తృప్తికరంగా చూస్తూన్న రాజ్‌కపూర్‌లా శివరామ్ లత నటనని చూస్తూ కూచున్నాడు. వర్మ మొహంమీద చెమట బిందువులు మెరుస్తున్నాయి.

"ఉక్కగా వుంది. కోటు తీసేస్తారా?" శివరామ్ వర్మ ఆలోచనల్ని చదువుతూ ప్రశ్నించాడు. వర్మ కృతజ్ఞతతో చూశాడు.

"యస్....అగ్నిగుండంలో వున్నట్టుంది. షర్టు కూడా తీసేస్తా...." అంటూ తడబడే వేళ్ళతో బటన్స్ విప్పే ప్రయత్నం చేయసాగాడు. లత అతనికి సహాయపడింది. రెండు నిమిషాలు కష్టపడి వర్మ కోటూ, షర్టూ ఊడదీశాడు. అతను బనియన్ వేసుకోలేదు. ఛాతీ కంబళిలా వుంది. లత అతని కోటునీ, షర్టునీ శివరాం కందించింది. శివరామ్ వాటితో మంచానికి అటువైపు నడిచాడు.

"మిస్టర్....శివరామ్, పదినిమిషాల్లో బాత్రూమ్‌లో స్ట్రిప్‌టిజ్ ప్రారంభమవుంది. వెళ్ళిరండి!" అన్నాడు వర్మ సాలోచనగా.

"అతిథిని గదిలో ఒంటరిగా వదిలివెళ్ళడం సభ్యత కాదు!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"నాకు....తోడుగా....లత ఉందిగా?" వర్మ హుషారుగా అన్నాడు. లతవైపే చూస్తూ మెల్లిగా లేపబోయి, ఎముకల్లేని మాంసంముద్దలా కూలబడ్డాడు.

శివరామ్ ఆవులించాడు. "నిద్ర ముంచుకొస్తోంది...."

అన్నాడు లతను చూస్తూ.

వర్మ అతనివైపు చూశాడు. "శివరామ్, నువ్వు లతకి బ్రదరవుతే, నాకు బ్రదర్ని్లావి....వెళ్ళి ముందు గదిలో.... హాయిగా పడుకో. గో!" అన్నాడు తడబడుతూ, ఏక వచనంలోకి దిగి.

శివరామ్, వర్మ మొహంలోకి తదేకంగా చూశాడు. వర్మని విస్కీ పూర్తిగా తన ప్రవాహంలోకి లాక్కు పోయింది!

లత ప్లేటుని టేబుల్ మీద పడేసి, సింక్ లో చెయ్యి కడుక్కుని నవ్వుతూ మంచంవేపు అడుగులేసింది. "త్వరగా కానివ్వండి. పొద్దుపోయింది...." అంది.

వర్మ హిప్నటైజ్ చేయబడిన వాడిలా గ్లాసులోని విస్కీని గడగడా తాగేశాడు. అతని తలలో రాకెట్లు దూసుకుపోతున్నాయి. తారాజువ్వల్లా ఏవో మెరుస్తూ ఎగురుతున్నాయి. అతను అతి కష్టంమీద దృష్టిని లతమీదే కేంద్రీకరిస్తున్నాడు. డబుల్ యాక్షన్ చేస్తున్నట్టు లత రెండు ఆకారాలుగా అతనికి కనిపిస్తోంది. లత అతని దగ్గరగా ఆగింది. ఆమె రెండు ఆకారాల్నీ ఒకేసారి తన వొళ్లోకి లాక్కోవాలనిపిస్తోంది వర్మకి.

ఆశగా రెండు చేతుల్నీ ముందుకి, గాల్లోకి చాచాడు, లత రెండు అరచేతుల్నీ అతని భుజాలమీద వేసి, నవ్వుతూ వెనక్కి తోసింది. వర్మ మంచానికి అడ్డంగా, దూలంలా పడ్డాడు. రెండు మేకల్ని వొకేసారి మింగేసి, నీరెండలో ఆయాసంతో కదుల్తున్న కొండచిలువలా వుందతని శరీరం. అతని తల కొద్దిగా వెనక్కి వాలింది.

అతని కళ్ళకి, ముందు నించున్న శివరామ్ తల్లక్రిందులుగా కనిపిస్తున్నాడు. శివరామ్ అతన్ని చిరునవ్వుతో చూస్తు

న్నాడు. వర్మ కళ్ళు లత కోసం వెతుకుతున్నాయి. కళ్ళని కప్పేయకుండా రెప్పల్ని దూరంగా వుంచాలని అతను విశ్వప్రయత్నం చేస్తున్నాడు.

తల్లక్రిందులుగా నిల్చున్న శివరామ్ చేతులు కోటుని అందుకుంటున్నాయి. వర్మ ఏదో చెప్పాలనుకున్నాడు. మత్తు మంచులా దట్టంగా అతని మెదడుని ఆవరించి, ముసుగులా కప్పేసింది....

4

ఉదయం ఎనిమిదయ్యింది.

కాఫీ కప్పు కింద పెట్టి, శివరామ్ సిగరెట్ వెలిగించాడు.

లత కాఫీ చప్పరిస్తూ అతన్నే చిరునవ్వుతో చూస్తోంది. రాత్రి జరిగిందంతా ఆమెకి గుర్తొస్తోంది. శివరామ్‌ని ఏదో ప్రశ్నించబోయింది. ఛెయిమ్స్ రాగయుక్తంగా ధ్వనించాయి.

లత ప్రశ్నార్థకంగా శివరామ్‌ని చూసింది. అతను చిరునవ్వుతో లేచి తలుపువేపు నడిచాడు.

తలుపుతీసి, ఎదురుగా నిలబడ్డ పోలీసాఫీసర్ని ఆశ్చర్యంతో చూశాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ గడ్డపారలు మింగినట్టు నిలబడున్నారు.

"మిస్టర్ శివరామ్?" యూనిఫాంలో వున్న ఆఫీసరు కంఠం బొంగురుగా ప్రశ్నించింది. అలవాటయిపోయిన అనుమానం అతని కళ్ళని కాంటాక్ట్ లెన్స్‌లా అంటిపెట్టుకుని వుంది.

"యస్!" శివరామ్ కనుబొమలు రెండూ కలిశాయి.

"అయామ్ ఇన్‌స్పెక్టర్ దేస్‌పాండే. మీ గదిని సోదా చేయాలి...." ఇన్‌స్పెక్టర్ కుడిచేత్తో పట్టుకున్న లాఠీ

అతని ఎడమ అరచేతిమీద తాళం వేస్తోంది.

శివరామ్ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దగా చేశాడు. "ఇన్‌స్పెక్టర్ మీరు దారితప్పి ఇక్కడికి రాలేదుగా?"

ఇన్‌స్పెక్టర్ పెదవులు చిరునవ్వుతో కొద్దిగా కదిలాయి. అతని చూపులు శివరామ్ భుజంమీదుగా అప్పుడే వస్తున్న లతను చూస్తున్నాయి. "మిస్టర్ శివరామ్, రూమ్ నంబర్ 414, హోటల్ విస్కోలాండ్...." అంటూ జేబులోంచీ సెర్చ్‌వారెంట్ తీసి, శివరామ్ చూసేలా పట్టుకున్నాడు.

శివరామ్ నిర్లక్ష్యంగా దాన్ని క్షణకాలం చూసి, ఇన్‌స్పెక్టర్ని చూశాడు. "ఇంతకీ ఏమిటిదంతా?"

"గతరాత్రి ప్రముఖ వ్యాపారవేత్త వర్మగార్ని మీరు బార్‌రూంలోంచీ ఈ గదికి తీసుకొచ్చారు. ఆయన చేత విపరీతంగా తాగించి, మీ సిస్టర్ మిస్ లతని ఆయన మీద ప్రయోగించి—క్షమించాలి. వర్మగారి కంప్లెయింట్ సారాంశాన్ని నేను చెప్తున్నా—ఆయన కోటూ, షర్టూ తీసేసేలా చేసి ఆయన జేబుల్లోంచీ ముప్ఫైరెండువేల రూపాయలు కాజేశారు...." ఇన్‌స్పెక్టర్ ఆగాడు.

శివరామ్ లోపల్లోపల నవ్వుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ని తీక్షణంగా చూశాడు. "ఇన్‌స్పెక్టర్, వర్మ మీకు లేనిపోని వన్నీ చెప్పాడు. అతను మమ్మల్ని రొంపలో పట్టుకున్నాడు. అతనే బలవంతంగా మా గదికి వచ్చాడు. తప్పతాగి పడిపోయాడు. అతన్ని ఈ గదిలో, ఆ సోఫాలో పడుకోబెట్టాం. అతనెప్పుడు వెళ్ళిందీ మాకు తెలీదు. ఇంతే నాకు తెలుసు!"

ఇన్‌స్పెక్టర్ అర్థం కానట్టు చూశాడు. "మా డ్యూటీ మేంచేస్తాం....' అంటూ గదిలోకి దూరబోయాడు. శివరామ్ అడ్డంగా జరిగి, అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాడు.

"గౌరవంగా జీవించే ఒక పౌరుడిని మీరు అనుమానించి, అవమానిస్తున్నారు. ఇన్స్పెక్టర్, తరవాత నేను చట్టరీత్యా చర్య తీసుకోవాల్సి వుంటుంది!" అన్నాడు గంభీరంగా.

ఇన్స్పెక్టర్ దేశ్‌పాండే భుజాలు ఎగరేశాడు. చిన్నగా నవ్వాడు. "మీ స్వాతంత్ర్యాన్ని ఎవ్వరూ అరికట్టలేదు. మీ ఇష్టమొచ్చినట్టు చేయొచ్చు!" అంటూ శివరామ్‌ని తోసుకుంటూ గదిలోకి దూరాడు. కానిస్టేబుల్స్ జంట వేట కుక్కల్లా అతన్ని వెంబడించారు. గది మధ్యలో నిలబడి కళ్ళు చిట్లించి చూస్తున్న లతవేపు అదో రకంగా చూస్తూ ఇన్స్పెక్టర్ బెడ్‌రూమ్‌లోకి దారితీశాడు.

శివరామ్ లోపలికి నడిచి సోఫాలో కూచున్నాడు. ఆరిపోయిన సిగరెట్‌ని దూరంగా విసిరి, మరో సిగరెట్ వెలిగించాడు. లత అతనివైపు చూపుల్తో ఎన్నో ప్రశ్నల్ని రువ్వుతోంది. శివరామ్ చిరునవ్వు నవ్వాడు. పొగని రింగుల్లా వదలసాగేడు. బెడ్‌రూమ్‌లోంచీ ఏవో శబ్దాలు వినిపిస్తున్నాయి. నిధికోసం పోలీసువాళ్ళ అన్వేషణ సాగుతోంది. శివరామ్ లత కళ్ళల్లోకి సూటిగా చూశాడు.

"ఏమి టీ దౌర్జన్యం?...." లత అతన్ని ప్రశ్నించింది కోపంగా.

"పోలీసువాళ్ళు దౌర్జన్యం చేయరు! డ్యూటీ చేస్తారు. ఆ వర్మ మాటలు విని పెద్దమనిషనుకుని నువ్వతనితో కూచోకుండా వుంటే బాగుండేది" శివరామ్ బిగ్గరగా బెడ్‌రూమ్ డోర్ వెనక నిల్చుని ఒక చెవి ఇటు పారేసిన ఇన్స్పెక్టర్‌కి వినిపించేలా అన్నాడు.

"ఆ వర్మతో పరిచయం కావడం నా ఖర్మ!" అంది లత శృతి పెంచి. లత చిటికెలో తన పాత్రని అర్థం

చేసుకోగలదు.

నిమిషాలు గడుస్తున్నాయి. ఇన్‌స్పెక్టర్, కానిస్టేబుల్స్ ముందు గదిలోకివచ్చారు. కానిస్టేబుల్స్ ఆ గదిలోని ఫర్నిచర్ కింద, అక్కడా ఇక్కడా వెతికి, నిరుత్సాహ మొహాలు పెట్టుకుని నిలబడ్డారు. శివరామ్ జరుగుతున్న నాటకం చూస్తూ సిగరెట్ పీలుస్తూ మౌనంగా కూచున్నాడు. అతని మొహం కోపంతో, అవమానంతో బిగుసుకుపోయినట్టుంది.

ఇన్‌స్పెక్టర్ శివరామ్ ముందు ఠీవిగా నిలబడ్డాడు. లాఠీ అతని ఎడమ అరచేతిని అసహనంగా చరుస్తూనే వుంది.

"మిస్టర్ శివరామ్, మిమ్మల్ని సోదా చేయాలి...." అన్నాడతను ముక్తసరిగా.

శివరామ్ చిన్నగా నవ్వాడు. "ఇన్‌స్పెక్టర్, ఆ పని మొదటే చేసివుండాల్సింది. ఈ పదినిమిషాల్లో నేను లూటీ సొమ్ముని నాశనం చేసివుండొచ్చు!"

ఇన్‌స్పెక్టర్ మొహం కందగడ్డలా అయింది. "ఏ పని ఎప్పుడు చేయాలో మాకు తెలుసు! ప్లీస్ స్టాండప్!" అన్నాడతను.

భుజాలు ఎగరేస్తూ శివరామ్ లేచి నిలబడ్డాడు. ఇన్‌స్పెక్టర్ చేతిలోని లాఠీ ఒకసారి తన తాళం తప్పించి, కానిస్టేబుల్స్‌కి శివరామ్‌ని చూపించింది. కానిస్టేబుల్స్ మర బొమ్మల్లా కదిలారు. శివరామ్ సిగరెట్‌ని పెదాల మధ్య ఇరికించి రెండు చేతుల్ని పైకెత్తాడు. పొగ తీగలా పైకి సాగుతోంది. అతను కళ్ళు చిట్లించి ఇన్‌స్పెక్టర్ వైపే చూస్తున్నాడు. అతని వొళ్ళంతా జాగ్రత్తగా తడివిన నాలుగు చేతులు దూరంగా జరిగాయి.

"జేబుల్లో, బెల్ట్‌లోపలా ఏమీలేదు సార్," ఒక కాని

స్టేబుల్ అన్నాడు. ఇన్స్పెక్టర్ తల పంకించాడు. ఏం చేయాలో తోచనివాడిలా అలాగే నిలబడ్డాడు.

"బెడ్‌రూంలో కెళ్దామా? నా శరీరాన్ని పూర్తిగా చెక్ చెయ్యొచ్చు...." ఇన్స్పెక్టర్‌కి సహాయపడేవాడిలా సలహా యిచ్చాడు శివరామ్. లత కిసుక్కున నవ్వింది. కానిస్టేబుల్స్ శృతికలపబోయి, ఇన్స్పెక్టర్ మొహాన్ని చూసి ఆపుకున్నారు.

ఇన్స్పెక్టర్ శివరామ్ కళ్ళలోకి సూటిగా చూశాడు. క్రమేపీగా లాఠీని అతనివైపు పొడుగ్గా, కబంధుడి చూపుడు వేలులా చాచాడు.

"మిస్టర్ శివరామ్, మీకో సలహా ఇస్తాను. వర్మగారి డబ్బు వాపసు చేయండి. రాత్రి ఆయన పొరపాటుగా పడేసుకున్న నోట్లకట్టల్ని పొద్దుట మీరుచూసి, ఆయనకి అందజేసే ప్రయత్నంలో వున్నారని ఆయనకి నచ్చజెప్పి కేసులూ, గొడవలూ లేకుండా చేస్తాను. వర్మగారు హోమ్ మినిస్టరుకి బాగా సన్నిహితులు...."

శివరామ్ బిగ్గరగా నవ్వాడు. "ఇంతసేపూ నా గదిని గాలించారు. అక్కడ ఏమీ లేకపోయేసరికి, నా మనసుని సోదాచేయాలని చూస్తున్నారు! అక్కడ కూడా మీకు ఏమీ దొరకదు. ఇన్స్పెక్టర్! వర్మకు ఘనానావాళ్ళతోవున్న సంబంధాలు మీకు పనికుపట్టించవచ్చు. అతను ప్రెసిడెంట్‌కి బంధువైనా ఐ డోంట్ కేర్! ఎందుకంటే, అతని డబ్బుని నేను ముట్టుకోలేదు. అతను ఇదిగో తోక అంటే మీరు అదిగో పులి అంటూ పరుగెత్తుకొచ్చారు. ప్లీజ్ టూ మచ్!"

"వర్మగారు అబద్ధాలాడరు!" ఇన్స్పెక్టర్ క్లుప్తంగా అన్నాడు.

"లోకంలో అబద్ధాలాడనివాళ్ళు ఇంకా చాలామంది వున్నారు, ఇన్‌స్పెక్టర్! శివరామ్ గంభీరంగా అన్నాడు.

"ఆల్‌రైట్....మీరు మాతో స్టేషన్‌కి రావాల్సి వుంటుంది.... ఇన్‌స్పెక్టర్ బెదిరిస్తున్నట్టు అన్నాడు.

శివరామ్ వేళ్ళమధ్యవున్న సిగరెట్‌ని దూరంగా విసిరి, లత వైపు చూశాడు. ఆమె బెంగారుగా చూస్తోంది. శివ రామ్ చిన్నగా నవ్వి ఇన్‌స్పెక్టర్‌వైపు తిరిగాడు.

"ఇన్‌స్పెక్టర్, ఒక లేడీ పోలీసుని మీరు వెంటపెట్టుకు రావాల్సింది. లతను మీరు చెకప్ చేయలేదు..." అన్నాడు ఎగతాళిగా.

ఇన్‌స్పెక్టర్ లోపల్లోపలే పళ్లు కొరుక్కున్నాడు. ఇబ్బందిగా కదిలి లతవైపు మౌనంగా చూశాడు. స్కర్టూ, జ్లి జూ వేసుకున్న లత కాలుమీద కాలువేసుకుని సోఫాలో వెనక్కివాలి కూచుంది. కా స్టేబుల్స్ కుందేలుని చూసే హౌండ్స్‌లా ఆమెనే గుడ్లప్పగించి చూస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ శివరామ్‌వైపు తిరిగాడు.

"ఆమె ఏమీ దాచుకోలేదని చూడగానే తెలుస్తోంది!" సూదితో పొడుస్తున్నట్టు మాట్లాడుతున్న శివరామ్‌కి చురక తగిలేలా జవాబు చెప్పాలని కాచుకున్న ఇన్‌స్పెక్టర్ కసిగా అన్నాడు.

"థాంక్స్ ఇన్‌స్పెక్టర్!" అంది లత నవ్వుతూ.

"మీ ఇష్టం...." అన్నాడు శివరామ్ నవ్వుతూ.

"మిస్టర్ శివరామ్, లెటస్‌గో," అంటూ ఇన్‌స్పెక్టర్ గుమ్మంవైపు తిరిగాడు.

"నేను రానంటే మీరేంచేస్తారు?" శివరామ్ సోఫాలో కూచుంటూ ఇన్‌స్పెక్టర్ వీపుని ప్రశ్నించాడు.

ఇన్స్పెక్టర్ ఆగి వెనక్కి తిరిగి, సగర్వంగా చిరునవ్వు నవ్వాడు. "వర్మగారు ఇదంతా ముందుగానే ఊహించారు. నా జేబులో అరెస్టువారెంటుంది!"

శివరామ్ కాలుమీద కాలు వేసుకున్నాడు. ఆలోచిస్తూ జేబులోంచి ఇండియాకింగ్స్ పాకెట్ తీసి, సిగరెట్ వెలిగించాడు. పొగవదుల్తూ ఇన్స్పెక్టర్ని అదోలా చూశాడు. అతను మర్యాదగా రానంటాడేమో అన్న ఆశ ఇన్స్పెక్టర్ కళ్ళలోంచి దొంగలా తొంగిచూస్తోంది. తటాలున శివరామ్ లేచాడు.

"ఓకే, ఇన్స్పెక్టర్. వర్మ పాటకీ, మీ తాళానికీ అనుగుణంగా కాసేపు నేను ఆడతాను. లెటస్ గో!" శివరామ్ ఇన్స్పెక్టర్ వెంట నడిచాడు.

మరోగంట తర్వాత బెయిల్ మీద విడుదలై వచ్చాడు శివరామ్.

5

అందరూ లేచి నిలబడ్డారు. జడ్జి శివలింగం కూచున్నాడు. అందరూ కూచున్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేదాంతరావు బుల్ఫైటర్లా నిలబడ్డాడు.

"ప్రాసిక్యూషన్ తరఫునా, డిఫెన్స్ తరఫునా అంతా సిద్ధంగా వున్నారా?" జడ్జి శివలింగం ప్రశ్నించాడు.

"ప్రాసిక్యూషన్ సిద్ధంగావుంది, మిస్టర్ జస్టిస్!" వేదాంతరావు ఉషారుగా అన్నాడు.

శివరామ్ లేచి, రెండడుగులు వేసి జడ్జివైపు తిరిగి నించున్నాడు. "మిస్టర్ జస్టిస్, నేను ముద్దాయి శివరామ్ని. నన్ను నేనే డిఫెండ్ చేసుకోడానికి కోర్టు అనుమతి కోరుతున్నా," అన్నాడు.

జడ్జి అద్దాల్లోంచి అతన్ని క్షణకాలం జాగ్రత్తగా చూసి,

తలపంకించాడు. "నిరభ్యంతరంగా," అంటూ ప్రాసి క్యూటర్ని చూశాడు. "ప్రారంభించండి."

"ముద్దాయి శివరామ్ తన చెల్లెలు మిస్ లత సహకారంతో ప్రముఖ వ్యాపారవేత్త వర్మని తన హోటల్ గదిలో బాగా తాగించి, ఆయన జేబుల్లోంచీ ముప్పైరెండు వేల రూపాయలు కాజేశాడు. దాన్ని నిరూపించడానికే ఈ ట్రయల్ జరుగుతోంది. శివరామ్ని బోను ఎక్క మంటున్నా," అన్నాడు. జడ్జి తల పంకించాడు.

శివరామ్ ఠీవిగా నడిచి బోనులో నిలబడి ప్రమాణంచేసి కోర్టుని కలయజూశాడు. కోర్టు కిక్కిరిసివుంది. ముందు వరసలో కూచున్న లత ఆత్రంగా చూస్తోంది. ప్రాసి క్యూటర్ కుర్చీకి దగ్గరగా, కొత్తసూటులో హుందాగా కూచుని తనవేపు రెప్పవేయకుండా చూస్తున్నాడు వర్మ. శివరామ్ తన చూపుల్ని ప్రాసిక్యూటర్వైపు మళ్ళించి, నవ్వుతూ చూశాడు. దార్క్ కలర్ సూట్లోవున్న శివ రామ్ని ప్రాసిక్యూటర్ క్షణకాలం చూశాడు.

"మిస్టర్ శివరామ్, మీరూ మీ చెల్లెలు మిస్ లతా హోటర్ డిస్కోలాండ్ రూమ్ నంబర్ 414 లో వుంటు న్నారు...." ప్రాసిక్యూటర్ ఆగి ప్రశ్నార్థకంగా చూశాడు.

"మిస్ లతకాదు; మిసెస్ లత. ఆమె నా చెల్లెలుకాదు; భార్య!" శివరామ్ నవ్వుతూ జవాబిచ్చాడు.

వేదాంతరావు తీక్షణంగా దళసరి కళ్ళద్దాల్లోంచీ చూశాడు. "ఆమె మీ చెల్లెలని మీరు మిస్టర్ వర్మకి చెప్పారు అవునా?"

"భార్యని చెల్లెలుగా ఇతర్లకి పరిచయంచేసే పాడుపని లోకంలో ఏ మగవాడూ చేయడు!" శివరామ్ చిరునవ్వుతో

జవాబిచ్చాడు.

"కానీ మీరు చేశారు! అవునా?" వేదాంతరావు గద్దించినట్టు అడిగాడు.

"లేదు!"

"అబద్ధాలాడననీ, పూర్తిగా నిజమే చెప్తాననీ మీరు ప్రమాణంచేశారు. నిజం చెప్పండి!" వేదాంతరావు గంభీరంగా అన్నాడు.

శివరామ్ చిరునవ్వుతో చూశాడు. "ప్రమాణం చేయకపోయినా నేను నిజమే చెప్తాను!"

"అది త్వరలో తేలుతుంది. ఆల్ రైట్. మిస్ లత...."

"మిసెస్ లత!" శివరామ్ అడ్డొస్తూ సరిదిద్దాడు.

వేదాంతరావు గుడ్లురుముతూ చూశాడు. "ఆల్ రైట్.... లత మిమ్మల్ని తన అన్నయ్యగా వర్మగారికి పంచయం చేసింది. అవునా?"

"భర్తను అన్నయ్యగా ఇతర్లకి పరిచయంచేసే పాడు పని లోకంలో ఏ ఆడదీ చేయదు!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"కానీ....లత చేసింది! చేసిందా, లేదా?"

"లేదు!"

వేదాంతరావు విసుగ్గా చూశాడు. జడ్జి శివలింగం జరిగే నాటకాన్ని ఓపిగ్గా గమనిస్తున్నాడు. వేదాంతరావు ప్రారంభించాడు:

"మిస్టర్ శివరామ్, హోటల్ డిస్కోలాండ్ బార్ రూమ్‌లో మీ రిద్దరూ వర్మగారిచేత బాగా విస్కీ తాగించారు. అవునా?"

"మేం అతనికి పార్టీ ఇవ్వలేదు. మేం తాగించడానికి అతను పసిపాపకాడు, పశువూకాడు. తనే తాగాడు."

కోర్టులో నవ్వులు వ్యాపించాయి. 'ఆర్డర్, ఆర్డర్!' అంటూ జడ్జి శివలింగం బల్లమీద కొట్టిన సుత్తిదెబ్బ నవ్వుల్ని నిశ్శబ్దంలో ముంచేసింది.

"ఆయన్ని తాగమని మీరు ప్రోత్సహించలేదా?" వేదాంతరావు ప్రశ్నను మార్చి అడిగాడు.

"అతనితో మాకు పూర్వపరిచయంలేదు. పీపాలకొద్దీ అతను తాగితే మాకు వొరిగేదేమీలేదు!"

"అవును, లేదా-లేదు అని సమాధానం చెప్పండి!" వేదాంతరావు గద్దించాడు.

"లేదు!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"ఆ తరవాత మీరూ మిస్....మిసెస్....మీ రిద్దరూ వర్మగారిని మీ గదికి తీసుకెళ్లారా?"

"అతను వస్తానన్నాడు. మేం వద్దనలేదు."

"అరగంట పరిచయం మాత్రమే వున్న వ్యక్తిని మీ గదికి తీసుకెళ్లాల్సిన అవసరం?"

"తనకి డాన్సు బోర్‌కొడ్తోందనీ, లతతో, నాతో కులాసాగా కబుర్లు చెప్తూ కాసేపు గడపాలని వుందనీ అతను అన్నాడు. ఇలాంటి పరిచయాలే స్నేహంగా మారుతాయి. అతని చిన్నకోరికను కాదనడానికి నా సంస్కారం అడ్డొచ్చింది."

ప్రాసిక్యూటర్ క్షణకాలం ఆలోచిస్తూ శివరామ్‌నే చూస్తూ వుండిపోయాడు.

"గదిలో వర్మగారిచేత విపరీతంగా తాగించారు. లత సెక్సీగా డ్రెస్ చేసుకుని తన అందాన్ని ప్రదర్శిస్తూ ఆయన మతి పోగొట్టింది. మీ రిద్దరూ ఆయన కోటూ షర్టూ విప్పేలా చేశారు. ఆమె వర్మగారి భుజాలమీద చేతులు వేసి మంచంమీద వెల్లకిలా పడేలా తోసింది.

మత్తు పానీయం ప్రభావానికి ఆయన్ని లోనయ్యేలా చేసి మీరు ఆయన జేబుల్లోంచీ నోట్లకట్టల్ని కాజేసి, నిలువు దోపిడి చేశారు అవునా!"

శివరామ్ ప్రాసిక్యూటర్ని నవ్వుతూ చూశాడు. "వివరంగా చెప్పమంటారా, అవును లేదా లేదు అని సమాధానం చెప్పమంటారా?"

ప్రేక్షకుల్లోంచీ నవ్వులు వినిపించాయి.

"ఆన్సర్ యస్ ఆర్ నో!...." ప్రాసిక్యూటర్ కసిరాడు.

"నో!"

వేదాంతరావు శివరామ్ కళ్ళల్లోకి తీక్షణంగా బెదిరిస్తున్నట్టు చూశాడు. "మిస్టర్ శివరామ్, మీ నేరానికీ చట్టానికీ మధ్య అబద్ధాలతో గోడకట్టి, దాని చాటులో తప్పించుకోవాలని చూస్తున్నారు...."

"నిజాన్ని అడ్డుగోడగా మీరు భావిస్తే ఎవ్వరూ ఏమీ చేయలేరు!" శివరామ్ అడ్డొస్తూ అన్నాడు.

"మిస్టర్ ప్రాసిక్యూటర్, ప్రొసీడ్ విత్ది కేస్!" జడ్జి శివలింగం మెల్లిగా హెచ్చరించాడు.

ప్రాసిక్యూటర్ అలాగే అన్నట్టు తలవాల్చి, తలెత్తి శివరామ్వైపు చూశాడు. అతన్ని బోను దిగమన్నాడు.

"మిస్టర్ జస్టిస్, ప్రాసిక్యూషన్ తరఫున సాక్షి తథాగతరావుని పిలవడానికి అనుమతి కోరుతున్నా" అన్నాడు వేదాంతరావు.

"ప్రొసీడ్!" జడ్జి శివలింగం క్లుప్తంగా అన్నాడు. నల్ల పాంటూ, తెల్లజుబ్బా వేసుకున్న తథాగతరావు బోనెక్కాడు. కోర్టు గుమాస్తా అతనిచేత ప్రమాణం చేయించాడు. ప్రాసిక్యూటర్ అతన్ని చిరునవ్వుతో చూశాడు.

"తధాగతరావూ, నీ ఉద్యోగం!" ప్రశ్నించాడు.

"హోటల్ డ్రీమ్‌లాండ్ బార్ రూమ్‌లో బేరర్‌గా పని చేస్తున్నానండి" తధాగతరావు వినయంగా జవాబిచ్చాడు.

"ఈ నెల నాలుగో తారీఖున నువ్వు డ్యూటీలో వున్నావా?"

"ఉన్నానండి."

"అదిగో, అక్కడ కూచున్న పెద్దమనిషి—వర్మ గారు—నీకు తెలుసా?"

"తెలుసండి. ఆయన తరచుగా మా బార్‌రూమ్‌కి వస్తూంటారు...."

"ఆయన్ని నువ్వు అటెండ్ చేశావా?"

"రాగానే ఆయనకి టేబుల్ చూపించి, డ్రింక్స్ సప్లై చేశాను."

"ఆ రాత్రి ఆయన టేబుల్ దగ్గర జరిగిందేమిటో నీకు తెలుసా?" వేదాంతరావు ప్రశ్నించాడు.

"తెలుసు. మా హోటల్లో పనచేసిన లతమ్మగారు ఆయన దగ్గరకెళ్ళి పలకరించి కూచున్నారు. కాసేపట్లో శివరామ్‌గారు వాళ్ళతో చేరారు...."

"ఆ సమయంలో ఆమె ఎలాంటి దుస్తులు ధరించింది?" ప్రాసిక్యూటర్ అడ్డొస్తూ ప్రశ్నించాడు.

"మినీ స్కర్టూ, బ్లౌజూ వేసుకున్నారండి...."

"ఆమె శివరామ్‌ని తన అన్నగా వర్మగారికి పరిచయం చేసిందా?"

తధాగతరావు తటపటాయించాడు. "....శివరామ్‌గారు వచ్చినప్పుడు నేను వాళ్ళకి కొంచెం దూరంలో వున్నానండి. నాకు వినిపించలేదు."

"ఆల్ రైట్: తరవాత ఏం జరిగింది?"

"శివరామ్‌గారికోసం వర్మగారు బీర్ ఆర్డరిచ్చారు. లత గారు నవ్వుతూ, చీటికీ-మాటికీ టేబుల్‌పైకి వొంగుతూ వర్మగారి గ్లాసులో విస్కీ పోస్తూ తాగమని హెచ్చరిస్తున్నారండి. ఒకసారి ఆయన సోడా కలుపుకోబోతే పాలలో నీళ్ళు కలిపినట్టు విస్కీలో సోడా కలప కూడదన్నారండి."

"ఆ తరవాత ఏం జరిగింది?"

"వర్మగారు మరో బాటిల్ విస్కీ ఆర్డరిచ్చారండి. పట్టుకొస్తూ వాళ్ళని సమీపించినప్పుడు శివరామ్‌గారు 'లెటస్ గో టూ అవర్ రూమ్,' అంటున్నారండి...."

"తరవాతేం జరిగింది?"

"వర్మగారు బిల్లు పట్రమ్మన్నారండి! పట్టుకొచ్చాక ఆయన బిల్లు చెల్లించారండి...."

"ఒక్క క్షణం....ఒక్క క్షణం....వర్మగారు వెంటనే పర్సులోంచీ పైకం తీసి యిచ్చారా?" వేదాంతరావు ప్రశ్నించాడు.

"లేదండి, మూడుసార్లు ఆయన జేబుల్లోంచీ మూడు వందరూపాయల నోట్ల కట్టలు బైటికి తీశారండి. మళ్ళా జేబులు వెతకసాగేరు. చివరికి పాంటు బాక్‌పోకెట్‌లోంచీ పర్సుని లాగి అందులోంచీ డబ్బు తీసి నాకు అందించారు. నోట్లకట్టల్ని జేబులో పడేసుకున్నారు."

ప్రాస్యిక్యూటర్ వేదాంతరావు చిరునవ్వుతో తథాగత రావుని చూశాడు. "తథాగతరావూ, మీ హోటల్లో నువ్వు తరచుగా వందరూపాయల నోట్లకట్టల్ని చూసివుంటావు. వర్మగారు టేబుల్‌మీద పెట్టిన కట్టల్లో ఒక్కదానిలో ఎంత మొత్తం వుంటుందో చెప్పగలవా?"

"ఖచ్చితంగా చెప్పలేనండి. సాధారణంగా ఆ సైజు కట్టల్లో వంద నోట్లు అంటే పదివేల రూపాయలు వుంటాయండి" తథాగతరావు జవాబిచ్చాడు.

"అంతే!" అన్నాడు ప్రాసిక్యూటర్. శివరామ్‌వైపు అదోలా చూశాడు. "మిస్టర్ శివరామ్, యూ మే క్రాస్ ఎగ్జామిన్ ది విట్నెస్" అన్నాడు.

శివరామ్ ముందుకి నడిచి తథాగతరావుని చిరునవ్వుతో చూశాడు. "మిస్టర్ తథాగతరావ్, నాలుగో తారీఖుకి ముందు నన్నూ, నా భార్యనూ బార్‌రూమ్‌లో మీరు ఎప్పుడేనా చూశారా?"

శివరామ్ తనని బహువచనంతో మన్నించినందుకు తథాగతరావు ఆనందిస్తున్నాడని అతని మొహం చెప్తోంది.

"మూడు నాలుగుసార్లు చూశాను సార్" తథాగతరావు గౌరవంగా అన్నాడు.

"రెండో తారీఖు రాత్రి నా భార్య ఏ విధంగా డ్రెస్ చేసుకుందో చెప్పగలరా?"

తథాగతరావు అనుమానంగా చూశాడు. "....గుర్తు లేదు సార్."

"ఒకటో తారీఖు?"

"అదీ గుర్తులేదు సార్."

"పోనీ ఎప్పుడో ఒకసారి నా భార్య స్కర్టూ బ్లౌజూ వేసుకుని నాతోబాటు బార్‌రూమ్‌కి వచ్చింది. అది గుర్తుందా" శివరామ్ మెల్లిగా ప్రశ్నించాడు.

తథాగతరావు తల పంకించాడు. "ఎప్పుడో గుర్తు లేదుగానీ ఒకసారి లతమ్మగారు ఆ డ్రెస్సులో వచ్చారు సార్."

"థాంక్యూ అంటే నాలుగో తారీఖుకి ముందు కూడా నా భార్యని స్కర్టూ బ్లౌజుతో బార్ రూమ్‌లో మీరు చూశారు. అవునా? శివరామ్ చిరునవ్వుతో ప్రశ్నించాడు.

"చూశాను సార్."

"అంతే!" అంటూ శివరామ్ వెనక్కి తిరిగాడు. జడ్జి శివలింగం మొహమ్మీద క్షణకాలం మెరిసి మాయమైన చిరునవ్వుని అతను గుర్తించాడు.

ప్రాసిక్యూషన్ తరఫు రెండో సాక్షి కాసేపట్లో బోనెక్కి ప్రమాణం చేశాడు. ప్రాసిక్యూటర్ వేదాంత రావు సాక్షిముందు నిలబడ్డాడు.

"రమేష్, నీ ఉద్యోగం?"

"హోటల్ డిస్కోలాండ్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాను సార్" బెల్‌బాటమ్ పాంటూ, శ్లాకూ వేసుకున్న యువకుడు రమేష్ జవాబిచ్చాడు.

"మీ హోటల్లో 414 నంబరు గదిలో బస చేస్తూన్న శివరామ్, లతలు నీకు తెలుసా?" వేదాంతరావు ప్రశ్నించాడు.

"తెలుసు సార్. వాళ్ళ గదికి అయిదారు రోజులు నేనే అన్నీ సప్లై చేశాను."

"నాల్గో తారీఖు రాత్రి వాళ్ళ గదికి ఏదేనా ఆర్డరు పట్టుకెళ్ళావా?"

"మూడు ప్లేట్లు చపాతీకుర్మా, చిప్స్, జీడిపప్పు పట్టుకెళ్ళాను సార్."

"ఆ సమయంలో గదిలో ఎవరెవరున్నారు?"

"శివరామ్‌గారూ, లతమ్మగారూ, వర్మగారూ వున్నారండి...."

"రమేష్, వర్మగారు నీకు తెలుసా?" వేదాంతరావు

అడ్డొస్తూ ప్రశ్నించాడు.

"అదిగో అక్కడ కూచున్న ఆయనే సార్" అంటూ రమేష్ వర్మవైపు చెయ్యి చూపించాడు.

"రైట్! ఆ సమయంలో వాళ్ళు ఏం చేస్తున్నారు?"

"వర్మగారు విస్కీ తాగుతున్నారు సార్. శివరామ్ గారు ఎదురుగా కుర్చీలో కూర్చున్నారు. లతమ్మగారు మంచంమీద వర్మగారి పక్కనే కూచున్నారు...."

"రమేష్, అప్పుడు ఆమె—లత—ఎలాంటి దుస్తులు ధరించింది?" వేదాంతరావు ప్రశ్నించాడు.

రమేష్ కొంచెం ఇబ్బందిగా కదిలాడు. అతని మొహం కొద్దిగా ఎర్రబడింది. "ఆమె....ఆమె....పల్చటి నైట్‌గౌన్ వేసుకున్నారండి....నేను....తల వాల్చుకుని నిలబడ్డానండి."

"తరవాత ఏం జరిగింది?"

"నేను తిరిగి వెళ్ళబోతూంటే వర్మగారు ఆగమన్నట్టు చేత్తో సైగ చేశారండి. కోటు జేబుల్లోంచీ వందరూపాయల నోట్లకట్ట బైటికి తీశారండి. ఎందుకా అని నేను అనుకున్నానండి. మళ్ళీ జేబులు వెతికి పర్సుతీసి అందులోంచీ ఐదురూపాయల నోటు లాగి నాకు టిప్ ఇచ్చారండి...."

"రమేష్, వర్మగారు ఎన్ని నోట్లకట్టలు తీశారో నువ్వు చూశావా?"

"మూడు కట్టలండి."

"మీరు సాక్షిని ప్రశ్నించవచ్చు!" అన్నాడు ప్రాసిక్యూటర్ శివరామ్‌వైపు చూస్తూ.

"ప్రశ్నలేమీ లేవు!" శివరామ్ క్లుప్తంగా అన్నాడు. రమేష్ దిగిపోయాడు.

"వర్మగారిని బోను ఎక్కమని కోరుతున్నా" వేదాంత రావు గంభీరంగా అన్నాడు.

ఖరీదైన సూటులో డాబుసరిగా వున్న వర్మ హుందాగా సింహంలా నడుస్తూ బోనులోకి ఎక్కాడు. ప్రమాణం చేశాడు. నాలుగో తారీఖు రాత్రి డిస్కోలాండ్ బార్ రూమ్‌కి అతను వెళ్ళిన దగ్గర్నుంచీ, జరిగినదంతా ప్రశ్న లకు సమాధానాల రూపంలో వివరంగా చెప్పించాడు ప్రాసిక్యూటర్ అతనిచేత.

"మిస్టర్ వర్మా, సర్వర్ మీకు కావాల్సినవి సప్లై చేసి వెళ్ళాక శివరామ్ గదిలో ఏం జరిగింది?" వేదాంతరావు ప్రశ్నించాడు:

"దేవతావస్త్రం కట్టుకుని వొళ్ళంతా కనిపించేలా తయారైన లత నా దగ్గర కూచుని...."

"అబ్జెక్షన్ మిస్టర్ జస్టిస్!" శివరామ్ తటాలున లేచి, అన్నాడు. "సాక్షి సమాధానాన్ని కోర్టు రికార్డ్ నుంచీ తొలగించాలని కోరుతున్నా...."

"రికార్డు నుంచీ తొలగించాల్సినంత తప్పుడు సమాధానం ఇక్కడ చెప్పబడలేదు, మిస్టర్ జస్టిస్!" ప్రాసిక్యూటర్ వేదాంతరావు కల్పించుకున్నాడు.

"పరంపరగా వస్తున్న కథ ప్రకారం 'దేవతావస్త్రాలు ధరించి' అంటే దిగంబరంగా వుంటూ అని అర్థం. సాక్షి సమాధానం నా భార్య విషయంలో డామేజింగ్‌గా వుంది" శివరామ్ వివరించాడు.

జడ్జి శివలింగం అర్థమైనట్టు తల ఆడించాడు. "ఆక్షేపణ స్వీకరించబడింది. ఆ సమాధానం రికార్డుల నుంచీ తొలగించబడుతుంది. మిస్టర్ వర్మా, సక్రమంగా సమాధానం చెప్పండి!" అన్నాడు సీరియస్‌గా.

వర్మ శివరామ్‌వైపు రౌద్రంగా చూస్తున్నాడు.

"మిస్టర్ వర్మా, సమాధానం చెప్పండి" వేదాంతరావు హెచ్చరించాడు. తన్నుకొస్తున్న కోపాన్ని దిగమింగి వర్మ మళ్ళీ ప్రారంభించాడు:

"సెక్సీగా కనిపించేలా పల్చటి నైట్‌గౌన్ ధరించి లత నా పక్కన చేరి, గ్లాసులోకి విస్కీ పోస్తూ బలవంతంగా నాచేత తాగించింది. ఉక్కగా వుంది, కోటు విప్పేయమని శివరామ్ సలహా యిచ్చాడు. లత కల్పించుకుని, కోటూ, షర్టూ రెండూ విప్పేలా చేసింది. వాట్ని శివరామ్‌కి అందించింది. అతను హాంగర్స్‌కి తగిలించి తిరిగొచ్చాడు.

కోటూ షర్టూ వేసుకుని వెళ్ళిపోవాలనిపించింది. లేవబోయాను. ఆ పిల్ల నన్ను మంచంమీదికి వెల్లకిలా తోసేసింది. నా తల కొద్దిగా వెనక్కి వాలింది. అప్పుడు చూశాను. ఆమె తోడుదొంగ—శివరామ్—నిర్భయంగా నా కోటు జేబుల్లోంచీ నోట్ల కట్టలూ, పర్సులోంచీ నోట్లూ కొట్టేసి తన జేబుల్లో కుక్కుకుంటున్నాడు!"

"ఆ తరువాత?"

"నా డబ్బు తియ్యొద్దని అరిచాను. ఆ వగలాడి నా తలవైపున నిలబడింది. నా మొహంలోకి నవ్వుతూ తొంగి చూసి, తన శరీరం నా ముఖానికి రాసుకునేలా బాగా కిందికి వంగి, మంచంమీద నిలువుగా నన్ను దొర్లించి, హాయిగా నిద్రపొమ్మంది...."

"ఆ తరువాత?"

"నాకు నిద్రపట్టేసింది...."

కోర్టుహాల్లో నవ్వులు మారుమోగాయి. జడ్జి శివలింగం నవ్వుని ఆపుకుంటూ, సుత్తితో నిశ్శబ్దాన్ని సృష్టించాడు.

తన మొహంమీద నవ్వు కనిపించకుండా వుండటానికి విశ్వప్రయత్నం చేస్తూ వేదాంతరావు ప్రశ్నించాడు:

"తరువాత?"

వర్మ కోపాన్ని అదుపులో పెట్టుకుని అతనివైపు చూశాడు. "నాకు మెలకువ వచ్చేసరికి ముందుగదిలో సోఫాలోవున్నాను. నా కోటూ, షర్టూ నామీదేపడున్నాయి. వాటిని తొడుక్కున్నాను. తలుపు తెరుచుకుని బైటపడి, మెట్లు దిగి రోడ్డు చేరుకున్నాను. టాక్సీ ఎక్కి తిన్నగా ఇంటి కెళ్ళిపోయాను. అలసటతో నిద్రపోయాను.

"పొద్దుటే నిద్రలేచి డబ్బు బాంక్‌లో వేద్దామనుకుని జేబుల్లో చూశాను. డబ్బులేదు! వెంటనే రాత్రి జరిగిందంతా నాకు గుర్తొచ్చింది. వెంటనే రంగంలోకి దూకాను. నన్ను నిలువుదోపిడి చేసిన దుర్మార్గులకి బాగా బుద్ధి చెప్పాలనుకున్నాను. పోలీస్ రిపోర్ట్ యిచ్చాను," వర్మ ఆవేశంతో ముగించాడు.

"థాంక్యూ మిస్టర్ వర్మా," అంటూ ప్రాసిక్యూటర్ జడ్జివైపు తిరిగాడు.

"మిస్టర్ జస్టిస్, వర్మగారు హోటల్ డిస్కోలాండ్‌కి వెళ్ళినప్పుడూ, ముద్దాయి గదిలో వున్నప్పుడూ ఆయనవద్ద వందరూపాయలనోట్ల కట్టలరూపంలో ముప్ఫైవేల రూపాయలూ, పర్సులో మరో రెండువేల దాకా వున్నట్టు సాక్ష్యాల మూలంగా నిర్ధారించబడింది. మత్తుపానీయాల ప్రభావానికి ఆయన్ని లోనుచేసి నిందితుడు శివరామ్, ఆయన నిస్సహాయస్థితిలో వున్నప్పుడు జేబుల్లోంచీ డబ్బు తీసేసుకున్నాడని వర్మగారి వాఙ్మూలం ద్వారా నిరూపించబడింది. ఇదీ ప్రాసిక్యూషన్ కేసు," అంటూ ముగించాడు.

"యూ మే క్రాస్ ఎగ్జామిన్," అన్నాడు శివరామ్‌తో.

శివరామ్ పైకిలేచాడు. మెల్లిగా, ఠీవిగా వర్మ ముందుకి నడిచాడు. వర్మ అతన్ని ఆగ్రహంతో సవాలు చేస్తున్నట్టు చూస్తున్నాడు. శివరామ్ అతన్ని చిరునవ్వుతో చూశాడు.

"మిస్టర్ వర్మా, నాయిగో తారీఖున మీ వద్ద డబ్బెంత వుంది?"

"ఎంతుందో నా కంటే నీకే బాగా తెలుసు! పర్సులో చిన్ననోట్లు మాత్రం వదిలేసి వందనోట్లన్నీ కొట్టేశావ్!" వర్మ రోషంతో గర్జించాడు.

నవ్వులు. జడ్జి శివలింగం సుత్తితోకొట్టి 'ఆర్డర్, ఆర్డర్!' అన్నాడు. శివరామ్ జడ్జివైపు నవ్వుతూ చూశాడు.

"ప్రశ్నకు తిన్నగా జవాబు చెప్పమని సాక్షిని హెచ్చరిస్తున్నా" జడ్జి ఉత్తరువిచ్చాడు.

వర్మ కళ్ళు చిట్లిస్తూ శివరామ్‌ని చూశాడు. "ముప్పై రెండువేలపైనే వుండాలి...."

"పైనే అంటే ముప్పైమూడు వేలు వుండొచ్చా?"

"ఉండొచ్చు."

"ముప్పైనాలుగు వేలు వుండొచ్చా?"

"ఉండొచ్చు."

"ముప్పైఅయిదు, ముప్పైఆరు....నలభై....యాభై వేలు వుండొచ్చా?" శివరామ్ నవ్వుతూ ప్రశ్నించాడు.

వర్మ గుడ్లురిమాడు. "అంతలేదు...."

"ఎంతవుంది?" శివరామ్ దబాయించినట్టు అడిగాడు.

"ఎంతుందో ఖచ్చితంగా చెప్పలేను. ముప్పైరెండూ ముప్పైనాలుగు వేల మధ్య వుండివుండాలి...." వర్మ సందేహిస్తూ అన్నాడు.

"ఉండి వుండాలంటున్నారు. మీ దగ్గర డబ్బెంత వుందో మీకు ఎందుకు తెలీదు?"

"పిసినారిలా నేను చీటికీ మాటికీ లెక్కేంటూ కూచోను. నా చేతులమీద రోజూ వేలు తిరుగుతూ వుంటాయి!" వర్మ నిర్లక్ష్యంగా, సగర్వంగా అన్నాడు.

శివరామ్ చిన్నగా నవ్వాడు. "మీవద్ద ఎంతుందో తెలీ నప్పుడు ముప్పైరెండువేలు పోయినట్టు ఖచ్చితంగా ఎలా రిపోర్టిచ్చారు?"

"ఆ రోజు ముప్పైరెండు వేలు ఒకే మొత్తంగా నా చేతికి వచ్చింది. పర్సులో వేరే పైకం వుంది. అదిపోతే పోయిందనుకుని పెద్ద మొత్తం ముప్పైరెండు వేలు లెక్కలోకి తీసుకున్నా," వర్మ చిరాకుగా అన్నాడు.

"ఐసీ....మిస్టర్ వర్మా, ఆ ముప్పైరెండువేలూ మీకెలా వచ్చింది?" శివరామ్ ప్రశ్నించాడు.

వర్మ ఆగ్రహంతో చూశాడు. "ఎలా వస్తే నీకేం? నేను వ్యాపారస్థుడిని. ఎన్నో విధాలుగా డబ్బు నా చేతికి వస్తుంది. ఆ వివరాలన్నీ నీతో చెప్పాల్సిన అవసరం లేదు!"

శివరామ్ చిరునవ్వుతో చూశాడు. "గుర్రప్పందాల్లో ఆ డబ్బు మీకు వచ్చింది. అవునా?"

"వస్తే వచ్చింది. తప్పా?" వర్మ హుంకరించాడు.

"తప్పు అన్న భావం మీలో లేకపోతే అప్పుడేఎందుకు చెప్పలేదు?" శివరామ్ అతన్ని సూటిగా చూస్తూ ప్రశ్నిం చాడు.

"నా యిష్టం. అయినా దానికీ, దీనికీ సంబంధంలేదు."

"మీరు పోయిందనుకుంటున్న పైకం గుర్రప్పందాల్లో వచ్చింది కాదా?" శివరామ్ నవ్వుతూ అడిగాడు.

"అయివుండొచ్చు...." వర్మ బుసలుకొట్టాడు.

"మిస్టర్ వర్మా, నాలుగో తారీఖున డిస్కోలాండ్

బార్ రూమ్‌కి వెళ్ళేముందు మీరు ఎంత విస్కీ సేవించారు?”
శివరామ్ తటాలున విషయం మార్చి ప్రశ్నించాడు.

వర్మ ఇబ్బందిగా కదిలాడు.

“జవాబు చెప్పండి!” శివరామ్ కమ్చీతో కొట్టినట్టు అన్నాడు.

“నేను....డ్రింక్స్ ఏమీ....తీసుకోలేదు....” వర్మ మెల్లిగా అన్నాడు.

“మీరు వోత్ తీసుకున్నారు. మిస్టర్ వర్మా, దాచకుండా నిజం చెప్పండి!”

“నీలాంటి దొంగలతో అబద్ధాలాడాల్సిన ఖర్మ నాకు పట్టలేదు!” వర్మ కోపంగా అరిచాడు.

శివరామ్ అతన్ని తీక్షణంగా చూశాడు. “రేస్ కోర్స్ నుంచీ తిరిగొస్తూ, దార్లో ‘వైల్డ్‌హార్స్‌బార్’లో మీరు విస్కీ తాగారా లేదా?”

వర్మ ఉలిక్కిపడ్డాడు. వెంటనే సర్దుకుని శివరామ్‌ని అదోలా చూశాడు. “వైల్డ్‌హార్సా? అదెక్కడుంది?”

శివరామ్ అతన్ని కళ్ళల్లోకి చూశాడు. కుడిచేతిని పైకెత్తి చూపుడువేలిని కత్తిలా అతనివైపు గురిపెట్టాడు. “వైల్డ్ హార్స్‌బార్ ఎక్కడుందో, అక్కడ మీరు ఏ బ్రాండ్ విస్కీ ఎంత తీసుకున్నారో, టిప్ ఎంత ఇచ్చారో బార్ బేరర్ నోటమ్మట ఇప్పుడే, ఇక్కడే స్వయంగా వింటారా?” అంటూ శివరామ్ చేతిని డ్రమెటిక్‌గా ప్రేక్షకుల వైపు తిప్పాడు.

వర్మ అతన్ని మింగేసేలా చూశాడు. “ఆల్‌రైట్! తాగాను. నువ్వనే దేమిటి?”

శివరామ్ మొహంమీద చిరునవ్వు మెరిసింది. “మీరు అనవసరంగా అబద్ధాలాడతారనీ, సాధారణంగా నిజం

చెప్పరనీ మీ ప్రస్తుత ప్రవర్తన రుజువు చేస్తోందంటాను! మిస్టర్ వర్మా, 'వైల్డ్‌హార్స్'లో ఎంత విస్కీ తాగారు?"

ప్రాసిక్యూటర్ కుర్చీకింద టపాకాయ పేలినట్టుగంతేసి నిల్చున్నాడు. "అబ్జెక్షన్! మిస్టర్ జస్టిస్, ఈ ప్రశ్న అసందర్భంగా, అసంబద్ధంగా వుంది!"

"మిస్టర్ జస్టిస్, డిస్కో-లాండ్ బార్‌రూమ్ చేరేసరికే వర్మ బాగా తాగివున్నాడన్న యథార్థాన్ని రుజువుచేసేందుకు ఈ ప్రశ్న అడగబడింది," శివరామ్ వివరించాడు.

"అబ్జెక్షన్ త్రోసివేయబడింది. జవాబు చెప్పండి," జడ్జి శివలింగం ఆర్డరిచ్చాడు.

వర్మ అసహనంగా అటూ ఇటూ కదిలాడు. దీనంగా ప్రాసిక్యూటర్ని చూశాడు. "నాకు....గుర్తు....లేదు...."

శివరామ్ నవ్వాడు. "నేను గుర్తుచేయ గలనేమో ప్రయత్నిస్తాను. రెండు ఫుల్ బాటిల్స్ తాగారా?"

వర్మ ఎర్రగా చూశాడు. "లేదు!"

"ఒకటి?"

"లేదు!"

"హాఫ్ బాటిల్?"

వర్మ నిస్సహాయంగా చూశాడు. "హాఫ్‌బాటిల్ తెప్పించుకున్నట్టు గుర్తొస్తోంది...."

"ఆల్‌రైట్....ఎంత తాగారు?"

"గుర్తులేదు!" వర్మ విసుక్కున్నాడు.

"బేరర్ని పిలిపించి గుర్తు చేయించమంటారా?" శివరామ్ ప్రశ్నించాడు.

"ఆల్‌రైట్, హాఫ్‌బాటిల్ తాగాను!"

"డిస్కో-లాండ్ బార్‌రూమ్‌లో లత రాకముందు ఎంత తాగారు?"

"ఫుల్‌బాటిల్ ఆర్డరిచ్చాను. తాగుతూ కూచున్నాను. ఎంత తాగానో కొలిచి చూసుకోలేదు!" ప్రశ్నల్తో విసిగి పోయిన వర్మ నిర్లక్ష్యంగా, కోపంగా జవాబిచ్చాడు.

శివరామ్ చిరునవ్వు నవ్వాడు. "లత మీ టేబుల్‌దగ్గరికి చేరేసరికి మీరు సగం పైగా బాటిల్ని ఖాళీ చేశారని నేనంటే మీరేమంటారు?"

"ఏమీ అనను!" వర్మ గర్జించాడు.

నవ్వులు అలలుగా ధ్వనించాయి. జడ్జి శివలింగం సుత్తితో చరిచాడు.

"లత మీచేత బలవంతంగా విస్కీ తాగించిందన్నారు. ఆమె బలవంతం చెయ్యకపోతే మిగిలిన విస్కీని వదిలేసే వారా?" శివరామ్ ప్రశ్నించాడు.

"వదిలేసే వాణ్ణే!" వర్మ జవాబిచ్చాడు.

"రెండోబాటిల్ విస్కీ ఎవరార్డరిచ్చారు? మీరా? లతా?"

"....నే....నే...." వర్మ మెల్లిగా అన్నాడు.

"ఆమె బలవంతం చేసివుండకపోతే మొదటి బాటిల్లోని విస్కీనే వదిలేసివుండే మీరు రెండోబాటిల్ ఎందుకు ఆర్డరిచ్చారు?" శివరామ్ సూటిగా ప్రశ్నించాడు.

వర్మ విగ్రహంలా మౌనంగా వుండిపోయాడు.

"మిస్టర్ వర్మా, లత బలవంతం చేసివుండకపోయినా మీ కోటా విస్కీని మీరు స్వీకరించి వుండేవారని వొప్పుకుంటారా?"

"మిస్టర్ జస్టిస్, వర్మగారిని—ఒక పారిశ్రామికవేత్త అయిన వర్మగారిని తాగుబోతుగా చిత్రించి అభాసు పాలు చేసే దురుద్దేశంతో ఈ క్రాస్ ఎగ్జామినేషన్ సాగుతోంది. నేను అ_క్ట్ చేస్తున్నా!" ప్రాసిక్యూటర్ వేదాంతరావు

అరుస్తూ లేచాడు.

శివరామ్ జడ్జివైపు తిరిగాడు. "నా భార్య లత వర్మను ప్రోత్సహించి, నటించి వాళ్ళు తెలీకుండా తాగించినట్టు ఆరోపించబడింది. మామూలుగా ధారాళంగా డ్రింక్స్ సేవించే అలవాటున్న వర్మ ఎవరి సహాయమూ అక్కర్లేకుండానే పీకలదాకా తాగగలడని నిరూపించే ప్రయత్నం చేస్తున్నా...."

"ఆక్షేపణని కొట్టిపేస్తున్నా. జవాబివ్వండి!" జడ్జి శివలింగం రూలింగ్ ఇచ్చాడు.

వర్మ పెదవులు కోపంతో అదురుతున్నాయి. "నేను తాగి వుండేవాణ్నో లేదో అది వేరే సంగతి. ఆమె నన్ను త్వరత్వరగా తాగేలా చేసింది. తాగకుండా వుండే ప్రయత్నం నన్ను చేయనివ్వలేదు!" అన్నాడు చాడీ చెప్తున్నట్టు.

శివరామ్ చిన్నగా నవ్వాడు. "ఇంక మేం బసచేసిన గదిలోకి వెళ్దాం. అక్కడ మీరు ఎంత విస్కీ సేవించారు?"

వర్మ ఉగ్రంగా చూశాడు. "మిస్టర్, నువ్విలా కాలతలు అడుగుతావని తెలిసివుంటే ఎక్కడెక్కడ ఎంతెంత తాగానో లెక్క రాసుకుని వుండేవాణ్ని!"

చాలామంది గొల్లున నవ్వేశారు. జడ్జి నిశ్శబ్దాన్ని యేర్పాటు చేశాక శివరామ్ ప్రశ్నించాడు. "మిస్టర్ వర్మా, ఆ గదిలోకి వెళ్ళేసరికే మీరు బాగా మత్తులో వున్నారు. మీరు అక్కడ ఎంత తాగారో, ఏం చూశారో, ఏం చేశారో మీకు గుర్తులేదు! అవునా?"

"ఎంత తాగానో గుర్తులేక పోవచ్చు. ఏం చూశానో, ఏం చేశానో బాగా గుర్తుంది!" వర్మ వెటకారంగా

అన్నాడు.

"ఐసీ....ఏం చేశారో, ఏం చూశారో చెప్పండి!" శివరామ్ ఛాలెంజ్ చేస్తున్నట్టు అన్నాడు.

"మీ ఇద్దరితో కబుర్లు చెప్తూకూచున్నా. వొళ్ళంతా అద్దంలోలా కనిపించేలా అతి పల్చటి గుడ్డని ధరించి ఆ కిలాడీ రాణి పిల్లిలా నా చుట్టూ పూసుకు తిరుగుతూంటే చూశాను. నువ్వు నా జేబుల్ని ఖాళీచేస్తూంటే చూశాను!" వర్మ కోపంగా, కసిగా అరిచాడు.

"ఐసీ. చేసిందీ, చూసిందీ అంత బాగా గుర్తున్నప్పుడు పర్సు ఏ జేబులో వుంచుకున్నారో ఎందుకు గుర్తులేక పోయింది?" శివరామ్ ప్రశ్నించాడు.

"ఎందుకు గుర్తులేకపోయింది?" వర్మ విసుగ్గా ఎదురు ప్రశ్న వేశాడు.

"గుర్తుంటే జేబులన్నీ గాలించి, నోట్లకట్టల్ని ప్రతి సారీ బైటపడేసి, వెతికి వెతికి పర్సుని వెలికి తీయాల్సిన అవసరం ఏమొచ్చింది?" శివరామ్ ప్రశ్న పిస్టల్ షాట్‌లా ధ్వనించింది.

వర్మ చెమటలు కక్కుతూ, ఉక్కిరిబిక్కిరవుతూ చూశాడు. అరచేత్తో రాగిచెంబులా వున్న బట్టతలమీది చెమటని తుడుచుకున్నాడు.

"జవాబు చెప్పండి!" శివరామ్ గుర్రాన్ని కమ్చీతో కొట్టి అదలించినట్టు హెచ్చరించాడు. వర్మ శివరామ్‌వైపు అర్థంకానట్టు చూశాడు. అతని పెదవులు కదుల్తున్నాయి కానీ, శబ్దం రావడంలేదు.

శివరామ్ అతని కళ్ళల్లోకి తదేకంగా చూశాడు. "మిస్టర్ వర్మా, గుర్రప్పందాల్లో తేరగా డబ్బొచ్చాక

మీరు ఉత్సాహంతో పండగ చేసుకోవాలనుకున్నారు. డిస్కోలాండ్ హోటల్‌కి వచ్చేసరికే జల్సాగా తాగారు. అక్కడ బెల్లీ డాన్సూ, స్ట్రిప్ డాన్సూ చూస్తూ మజా చేసుకోవాలనుకున్నారు. లతను చూసి, డాన్సర్‌ను మరిచి పోయి ఆమెని పిఱుజులా పట్టుకున్నారు. ఆమె భర్త అయిన నా ఎదుటే ఆమెను మరో హోటల్‌కి, క్లబ్బుకి రమ్మన్నారు. మా గదికి వచ్చి, పానకం తాగినట్టు విస్కీ తాగారు. నా భార్యతో ఒంటరిగా వుండాలని నన్ను డాన్స్‌కి వెళ్ళమని ప్రోత్సహించారు!" శివరామ్ క్షణ కాలం ఆగి, మళ్ళీ ప్రారంభించాడు.

"ఏం చేస్తున్నారో, ఏం మాట్లాడుతున్నారో తెలీని మరో లోకంలో మీరున్నారు. మీలో చనిపోయిన తన బాబాయి పోలికలున్నాయని నా భార్య అంతా సహించి, సభ్యతగా వూరుకుంది. మీవద్ద డబ్బెంతుందో మీకు తెలీదు. అది ఎప్పుడు, ఎక్కడ పోయిందో మీకు తెలీదు. తెల్లారాక, మత్తు మంచు విడిపోయాక జేబులు తడువుకుని, రాత్రి మీకు సానుభూతితో కంపెనీ ఇచ్చిన నన్ను అనుమానించారు. రాత్రి ఇంటికి చేరుకున్నాక, మీ తలమీదున్న నాలుగు వెంట్రుకలదాకా మత్తులో వున్న మీరు, మరెన్నో కట్టల బ్లాక్ మనీ వున్న ఇనపెట్టెలోకి ఆ మూడు కట్టల్నీ పారేసివున్నా నేను ఆశ్చర్యపోను!

"విస్కీ పూర్తిగా మిమ్మల్ని తన ఉప్పెనలో ముంచే ముందు మీముందున్న నన్ను, మత్తుదిగాక మొదటిసారిగా గుర్తుచేసుకుంది మీ మెదడు. నిరాధారంగా అమాయకు డైన నామీద రిపోర్టిచ్చి కేసు బనాయించారు! అవునా?" శివరామ్ గంభీరంగా ప్రశ్నించాడు.

"నిరాధారంగా కాదు. నువ్వు డబ్బు తీస్తూంటే ఈ

కళ్ళతో చూశాను!" వర్మ గర్జించాడు.

"ఈ కళ్ళతో కాదు; మత్తు పొరలు దట్టంగా కమ్మిన గాజు కళ్ళతో చూశారు. నిజం చెప్పాలంటే చూసినట్టు ఊహించుకున్నారు!"

"ఊహిస్తోంది నువ్వు. నేను సాక్షాత్తుగా చూశాను!" వర్మ మొండిగా, కోపంగా అన్నాడు.

"అలాగా! పొద్దుటే పోలీసులు మా గదిని శుభ్రంగా దువ్వేశారు. డబ్బు వాళ్ళకి దొరకలేదే!" శివరామ్ ఎగతాళిగా అన్నాడు.

"నువ్వు దేవాంతకుడివి. ఎక్కడో మాయంచేసి వుంటావు!" వర్మ పళ్ళు కొరికాడు.

శివరామ్ నవ్వుతూ జడ్జివైపు తిరిగాడు. "దట్సాల్, మిస్టర్ జస్టిస్!" అన్నాడు.

వర్మ తేలిగ్గా నిట్టూర్చి బోనులోంచి దిగబోయాడు. ప్రాసిక్యూటర్ వేదాంతరావు గబగబా అతని ముందుకు నడిచాడు. "మిస్టర్మ వర్మా, ఒక్క క్షణం!" అన్నాడు. వర్మ ఆగి, నీరసంగా చూశాడు.

"మిస్టర్ వర్మా, ఆ రాత్రి టాక్సీలో మీరు ఇంటికెళ్ళారు. ఇంట్లోకి వెళ్ళగానే ఏంచేశారో చెప్పగలరా?" వేదాంతరావు రీడైరెక్ట్ క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభించాడు.

"తిన్నగా నా బెడ్రూమ్‌లోకి వెళ్ళాను" వర్మ జవాబిచ్చాడు.

"మీ ఇంట్లో ఇనప్పెట్టె ఎక్కడుంది?"

"పూజగదిలో వుంది...." వర్మ జవాబిచ్చాడు.

"బెడ్రూమ్‌లోంచి మీరు పూజగదిలోకి వెళ్లారా?"

"లేదు. బాత్‌రూమ్‌కికూడా వెళ్ళలేదు. పడుకున్నాను."

"దట్సాల్. మీరు వెళ్ళొచ్చు!" అంటూ వేదాంతరావు జడ్జివైపు తిరిగాడు.

"మిస్టర్ జస్టిస్, హోటల్ బార్ రూమ్‌లో వున్నప్పుడు నోట్లకట్టలు వర్మగారి దగ్గరున్నాయి. ముద్దాయి గదిలో వున్నప్పుడూ పైకం ఆయనదగ్గరే వుంది. ముద్దాయి పైకం కాజేస్తూంటే ఆయన స్వయంగా చూశారు. పొద్దుటే ఆయన చూసుకోడం ద్వారా, ముద్దాయి గదిలోనే ఆ డబ్బు మాయమయిందని తేలుతోంది. వర్మగారికి న్యాయం కలిగించి, అపరాధిని తగువిధంగా శిక్షించమని కోరుతున్నా" అన్నాడు.

శివరామ్ జడ్జివైపు చూశాడు. "మిస్టర్ జస్టిస్, డిఫెన్స్ తరఫున ఒక సాక్షిని పిలవడానికి అనుమతి కోరుతున్నా" అన్నాడు.

"అనుమతించబడింది. కానివ్వండి" జడ్జి శివలింగం ఉత్తరువిచ్చాడు.

"రాజగోపాల్!" శివరామ్ పిలిచాడు. కాకీపాంటూ, షర్టూ వేసుకున్న లావుపాటి వ్యక్తి బోనెక్కాడు. కోర్టు గుమాస్తా అతనిచేత ప్రమాణం చేయించాడు.

"మిస్టర్ రాజగోపాల్, నీ వృత్తి ఏమిటి?" శివరామ్ ప్రశ్నించాడు. వర్మ రాజగోపాల్‌ని కళ్ళు చిట్లించి పరీక్షగా చూస్తున్నాడు.

"నేను టాక్సీ డ్రైవరునండి" అన్నాడతను.

"నీకు సొంత టాక్సీ వుందా?"

"లేదు. రాక్సీ టాక్సీ సర్వీస్ టాక్సీని నేను తోలుతూ వుంటాను."

"ఈ మాసం నాలుగో తేదీ రాత్రి నువ్వు డ్యూటీ చేశావా?" శివరామ్ ప్రశ్నించాడు.

"చేశానండి?"

"ఆ రాత్రి మూడు గంటల ప్రాంతంలో నువ్వెక్కడ తిరుగుతున్నావు?"

"రైల్వేస్టేషన్ నుండి ఒక గిరాకీని ఓల్డ్ టౌన్‌లో వదిలేసి వస్తున్నానండి. ఆ సమయంలో హోటల్ డిస్కోలాండ్ ముందు మెల్లిగా వెళ్తున్నా" రాజగోపాల్ జవాబిచ్చాడు.

"రాజగోపాల్, అంత ఖచ్చితంగా టైమ్ నీకెలా తెలుసు?"

"కంపెనీకి ఇవ్వడంకోసం లాగ్ బుక్ రాస్తూ వుంటాం. గిరాకీ ఎక్కిన ప్రాంతం, దిగిన ప్రాంతం, టైమూ, మీటర్ వగైరా వివరాలు క్రమంగా రాస్తాం" రాజగోపాల్ జవాబిచ్చాడు.

"ఆ లాగ్ బుక్ ప్రస్తుతం నీ దగ్గరుందా?"

"ఉందండి."

"నీ లాగ్ బుక్ ఒకసారి చూద్దాం...." అంటూ శివరామ్ చెయ్యి చాచాడు. రాజగోపాల్ పాంటు జేబులోంచీ సగానికి మడతపెట్టిన పుస్తకంతీసి అందించాడు. శివరామ్ తిరగేసి, ఒక ఎంట్రీచూసి, తలపంకిస్తూ పుస్తకాన్ని జడ్జికి అందించాడు. జడ్జి శివలింగం ఎంట్రీనిచూసి, తలపంకించి తిరిగి ఇచ్చేశాడు. శివరామ్ దాన్ని ప్రాసిక్యూటర్‌కి అందించి రాజగోపాల్ వైపు తిరిగాడు.

"వెరీగుడ్....రాజగోపాల్, ఆ హోటల్ దగ్గర నీకేదేనా గిరాకీ దొరికిందా?" శివరామ్ ప్రశ్నించాడు.

"హోటల్ ముందు సూటూ బూటూ వేసుకున్న ఒక వ్యక్తి—ఇంతసేపూ ఈ బోనులో నుంచున్నాయనండి. టాక్సీ ఆపమని సైగచేశారు. ఆపాను. ఆయన తూలుతూ

అడుగులేసి, తనే డోర్ తెరిచి ఎక్కారండి."

"తరవాత?"

"నేతాజీ రోడ్లో ఆయన చెప్పిన ఇంటిముందు ఆపానండి."

"ఆయన—పేరు మిస్టర్ వర్మ—మీటర్ డబ్బు చెల్లించిరా?"

"చెల్లించారండి."

"ఆ సమయంలో నీ దృష్టిని ఆకర్షించే సంఘటన ఏదేనా జరిగిందా?"

"జరిగిందండి. ఆయన కారు దిగి నావైపు డోర్ దగ్గర ఆగారు. మీటర్ చెప్పాను. ఆయన జేబులన్నీ తడువుతూ వందరూపాయల నోట్లకట్టల్ని ఇవతలికి లాగారండి. మరో జేబులోంచీ మరో కట్టని లాగారు. మూడు కట్టల్నీ ఎడంచేతిలో పట్టుకుని మళ్ళీ జేబులు తడువుకోడం ప్రారంభించాడు. రెండు నిమిషాలు గాలించి లోపలి జేబులోంచీ పర్సుతీశాడు...."

"రాజగోపాల్, ఒక్క క్షణం. అప్పుడు మూడు గంటల ప్రాంతం. చీకట్లో అదంతా నువ్వు ఎలా చూడగలిగావు?" శివరామ్ అడ్డొస్తూ ప్రశ్నించాడు.

రాజగోపాల్ చిరునవ్వు నవ్వాడు. "అక్కడ వీధి లైటు వెలుగుతోందండి. దాదాపు లైటుకిందే కారాగింది."

"రైట్. తరవాత ఏం జరిగింది?"

"పర్సు తెరవడానికి ఆయన ప్రయత్నించారు. కొద్దిగా తూలుతున్న ఆయన చేతులు వణుతూనే వున్నాయి. ఎడం చేతికింద ఆయన అజాగ్రత్తగా ఇరికించుకున్న నోట్లకట్టలు జారి రోడ్డుమీద పడ్డాయండి. వాటివైపు ఓసారి చూసి, ఆయన పర్సులోని నోట్ల బొత్తిలోంచీ

యాభై రూపాయల నోటులాగి నాకు అందించారండి. తూ. తూ అతికిష్టంమీద కిందికి వొంగి మూడు కట్టల్ని ఏరుకున్నారు. వాట్ని జేబులో కుక్కుకుని, కదల బోయారు. చిల్లర తీసికెళ్ళమని నేను పిలిచాను. చిల్లర వుంచుకొమ్మన్నట్టు చెయ్యి వూపుతూ ఆయన తిరిగిచూడ కుండా గేటువైపు వెళ్ళిపోయారు" రాజగోపాల్ ఆగాడు.

శివరామ్ జడ్జివైపు ఓసారి వోరగా చూశాడు. జడ్జి శివలింగం ముందుకి వంగి, చెవులు రిక్కించి ఏకాగ్రతతో వింటున్నాడు.

"రాజగోపాల్, తరువాత నువ్వేం చేశావ్?"

"కార్లో అలాగే కూచున్నాను. ఆయన వయసులో పెద్దవారు. డ్రింకు ఎక్కువైనట్టుంది. పసిపిల్లాడిలా తప్పటడుగులు వేస్తున్నారు. నా దగ్గర ఆయన చిల్లర వాపసు తీసుకోలేదు. ఆయన జేబుల్లో పెద్ద మొత్తంలో పైకం వుంది. క్షేమంగా ఆయన ఇంట్లోకి వెళ్ళేక, నేను వెళ్ళిపోదామనుకుని చూస్తూ కూచున్నా."

"ఏం జరిగింది?"

"ఆయన అటూ ఇటూ వూగుతూ, ముందుకి వెనక్కి తూలుతూ ఎలాగైతేనేం వరండా మెట్లెక్కి గుమ్మం చేరుకున్నారు. తలుపుమీద దబదబ బాదారు. తలుపుకి జార్ల బడి నుంచున్నారు. వరండాలో లైటు వెలిగింది. కాస్సేపట్లో తలుపు తెరవబడింది. ఆయన తూలి పడబోయారు. నౌకరులా వున్న వ్యక్తి ఆయన్ని జాగ్రత్తగా పట్టుకుని లోపలికి నడపబోయాడు. ఇంతలో ఇంట్లోంచీ ఒక అల్సేషియన్ కుక్క పరుగెట్టుకొచ్చి, ఆయన కాళ్ళని నాకుతూ, తోకాడిస్తూ పైకెగిరి ఆయన పొట్టమీద ముందరి కాళ్ళని

అనించి నించుంది. ఆయన దాని మొహాన్ని రెండు చేతుల్లో ఇరికించుకుని, ముక్కుమీద ముద్దెట్టుకున్నారండి.

"నౌకరులాంటి వ్యక్తినీ, ఆయనమీదికి ప్రేమగా ఎగబడిన కుక్కనూ చూశాక ఆయన తన ఇంటికే చేరు కున్నారన్న నమ్మకం నాకు కలిగింది. నా దారిన నేను వెళ్ళిపోయాను."

"థాంక్యూ రాజగోపాల్. అంతే!" శివరామ్ నవ్వుతూ ఉషారుగా అన్నాడు. వెనక్కి తిరిగి ప్రాసిక్యూటర్ వేదాంతరావువైపు చూశాడు. వేదాంతరావు వర్మముందు వంగి నుంచుని తగ్గు స్వరంతో ఏదో అడుగుతున్నాడు. దిక్కుతోచనివాడిలా వర్మ తలని అటూ ఇటూ జోరుగా ఆడిస్తున్నాడు. వేదాంతరావు ఏదో అడిగాడు. వర్మ అయో మయంగా అతని మొహంలోకి చూశాడు. వేదాంతరావు పిడికిళ్ళు ఎందుకో బిగుసుకున్నాయి. అతను తటాలున వెనక్కి తిరిగాడు. అతని మొహం కోపంతో జేవురిం చింది.

శివరామ్ అతన్ని చిరునవ్వుతో చూశాడు. "యూ మే క్రాస్ ఎగ్జామిన్ ది విట్నెస్!"

వేదాంతరావు నాలుగడుగులువేసి శివరామ్ సమీపంలో ఆగాడు. తలతిప్పి ఒకసారి వర్మవేపు తీక్షణంగాచూశాడు. బోనులో నిలబడున్న రాజగోపాల్‌ని ఒకసారి చూసి, జడ్జివైపు తిరిగాడు. "నేను క్రాస్ ఎగ్జామినేషన్ చేయ దలచలేదు!" అతని కంఠం కొంచెం కోపంగా ధ్వనిం చింది.

శివరామ్ జడ్జివైపు తల కొద్దిగా వాల్చాడు. "దట్సాల్, మిస్టర్ జస్టిస్!

ప్రాసిక్యూటర్ అందించిన లాగ్ బుక్‌ని అందుకుని

రాజగోపాల్ బోనులోంచి దిగి వెళ్ళిపోయాడు.

శివరామ్ లతవైపు చూస్తూ చిరునవ్వు నవ్వాడు. ఎవరో అడ్వొకేట్ ఆమెను ఏదో అడుగుతున్నాడు. లత నవ్వుతూ ఏమిటో చెప్తోంది. జడ్జి శివలింగం జడ్జిమెంట్‌ని చదవసాగేడు. శివరామ్ చెవులకి అది వినిపించడంలేదు. జడ్జిమెంట్ ఎలా వుంటుందో అతనికి ముందే తెలుసు.

అతని తల మెల్లిగా వర్మవైపు తిరిగింది.

జడ్జి శివలింగం పలికే ప్రతిమాటనీ పాలిపోయిన మొహంతో వింటున్నాడు వర్మ. అతని మొహంమీద జడ్జిమెంట్‌ని శివరామ్ చదువుతున్నాడు. క్షణంలో వర్మ మొహం ఎర్రగా అయింది. అతని దవడలూ, పెదవులూ అదురుతున్నాయి. శివరామ్ చూపులు లోతుగా నాటుకుపోయిన బాణాల్లా అతని మొహంమీదే వున్నాయి.

వర్మ కళ్ళు శివరామ్ వైపు తిరిగాయి. శివరామ్ చిరునవ్వు అతని హృదయానికి ఏదో మంటలా తాకుతోంది. వర్మ కళ్ళు నేల చూపులు చూశాయి.

6

"డార్లింగ్, ఈయన లాయర్ రాజమౌళి," లత వరండాలో తనతో మాట్లాడుతూ నిల్చున్న యువకుడిని, కోర్టు హాల్లోంచీ అప్పుడే వచ్చిన శివరామ్‌కి పరిచయం చేసింది.

ఇందాకా కోర్టులో లతతో మాట్లాడుతూ కనిపించిన వ్యక్తి-లాయర్ రాజమౌళి-వైపు శివరామ్ చిరునవ్వుతో చూశాడు. లాయర్ రాజమౌళి తన చేతిని ముందుకు చాచాడు. శివరామ్ అతని చేతిని పట్టుకున్నాడు.

"డిలైటెడ్ టూ సీ యూ మిస్టర్ రాజమౌళీ!" అన్నాడతను నవ్వుతూ.

"మై ప్లెషర్ మిస్టర్ శివరామ్!" రాజమౌళి మెరిసేకళ్ళతో

ఉద్రేకంగా అన్నాడు.

"మిస్టర్ శివరామ్, కంగ్రాచ్యులేషన్స్. మీ ఆర్గ్యుమెంట్ అద్భుతం!"

"థాంక్యూ!" శివరామ్ నవ్వుతూ జేబులోంచీ ఇండియా కింగ్స్ పాకెట్ తీసి, సిగరెట్ వెలిగించి, రాజమౌళిముందు పాకెట్ పట్టుకున్నాడు.

"నో థాంక్స్....మిస్టర్ శివరామ్, ఆర్ యూ ఎ లాయర్?" రాజమౌళి ప్రశ్నించాడు.

శివరామ్ నవ్వాడు. "నేను మామూలు మనిషిని; లాయర్ని కాను!" అన్నాడు. లత చెయ్యి అతని ఎడం చేతిని ప్రేమగా పట్టుకుంది.

శివరామ్ తలెత్తి చూశాడు. వరండాలో వర్మ తోక తెగిన సింహంలా, దిగులుగా అడుగులేస్తూ వస్తున్నాడు. అతని చూపులు వాళ్ళమీద పడ్డాయి. వర్మ తటాలున ఆగాడు. శివరామ్ చిరునవ్వుని భరించలేక అతను లత వైపు చూశాడు.

పట్టుచీరలో, ఏదో పెళ్ళికి వచ్చిన ముత్తైదువులా వుంది లత. జరీఅంచు పైట ఆమె రెండు భుజాల్నీ జాగర్తగా, మర్యాదగా కప్పింది. ఆమె నుదురుమీదా, పాపటమొదట్లో ఎర్రటి కుంకం రక్తంలా మెరుస్తోంది. ఆమె కళ్ళు వరత వైపు చిలిపిగా చూస్తున్నాయి.

వర్మ కళ్ళల్లోని ఎరుపు అతని మొహంనిండా వ్యాపించింది. అతను తల వాల్చుకుని చకచకా నడుస్తూ వాళ్ళని దాటి వెళ్ళిపోయాడు సిగరెట్ పీలుస్తూ శివరామ్ తన చూపుల్ని దూరంగా వెళుతున్న వర్మ వీపుమీదే నిలిపాడు. వర్మ అదృశ్యమయ్యాక అతను చిరునవ్వుతో లాయర్ రాజమౌళిని చూశాడు.

"మిస్టర్ రాజమౌళీ, మీతో కొంత వ్యవహారం డిస్కస్ చేయాలి. నా తరఫున మీరో కేస్ టేకప్ చేస్తారా?" శివరామ్ ప్రశ్నించాడు.

రాజమౌళి నవ్వాడు. "బై ఆల్ మీన్స్! కాంటీన్‌లో కూచుని మాట్లాడుకుందాం పదండి!" అంటూ కదిలాడు. లత భుజమ్మీద చెయ్యివేసి శివరామ్ అతన్ని అనుసరించాడు.

7

బూడిదరంగు చైనాసిల్క్ లుంగీ, జుబ్బా ధరించిన శివరామ్ సోఫాలో శాంతిమయంగా కూచుని సిగరెట్ పీలుస్తున్నాడు. ఫోమ్ బెడ్ మీద బోర్లాపడుకుని మోచేతుల్ని బెడ్ మీద ఆన్చి, ఎల్సీ సింబల్‌లావున్న రెండు అరచేతుల మధ్య మొహాన్ని ఇరికించి తనముందు పరిచిన న్యూస్‌పేపర్ని చదువుతోంది లత.

కోర్టులో తన సమీపంలో కూచున్న రిపోర్టర్ ట్రయల్ గురించి చక్కగా రాశాడు. అడ్వొకేట్ లేకుండా కేసుని తనే వాదించి గెలిచిన శివరామ్ చాకచక్యాన్ని రిపోర్టర్ శ్లాఘించాడు. పేపర్లోని వార్త లత ముఖానికి చిరునవ్వుని పూస్తోంది.

లత తలెత్తి ప్రేమా, గర్వం మిళితమైన చూపులని శివరామ్ మీద నిలిపింది. శివరామ్ రెప్ప వేయకుండా ఆమెనే చూస్తున్నాడు. మోకాళ్ళనుంచీ పైకి మడిచిన లత కాళ్ళు అపరంజి ముద్దల్లా వున్నాయి. చిరుగజ్జెలున్న వెండి గొలుసులు ఆమె పిక్కలమీదికి జారాయి. అరికాళ్ళు ఎర్రగా మెస్తురున్నాయి. లత ఏదో మాట్లాడబోయింది. ఫోన్ మోగింది. ఆమెనే చూస్తూ శివరామ్ రిసీవర్ని ఎడంచేత్తో అందుకున్నాడు.

"యస్," అన్నాడు.

"నమస్తే మిస్టర్ శివరామ్! నేను - రాజమౌళిని," అంది అవతలి కంఠం.

"నమస్తే, లాయర్‌సాబ్! వాట్ న్యూస్?" శివరామ్ అడిగాడు. లత ప్రశ్నార్థకంగా చూస్తోంది.

"వర్మ అరగంట క్రితం నన్ను కల్సుకున్నాడు...."

"హౌకమ్?" శివరామ్ అమాయకత్వం నటిస్తూ ప్రశ్నించాడు.

"నా మిత్రుడైన మరో అడ్వొకేట్ ద్వారా అతను నన్ను అప్రోచ్ చేశాడు. మీ తరఫున నేను పంపిన పరువు నష్టం దావా నోటీసు అతనికి అందింది. కోర్టుదాకా ఎందుకు ఇక్కడే, ఇప్పుడే సర్దుకుపోదా మంటున్నాడు. జరిగిందానికి విచారిస్తున్నాడు. మీరు ప్రవేశపెట్టిన టాక్సీ డ్రైవర్ సాక్ష్యం విన్నాక మీరన్నట్టే, మత్తులో చేశానేమో అనుకున్నాట్ట అతను. అతన్ని క్షమిస్తారేమో ఒకసారి ఆలోచించండి...."

"అండర్‌వేర్స్ అమ్ముకునే వర్మ నన్నూ, నా భార్యనూ నడి బజార్లో నిలబెట్టి పరువుతీసే ప్రయత్నం చేశాడు. తమ చుట్టూ బ్లాక్‌మనీతో కోటకట్టుకుని, నాలాంటి అమాయకుల్ని ఏడిపించే వర్మలాంటి ధనమదాంధుల్ని నేను క్షమించలేను, మిస్టర్ రాజమౌళీ!" శివరామ్ గంభీరంగా అన్నాడు.

"మిమ్మల్ని నేను అర్థంచేసుకోగలను. పెద్దవాడు. తాగిన మైకంలో ఏదో అనుకుని ఏదో చేశాడు. అతని మాటల్నిబట్టీ డామేజస్‌కింద డెబ్భైఅయిదు వేలు చెల్లించి మీతో రాజీ పడ్డానికి సిద్ధంగా వున్నాడని నేను గ్రహిం

చాను. మనలో మాట: కోర్టు మనం దావాలో అడిగిన రెండు లక్షలా నలభై అయిదువేలు ఇప్పించకపోవచ్చు. వర్మ బుద్ధి గడ్డితిందని యేడుస్తున్నాడు. రీకన్సిడర్ చేస్తారేమో చూడండి....'' రాజమౌళి కంఠం నచ్చజెప్పే ప్రయత్నం చేసింది.

శివరామ్ మౌనంగా లతవేపు చూశాడు. అతని పెదవులు నవ్వుతో విచ్చుకుంటున్నాయి. లత మొహం ఇంకా ప్రశ్నార్థకంగానే వుంది.

''మిస్టర్ రాజమౌళీ, మీలాంటి విద్యావంతుల మాటకి నేను విలువ ఇస్తాను. మేక్ హిమ్ పే వన్‌లాక్ ఫైవ్ థౌజండ్. లక్ష నేను డామేజస్ కింద తీసుకుని, తృప్తి పడతాను. ఐదువేలు మీరు ఫీజుకింద తీసుకోండి.'' శివరామ్ లతవైపు నవ్వుతూ చూశాడు. ఆమె మొహంలో ప్రశ్నార్థకం మాయమైపోయింది. ఆశ్చర్యం, ఆనందం పెనవేసుకుని ఆమె మొహమ్మీద మెరుస్తున్నాయి.

రాజమౌళి అటువైపున నవ్వాడు. ''నా ఫీజు సంగతి అలా వుంచండి. మీ లాస్ట్ ఫిగర్ అంతేనా?''

''మిస్టర్ రాజమౌళీ, మీ కోసం ఆ మొత్తానికి నేను సెటిల్ అవుతున్నా. పైసా తక్కువైనా వొప్పుకోను. అలా కానప్పుడు లెటస్ గో టూ కోర్ట్! కోర్టు ఎంతైనా ఇప్పించనివ్వండి. ఐ డోంట్ మైండ్. నాక్కావాల్సింది వర్మకి గుణపాఠం నేర్పడం!' శివరామ్ నిష్కర్షగా అన్నాడు. రాజమౌళి కాసేపు మౌనంగా వుండిపోయాడు.

''ఓకే, మిస్టర్ శివరామ్. నా మిత్రుడిద్వారా చెప్పించి, మీ రడిగింది వచ్చేలా చూస్తాను. సాయంత్రం నా ఆఫీసుకి వస్తారా?''

''వస్తాను. డబ్బుతో అతన్ని సిద్ధంగా వుండమనండి.

మళ్ళీ బేరాలు నాకు నచ్చవు!"

రాజమౌళి నవ్వాడు. "బేరాలుండవు. సాయంత్రం ఆరింటికి రండి!...." అంటూ అతను డిస్కనెక్ట్ చేశాడు.

శివరామ్ ఫోన్ పెట్టేసి, లతవేపు చూసి విజయగర్వంతో నవ్వాడు. లత కళ్ళు నీలాకాశంలో చుక్కల్లా మెరుస్తున్నాయి. మంచంమీంచీ కిందికి వురికి ఆమె గెంతుతూ శివరామ్‌ని సమీపించింది. సోఫా చేతిమీద కూచుని అతని భుజాలచుట్టూ చేతిని పోనిచ్చింది.

"డార్లింగ్, వర్మ లక్షరూపాయ లిస్తున్నాడా?" ఉద్రేకంతో అడిగిందామె.

"చచ్చినట్టు!"

లత అతన్ని ప్రశ్నార్థకంగా చూసింది. "నాకు.... రెండు సందేహాలున్నాయి...."

"నా దగ్గర చాలా సమాధానా లున్నాయి. అడుగు!" శివరామ్ నవ్వుతూ అన్నాడు.

"ఒకటి: వర్మ జేబుల్లోంచీ దొరలాగా తీసుకున్న డబ్బుని ఎక్కడ దాచావు? పోలీసులు వెతుకుతూంటే లోపల్లోపల వణికి చచ్చాను!" అందామె.

శివరామ్ నవ్వాడు. "ఇన్‌స్పెక్టర్ దేశ్‌పాండే ఏం చేయాలో తోచక మన ఎదురుగా ఫాన్‌కింద చెట్టులా నిలబడ్డాడు. ఆ సమయంలో సీలింగ్ ఫాన్ బ్లేడ్స్‌మీద బల్లుల్లా కరుచుకున్న నోట్లకట్టలు గింగిరాలు తిరుగుతున్నాయి!"

"గుడ్ గాడ్!"

"ఆ రాత్రి నువ్వు నిద్రపోయాక, వర్మ మొద్దబ్బాయిలా వెళ్ళిపోయాక ఆ కట్టల్ని ఫాన్ రెక్కలు మూడింటి మీదా సెలోటేప్‌తో గట్టిగా అతికించేశాను!" శివరామ్

కంఠంలో గర్వం తృప్తికరంగా ధ్వనించింది.

లత విడ్డూరంగా చూసింది. "డార్లింగ్, కేసుని తల్లక్రిందులు చేసిన సాక్షి టాక్సీ డ్రైవర్ రాజగోపాల్ కథేమిటో, అతన్నెలా పట్టావో అర్థంకావడంలేదు. అతని సాక్ష్యం విన్నాక నువ్వు వర్మ జేబుల్లోంచీ నిజంగానే తీశావా అన్న సందేహం నాకు కలిగింది!"

శివరామ్ నవ్వుతూ సిగరెట్ వెలిగించాడు. "హనీ, అపరంజికి రాగి కలపందే గట్టితనంరాదు. అబద్ధాలకీ కొన్ని నిజాలు కలపాలి. వర్మ దిగిపోయాక రహస్యంగా అతన్ని ఫాలో చేశాను. అతను టాక్సీ ఎక్కాడు. టాక్సీ నంబరు గుర్తుంచుకున్నాను. తరవాత రాజగోపాల్‌ని కలుసుకున్నాను. రాజగోపాల్ వర్మని తన టాక్సీలో తీసుకెళ్ళిందీ, వర్మ అతనికి యాభై రూపాయల నోటు ఇచ్చిందీ, ఆల్సేషియన్ వర్మని కౌగలించుకుందీ, నౌఖరు అతన్ని ఇంట్లోకి తీసుకెళ్ళిందీ—ఇవన్నీ నిజంగా నిజాలే. టాక్సీ దిగాక వర్మ జేబుల్లోంచీ నోట్లకట్టల్ని కిందపడేసి, తీసుకుంది తప్ప!"

"మై గాడ్!" లత ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

"నేనిచ్చిన రెండువేల రూపాయలు అతనిచేత నేను నేర్పించిన పాటను బ్రహ్మాండంగా పాడించాయి.!" శివరామ్ పకపక నవ్వాడు. లత నమ్మలేనట్టు క్షణకాలంచూసి తనూ నవ్వడం ప్రారంభించింది.

"హనీ, చీరకట్టి సింగారించుకో. అండర్‌గార్మెంట్స్ అమ్మి సంపాయించిన డబ్బులోంచీ వర్మ దగ్గర వో లక్ష వసూలుచేద్దాం!" అన్నాడు శివరామ్ హుషారుగా లేస్తూ. □

—('శివరామ్ నేరాలు' సీరీస్‌లో ఇది ఐదవ కథ)

శశిరేఖ శపథం

కె.వి.వి. సత్యనారాయణరాజు

ఒక్క ఉదుటున గదిలోకి వచ్చి వెనువెంటనే తలుపులు మూసిన యువకుడి మొహంలోకి ఆశ్చర్యంగా చూశాడు కృపారావు.

భోజనం పూర్తిచేసి పడకగదిలో ప్రవేశించి అలవాటుగా పుస్తకాన్ని చేతిలోకి తీసుకున్న కృపారావు ఆ

యువకుడి నంతకుముందెన్నడూ చూసి ఉండకపోవడంతో తెరిచిన నోరు నలాగే ఉంచాడు.

తాపీగా అడుగులు కొలిచివేస్తూ దగ్గరగా వస్తున్న ఆ యువకుణ్ణి పరికించి చూస్తే గతంలో ఎక్కడో చూసినట్టే అనిపించిందతడికి.

ఈలోగా ఆ యువకుడు కృపారావుకు రెండడుగుల దూరంలోకి వచ్చి నిల్చున్నాడు. తీక్షణంగా కృపారావు మొహంలోకి చూశాడు.

కృపారావేదో అనబోయేంతలో బొడ్లోంచి తళతళా మెరిసే కత్తి తీశాడా యువకుడు.

అంతవరకూ ఆశ్చర్యంగా చూస్తున్న కృపారావు మెదడు ప్రమాదాన్ని శంకించింది.

మరుక్షణం ఆ యువకుడి చేతిలోని కత్తి కృపారావు గుండెల్లో సూటిగా దిగింది. 'కెవ్వు'మని అరవబోయే కృపారావుని నోరునొక్కి ఆ ప్రయత్నంనుంచి ఆపి మొదటిసారిగా నోరు విప్పాడా యువకుడు.

ఒకో వాక్యమూ చెపుతూ ఒకో పోటు పొడిచాడు బలంగా. తను చెప్పవలసింది పూర్తయ్యాక ఆఖరుగా మరో పోటు పొడిచి ఒక్క క్షణంకూడా ఆలస్యం చేయకుండా వచ్చినదారినే తిరుగుముఖం పట్టాడు.

2

ఇన్స్పెక్టర్ రవీంద్ర తన బలగంతో ఆ గదిలోకి ప్రవేశించాడు. కుర్చీలో ముందుకు వాలిపోయి ఉన్నాడు కృపారావు.

అతడి శరీరం శవంలా కాక రక్తపుముద్దలా ఉంది. ఛాతీ, కాళ్ళు, చేతులూ, మెడ, ఇలా అన్ని భాగాల్లోంచి రక్తం బయటకువచ్చి గడ్డకట్టి చూడడానికి చాలా భయంక

రంగా ఉందా దృశ్యం!

ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్, ఫోటో గ్రాఫర్, డాక్టర్ తమ రొటీన్ విధులు పూర్తిచేశాక శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కు తరలించారు.

హత్యాస్థలంలో హంతకుణ్ణి పట్టిచ్చే క్లూ ఒక్కటి కూడా దొరక్కపోవడం చాలా ఆశ్చర్యం కలిగించింది రవీంద్రకు.

కృపారావుకు ఊళ్ళో చాలా మంచిపేరుంది. ఎందరో పేద విద్యార్థులను ఆదుకొన్నాడు. అనాథశరణాలయాలకు విరివిగా చందాలిచ్చాడు. వితంతు వివాహాలు చేయించాడు. సంఘ సంస్కర్తగా మంచి పేరు సంపాదించుకొన్నాడు. పెళ్ళి చేసుకోమని ఎంతమంది శ్రేయోభిలాషులు పోరినా లెక్కచెయ్యలేదతడు. అందరిచేతా మంచివాడిగా కీర్తింపబడ్డ వ్యక్తి అలా హఠాత్తుగా మరణించడం ఎన్నో ఆలోచనలను రేకెత్తించిందతడిలో.

శవాన్ని వెల్లకిలా పడుకోబెట్టినపుడు పరీక్షగా చూసిన రవీంద్ర ఉలిక్కిపడ్డాడు. కృపారావు నోరు తెరిచిఉంది. కళ్ళు ఆశ్చర్యంగా చూస్తున్నాయి. అంటే....హంతకుడెవరో కృపారావుకు తెలుసు. కానీ అతడు తనను హత్య చేయజూడడం కృపారావులో ఆశ్చర్యాన్ని కలిగించింది. సో....కృపారావువల్ల సహాయం పొందిన వ్యక్తుల్లో ఒకరి పని చేసి ఉండవచ్చు.

అంతవరకూ ఎటువంటి ఆధారమూ దొరకలేదని నిరాశ పడిన అతడి మనసు ఆనందంతో ఉరకలువేసింది. అప్పుడే సగం పని అయిపోయిన భావం కలిగిందతడికి. కానీ ఆ భావన ఎంతోసేపు నిలబడలేదు. కృపారావువల్ల సహాయం పొందినవాళ్ళు వేలల్లో కాకపోయినా కనీసం వందల్లో

ఉంటారు. వాళ్ళలో ఎవర్నని అనుమానించడం?

తిరిగి నీరసం ఆవహించిందతణ్ణి.

3

తలుపులమీదా, గడియమీదా దొరికిన వ్రేలిముద్రలు, పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్‌లను చూసిన డిటెక్టివ్ విశ్వామిత్ర నవ్వుతూ అన్నాడు, "అప్పుడే ఈ వేలిముద్రలు అనుమానితుల వ్రేలిముద్రలతో పోల్చిచూడడం అయిపోయిందన్న మాట."

"ఈ కేసులో ఖచ్చితంగా అనుమానించదగ్గ వాళ్ళంటూ ఎవరూలేరు. కొండకు వెంట్రుక కట్టి లాగినట్టుగా— కృపారావుకు బాగా పరిచయమున్నవాళ్ళ వ్రేలిముద్రలు సేకరించి వాటితో పోల్చాం. ఫలితం శూన్యం!

ఏ రెండు వ్రేలిముద్రలూ ఒకలాలేవు. పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ ప్రకారం హత్య రాత్రి తొమ్మిదిన్నరకూ పదిన్నరకూ మధ్య జరిగింది. గాయాల లోతునుబట్టి తొమ్మిదంగుళాల పొడవున్న కత్తి వాడబడిందని తెలుస్తోంది.

ఇంట్లో కృపారావు, అతడి నౌకరు కాలిముద్రలతో పాటు మరో జత బూటు ముద్రలు కనబడ్డాయి. ఆ బూటు ముద్రలను బట్టి హంతకుడికి నడిచేటపుడు బరువంతా పాదం మీద సమానంగా ఆన్చకుండా కాలివేళ్ళ మీద నడవడం అలవాటనే విషయంకూడా తెలిసింది.

కృపారావు ఇంట్లో పనిచేసే ముసలి నౌకరుకు అన్నీ టేబిల్ మీద అమర్చి ఇంటి వెనుకగా ఉన్న అవుట్ హౌస్‌లో తొమ్మిదిగంటలకే గుర్రుపెట్టి నిద్రపోవడం చాలా కాలంనుంచీ క్రమం తప్పకుండా వస్తున్న అలవాటు.

అతడి వలన మనకేమీ ప్రయోజనంలేదు. పోనీ అతణ్ణి అనుమానిద్దామా అంటే కృపారావు శవాన్ని చూసినప్ప

ట్నుంచి ఈ క్షణం వరకూ ఏడుస్తూనే ఉన్నాడు. కన్న బిడ్డలకు కూడా అలా గంటల తరబడి ఏడవడం ఎంత కృషి చేసినా సాధ్యంకాదేమో!

పోనీ డబ్బుగురించి ఈ హత్య జరిగిందా? అను కొందామంటే ఇంట్లో ఎప్పుడూ ఒక్క రూపాయి కూడా ఉంచడు కృపారావు. ఆస్తికోసం జరిగుండవచ్చునేమో అనుకోవడానికీ ఆస్కారంలేదు. తదనంతరం ఆస్తి అంతా స్వచ్ఛంద సేవాసంస్థలకు, అనాథ శరణాలయాలకు రాసేశాడు.

షిట్....కనీసం మనకీ హత్యగురించి ఆధారాలు దొరకడం కోసమైనా కృపారావు పెళ్ళిచేసుకొని, సంసారం చేసి ఉండవలసిందేమో!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ రవీంద్ర నిట్టూరుస్తూ.

రవీంద్ర చెప్పిన విషయాలు విన్నాక, అతడన్న ఆఖరి వాక్యానికి నవ్వబోయి ఆగి అన్నాడు డిటెక్టివ్ విశ్వా మిత్ర, "ఈ కేసులో మనకున్న ఒకే ఒక ఆధారం— హతుడి మొహంలో వ్యక్తమైన ఆశ్చర్యం. అలాగే కృపారావు గురించి మనం ఆలోచించాల్సిన మరో విష యం—అతడింతకాలమూ బ్రహ్మచారిగానే ఎందుకుండి పోయాడన్నది. అతడి హత్యకూ, అతడు పెళ్ళిచేసుకోక పోవడానికీ ఏమైనా సంబంధం ఉందేమో కనుక్కోవాలి మనం."

అంగీకార సూచకంగా తలూపాడు రవీంద్ర.

పదిహేను నిమిషాల్లో బ్యూక్ కారు కృపారావు ఇంటి ముందు ఆగింది. గేట్లోనే ఎదురొచ్చాడు నౌకరు. విపరీ తంగా ఏడవడంవల్లనేమో అతడి కళ్ళు బాగా ఉబ్బి

ఉన్నాయి. భుజంమీది కండువాతో కళ్ళను అద్దుకొంటూ ఏదో అడగబోయిన అతడి భుజంమీద తట్టి, "త్వరలోనే మీ అయ్యగారిని చంపిన వ్యక్తి పట్టుకొంటాం. నువ్వేం బాధపడకు!" అంటూ లోపలికి నడిచాడు విశ్వామిత్ర.

హత్య చేయబడిన గది తాళం తీసి తలుపులు తెరిచాడు రవీంద్ర. ప్రతి అంగుళమూ శోధించడం ప్రారంభించారు. టేబిల్ మీద ఉన్న ఫైల్స్ తీసి ఒకో కాగితమూ పరిశీలించారు. అతడి ఆధ్వర్యంలో ఉన్న ఫాక్టరీ, సినిమా హాలు, హోల్ సేల్ షాపుల తాలూకు ఫైల్స్ అవి.

క్రింద అరలో పుస్తకాలున్నాయి. మారుతాళం చెవులతో నిలువెత్తు బీరువా తెరిచాడు విశ్వామిత్ర. బట్టలు నీట్ గా అమర్చబడి ఉన్నాయి రెండు అరల్లో. పై అరలో కొన్ని ఫైల్స్ ఉన్నాయి. బీరువాలోని లాకర్ తెరిచి చూసిన విశ్వామిత్రకు దాని నిండుగా పేర్చబడివున్న డైరీలు కనిపించాయి.

మెరిసే కళ్ళతో వాటిని బయటకుతీసి ఆసాంతం చదివాక నిరాశే మిగిలింది విశ్వామిత్రకు. వాటిలో వ్యాపార సంబంధమైన విషయాలు తప్ప కృపారావు వ్యక్తిగత జీవితం గురించి తెలియజేసే విశేషాలేమీ లేవు.

ఆఖరు డైరీ చూసి పక్కన పెట్టబోతూ ప్లాస్టిక్ ఫోల్డర్ లో మడతపెట్టి ఉన్న కాగితాన్ని చూసిన విశ్వామిత్ర వెంటనే దానిని బయటకులాగాడు. ఒకటికాదు....పావు తాఖు సైజులో ఉన్న రెండు కాగితాలవి. వాటిలో ఒకటి ఎక్కడా నలగకపోయినా, నేచురల్ విదరింగ్ వలన తెల్లదనంపోయి, ముట్టుకుంటే చిరిగిపోయేటట్టుగా ఉంది. జాగ్రత్తగా మడతలు విప్పి చదివాడు.

పెన్నాడ,
11-11-1961.

కృపా,

నువ్వు నాకు చేసిన ద్రోహానికి, నయవంచనకు తగిన శిక్ష అనుభవిస్తావ్. ఇది నా శపథం!

—శశిరేఖ.

ఇంతే ఉంది ఆ ఉత్తరంలో. రెండో ఉత్తరం ఈ మధ్యనే వ్రాయబడింది. అది చదివిన విశ్వామిత్ర మొహంలో రంగులు మారాయి. మౌనంగా రెండు ఉత్తరాలూ రవీంద్ర కందించాడు విశ్వామిత్ర.

4

బ్యూక్ కారులో ఆ ఊరు చేరిన ఇద్దర్నీ అంతా వింతగా చూశారు. ఊరి మధ్యలో నాలుగు వీధుల కూడలిలో కారు ఆపాడు డిటెక్టివ్ విశ్వామిత్ర.

ఓ ఎత్తడుగుల ఇంటివరండాలో చుట్టలు పీలుస్తూ ఆనందాన్ని అనుభవిస్తున్న వాళ్ళలో ఒకతను కారు దగ్గరకు వచ్చి అడిగాడు, "ఎవరికోసం వచ్చారు బాబూ!?"

విశ్వామిత్ర అన్నాడు, "శశిరేఖగారి ఇల్లెక్కడో చెప్ప గలరా?" పట్నాల్లోనే ఫలానా ఆయన భార్యగా తప్ప గుర్తింపులేని స్త్రీకి పల్లెటూళ్ళలో అంతకంటే గుర్తింపు ఎలా వస్తుంది?

అతడు కాస్త ఆశ్చర్యంగా చూసి, "శశిరేఖంటే.... వాళ్ళింట్లో మగాళ్ళెవరూ లేరా?" అన్నాడు.

"ఇరవై నాలుగేళ్ళ క్రిందట ఇక్కడ ఉండేథావిడ.... అంతకు మించి వివరాలేమీ తెలియ ....." అంటూ ఏదో చెప్పబోయిన విశ్వామిత్ర మొహంలోకి చూస్తూ, "ఒరే... నారిగా!" అని పిలిచాడతను.

ఇంచుమించు అతడి వయసే ఉన్న మరో వ్యక్తి వచ్చాడు పంచె సర్దుకుంటూ. అతడితో, "చూర్రా.... వీళ్ళెవరో శశిరేఖ అనే ఆవిడ ఇల్లెక్కడని అడుగుతున్నారు. ఇరవైనాలుగేళ్ళ క్రితం ఈ ఊళ్ళో ఉండేదట. ఆవిడ తాలూకు మగాళ్ళెవరో చెప్పలేక పోతున్నారు." అన్నాడు మొదటివ్యక్తి.

అతడు పిలవగా వచ్చినతను, "కొంపదీసి వెంకట్రావుగాడి కూతురు కాదుకదా!?" అన్నాడు. తిరిగి అతడే "వాడి కూతురి పేరు శశిరేఖో ఏదో ఉండాలి. అదిప్పుడెక్కడుంది? ఊరొదిలిపెట్టి ఇరవైఏళ్ళు పైనే అవుతుందిగా!" అన్నాడు.

విశ్వామిత్ర అన్నాడు, "ఆ....ఆవిడే. ఇప్పుడు గుర్తొచ్చింది. వెంకట్రావుగారి అమ్మాయే! ఆవిడ ఆచూకీ ఏమైనా తెలుసా?"

ఈసారతడు అనుమానంగా చూస్తూ అన్నాడు, "ఏమో ఎవడికి తెలుసు? ఆ రోజుల్లో ఈ ఊరి మొత్తానికి ఆడోళ్ళ తరఫునా మగోళ్ళ తరఫునా అదొక్కత్తే కాలేజీ చదువు వెలగబెట్టింది. అప్పట్లో వెంకట్రావుగాడికి చాలా మంది చెప్పిచూశారు, "ఆడపిల్లని అంతదూరం పంపించి చదువులేంట్రా?" అని. వాడినిపించుకుంటేగదా! అందుకే అది చేసిన పనికి ఉరేసుకొన్నాడు. నలుగురి దార్లోనూ నడవకపోతే అంతేమరి!" విశ్వామిత్ర అనుమానం తీరనే లేదు, "అంటే కాలేజీలో ఏదైనా గొడవ జరిగిందంటారా?" అన్నాడు.

"అలాగయినా బానే ఉండేది. చదువు పూర్తయ్యాక వెంకట్రావు పెళ్ళి చేస్తానంటే వినిపించుకోలేదు. చివరికెలాగైతేనేం నలుగురూ కలిసి దానికి పెళ్ళిచేసి అత్తా

రింటికి పంపించారు. అక్కడా మొగుడితో గొడవలే! చదూకుంది గదామరి! తరువాత పిల్లాణ్ణి తీసుకొని ఈ ఊరొచ్చిన నాల్రోజులకే మాయమయింది.

వెంకట్రావు కూతురి ఇష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసి దాని బ్రతుకు బండలు చేశాననుకొన్నాడేమో, కూతురు ఇల్లొదిలిన తర్వాత ఇంట్లోనే ఉరేసుకొని చచ్చిపోయాడు."

అతణ్ణి ఆపి అడిగాడు విశ్వామిత్ర "మరి ఆ కుర్రవాడేమయ్యాడు?...."

"ఏమో, పిల్లాడూ తల్లీ కలిసే మాయమయ్యారు. అయినా ఇయ్యన్నీ ఎందుకడుగుతున్నారు మీరు?...." చెప్పాల్సిందంతా చెప్పేశాక అనుమానం వచ్చిందతడికి.

అంతవరకూ మౌనంగా ఉన్న రవీంద్ర సమాధానం చెప్పాడు, "ఆవిడెలా మాయమయిందో పరిశోధిస్తున్నాం"

అంతవరకూ ధీమాగా మాట్లాడిన అతడి మొహంలో భయం కదలాడింది, "మీరు....పోలీసోళ్లా?!...."

ఏదో చెప్పబోయిన రవీంద్రను వారిస్తూ, "కాదు.... కృపారావు అనే ఆయన ఆవిడ పేర తన ఆస్తంతా రాసి చచ్చిపోయాడు. అందుకే ఆ విషయం దర్యాప్తు చేస్తున్నాం" అబద్ధం ఆడాడు విశ్వామిత్ర.

"అంటే లాయర్లన్నమాట. హమ్మయ్య, భయపడి చచ్చాను, ఇంక నన్నేం అడక్కండి...." అంటూ తిరిగి అరుగెక్కేశాడతను.

నవ్వుకొంటూ డోర్ మూసి కారు రివర్స్ చేశాడు విశ్వామిత్ర.

5

కాలి మడమలు సరిగా నేలమీద ఆన్చకుండా కాళ్ళెత్తి అడుగులువేస్తూ వచ్చిన యువకుడి వైపు పరీక్షగా చూశాడు

విశ్వామిత్ర. నిర్లక్ష్యంగా మాటి మాటికీ తల ఎగుర వేస్తు న్నాడా యువకుడు.

శశిరేఖ భర్త అందజేసిన సమాచారం ప్రకారం— పెళ్ళయి బిడ్డపుట్టే వరకూ సుభావంగా ఉన్న శశిరేఖ తరువాత భర్తతో కోరి దెబ్బలాడేదట. ఆఖరుసారి భర్తతో గొడవపడి పుట్టింటికి వచ్చిన శశిరేఖ గురించి కొంతకాలం ఆచూకీ తీసి తరువాత ఆ విషయం వదిలేశారట. ఏడాది వయసున్న పసిగుడ్డుతో శశిరేఖ ఇల్లువదిలి ఎక్కడికి వెళ్ళిందో ఎవరికీ తెలియదు.

శశిరేఖ, ఆమె భర్తా ఉన్న ఫోటో ఒకటి మాత్రం ఇవ్వగలిగాడామె భర్త. ఆ ఫోటోనుంచి ఆమె భర్తను వేరుచేసి శశిరేఖ ఫోటోను అన్ని దినపత్రికల్లోనూ ప్రకటించారు—పెద్ద మొత్తంలో ఆస్తి ఆమెకు చెందేలా విల్లు రాయబడిందనీ, కనుక ఆమె ఆచూకీ తెలియజేసిన వారికిగానీ లేక ఆమెనే స్వయంగా తీసుకొచ్చిన వారికిగానీ తగిన పారితోషికం ఉంటుందని.

ప్రకటన వెలువడిన వారంరోజులకు పంధొమ్మిది—ఇరవై ఏళ్ళ వయస్సున్న యువకుడు వచ్చి విశ్వామిత్రను కలుసుకొన్నాడు.

ఆ యువకుడి కథనం ప్రకారం శశిరేఖ అతడి తల్లి. కొద్ది రోజులక్రితమే అనారోగ్యంవల్ల మరణించింది. ఆ విషయం తెలియజేసి ఆ ఆస్తి తనకు దక్కే అవకాశ మేమైనా ఉందేమో తెలుసుకోవడం కోసం వచ్చాడా యువకుడు.

అతడు చెప్పిన వివరాలు విన్నాక ఏ మాత్రమూ ఆలస్యం చేయకుండా కస్టడీలోకి తీసుకొన్నాడతణ్ణి, ఇన్

స్పెక్టర్ రవీంద్ర.

అప్పుడర్థమయిందా యువకుడికి తనెలా ట్రాప్ చేయ బడ్డాడో. తప్పించుకొనే దారిలేదని నిర్ధారణ చేసుకొన్నాక నోరు విప్పాడు.

"అవును. కృపారావును నేనే చంపాను. నా తల్లికన్న కలల్ని భగ్నంచేసి, ఆమె అనాధగా బ్రతకడానికి కారకు డైనవాణ్ణి నా కసిదీరా చంపే అదృష్టం నాకు దక్కి నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఆ విధంగానైనా నా కన్నతల్లి ఋణం తీర్చుకోగలిగాను...."

అతణ్ణి ఆపుచేసి, "కృపారావుకు నీ తల్లిమీద ప్రేమ చావలేదనడానికి, మరణించేవరకూ అతడు పెళ్ళిచేసుకోక పోవడమే చక్కటి నిదర్శనం!" అంటూ తన చేతిలోని కాగితాన్ని అందించాడు విశ్వామిత్ర. కృపారావు బీరువాలో దొరికిన రెండో ఉత్తరం అది.

రాఘవేంద్రనగర్,
20-11-1985.

కృపా,

నిన్ననుమానించి నా బ్రతుకు నేనే నాశనం చేసు కొన్నాను. నన్ను క్షమించు!

శశిరేఖ.

విసురుగా లాక్కొని చదివిన యువకుడిలో అంతకు ముందున్న ఆవేశం స్థానంలో ఆశ్చర్యం చోటుచేసుకుంది.

అప్పుడన్నాడు విశ్వామిత్ర, "నీకు వయసొచ్చేసరికి నీ తండ్రి ఎవరో నీకు తెలియదు. శశిరేఖ కూడా నీకు వయసొచ్చేవరకూ ఆగి అప్పుడు విషయం చెప్పి, తన పగ తీర్చుకోవాలనుకొంది. అప్పట్లో తనకూ, కృపా రావుకూ మధ్య శారీరక సంబంధం లేకపోయినా, అతణ్ణి

మనసావాచా నమ్మింది.

కానీ అదే సమయంలో కృపారావుకో బెదిరింపు లేఖ అందింది, ఆమె తండ్రిపేరుతో—శశిరేఖను పెళ్ళిచేసుకొనే ఉద్దేశ్యం మానుకోమనీ, అలా చేయని పక్షంలో శశిరేఖ శవానికే నువ్వు తాళి కట్టవలసి ఉంటుందని. నిజానికా ఉత్తరంరాసినవాడు—అప్పట్లో మీ అమ్మమీద మనసుపడి భంగపడిన దయానందం. అతడూ ఇప్పుడు లేడు.

మీ అమ్మ ఎంత పట్టుదలమనిషంటే—తను ప్రేమించిన కృపారావుమీద కసి తీర్చుకోవడం ఒక ఆడదానిగా తనకు సాధ్యంకాదని—తన పథకంలో భాగంగానే మీ నాన్నతో పెళ్ళికి ఒప్పుకొంది. ఆవిడ ఉద్దేశ్యం తనోబిడ్డకు తల్లికావడం! నువ్వు ఆడపిల్లవై ఉంటే ఏం చేసేదోమరి!

నువ్వు పుట్టాక భర్తతో ఏదో రకంగా తెగతెంపులు చేసుకొని నిన్ను తీసుకొని బయటకు వచ్చేసింది. నీకు యుక్తవయసు వచ్చాక ఆ విషయం చెప్పి నీ ద్వారా కృపారావు మీద పగ తీర్చుకోవడం ఆమె ఉద్దేశ్యం.

కానీ తరువాత ఆమెకు నిజం తెలిసింది. కృపారావు నిజంగా తనను మోసం చేయలేదనీ, తనతణ్ణి అపార్థం చేసుకొందనీ. తన మనసులో ఆమె చనిపోయేనాటికి కృపారావుమీద ఏ విధమైన ద్వేషమూ లేదనడానికి నువ్విప్పుడు చదివిన ఉత్తరమే నిదర్శనం.

నిన్ను మీ నాన్ననుంచి వేరుచేసినందుకు ఆఖరి రోజుల్లో ఆమె పశ్చాత్తాపడి ఉంటుంది. బహుశ మరి కొంతకాలం బ్రతికిఉంటే నిజంచెప్పి, నిన్ను కన్నతండ్రి దగ్గరకు పంపించేదేమో! కానీ దురదృష్టం కొద్దీ ఈ లోగానే ఆమె మరణించింది. ఇహ—కృపారావును చంపాలని నీకెందు కనిపించిందో, చెప్పవలసింది నువ్వు.”

"మా అమ్మ చచ్చిపోయాక ఆమె పెట్టె చూసిన నాకు ఆమె రాసుకున్న డైరీలు కనిపించాయి. వాటి ద్వారా నా కర్థమయినంతవరకూ కృపారావే ఆమె దుస్థితికి కారణం. అతి కష్టంమీద అతడి ఆచూకీ తెలుసుకోగలిగాను.

నా తల్లి బ్రతికుండగా ఎలానూ సుఖపడలేదు. కనుక కృపారావును చంపి కనీసం ఆమె ఆత్మకైనా శాంతి కలుగజేద్దామని నా ఉద్దేశ్యం. కానీ నిజం తెలిసిన తరువాత- కృపారావంతటి మంచి మనిషిని చంపినందుకు ఎంతో బాధపడుతున్నాను—" అంటూ రెండు చేతుల్లోనూ మొహం దాచుకొన్నాడా యువకుడు.

చనిపోయేముందు కృపారావు మొహంలో వ్యక్తమైన ఆశ్చర్యానికి కారణం—అతణ్ణి చంపిన యువకుడు ముమ్మూర్తులా శశిరేఖను పోలి ఉండడమే ననే విషయం తేలిగ్గానే అర్థమైంది రవీంద్రకు. □

నిషా హుషార్!!



ప్రతిమాట

దీపిక

మద్రాసు అడయారులోని కళ్యాణమంటపంలో సినీనటి, సుమారు వందకు పైగా చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన జయదేవి వివాహం. వరుడు మరెవరోకాదు.. ఇప్పుడిప్పుడే తారాపథాన్ని అందుకుంటున్న అభినవ హీరో రాజమోహన్.

ఆంధ్రరాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అభిమానుల తోనూ, సినీ పరిశ్రమలోని ప్రముఖులు, అప్రముఖులతో ఆ కళ్యాణమంటపం క్రిక్కిరిసిపోయింది.

కళ్యాణ వేదికపై సిగ్గుల మొగ్గై తలవంచుకు కూర్చుంది జయదేవి.

పత్రికా విలేఖర్లు, అభిమానులు కెమేరాలకు పనిచెప్తున్నారు.

"ప్లీజ్! ఇటు ఒక్కసారి చూడండి," అని ఓ విలేఖరి అభ్యర్థించగా,

జయదేవి మెల్లగా సిగ్గుపడుతూ తలఎత్తి అభ్యర్థన వినిపించిన దిశగా చూసింది.

అంతే! ఆమెకు ముచ్చెమటలు పోసాయి. వివాహానికి వచ్చిన అతిథుల మధ్యగా కూర్చున్న ఓ వ్యక్తిని భయంగా చూసింది.

కెమేరాలు మరోసారి క్లిక్‌మన్నాయి. ఎన్నో చిత్రాలలో వధువుగా నటించిన జయదేవిని ప్రత్యక్షంగా ఆ అలంకరణంలో చూడగానే అభిమానులు ఆనందంతో పులకరించిపోయారు. అందరి కళ్లు జయదేవిమీదనే. జయదేవి దృష్టిఅంతా ఆ వ్యక్తిమీదే.

శరీరమంతా వణకు, భయంగా తలవంచుకుంది. తను చూసిన వ్యక్తి అతనేనా లేక అతనిలా వున్న ఎవరో అపరిచితుడా? తల ఎత్తి నిర్ధారణ చేసుకోవాలని వుంది. భయంతో తలఎత్తలేకపోయింది.

పురోహితులు చెప్పినట్లుగా అన్యమనస్కంగా వివాహ విధులు పూర్తిచేసింది. వివాహం వైభవంగా ముగిసింది.

అందరికీ ధన్యవాదాలు తెల్పి నూతన వధూవరులు

కళ్యాణవేదిక దిగి వెలుపలనున్న కారులో ఆసీను లయ్యారు. కారు రివ్వున దూసుకుపోయింది.

2

కోడంబాకంలో ఓ అందమైన భవంతి ముందు ఆగింది కారు. జయదేవి, ఆమె వెనుకగా రాజమోహన్ కారు దిగారు. విలేఖర్లు తయారుగా వున్నారు.

కెమేరాలు క్లిక్‌మన్నాయి.

చిరునవ్వులు ఒలకిస్తూ ఇంట్లోకి నడచింది జయదేవి. బెడ్‌రూంలోకి వెళ్ళి ఫ్రిజ్‌లోంచి ఐస్‌క్యూబ్స్, ఫ్రిజ్ ప్రక్కనే బల్లపైనున్న విస్కీసీసా, గ్లాసు తీసుకొని మంచంపై కూర్చుని ఆలోచిస్తూ విస్కీ సేవించసాగింది.

ఆమె ఆలోచనలన్నీ కళ్యాణమంటపంలో చూసిన వ్యక్తిమీదనే లగ్నమయి వున్నాయి. తనలో తనే ఎన్నో ప్రశ్నలు వేసుకుంది. ఈ శుభదినాన అతని రాకకు ఆంతర్యం తెలియక సతమత మయ్యింది. చిరాకుతో మంచం దిగి అటూ ఇటూ పచార్లు చేస్తూ ఆలోచించ సాగింది. ఏం బోధపడక తిరిగి వచ్చి మంచంపైకూర్చుని విస్కీ త్రాగింది.

త్రాగి, త్రాగి మత్తుగా మంచంపై వాలి నిద్రలోకి జారుకుంది.

విలేఖర్లు, అభిమానులు, స్నేహితులవద్ద శెలవు తీసుకొని గదిలో అడుగుపెట్టిన రాజమోహన్, జయదేవి, పడుకున్నతీరు, ప్రక్కనే టేబుల్‌పై విస్కీసీసా, గ్లాసు చూసి, ఆనందంతో మైమరచి త్రాగి పడుకొందని తలచి తనలో తనే నవ్వుకున్నాడు.

ముందుకు వంగి ఆమె పెదాలపై సుతారంగా ముద్దు

పెట్టుకొని ఆ గదిలోంచి వెలుపలకొచ్చాడు.

అప్పుడే మెట్లెక్కివస్తున్న అతని సెక్రటరీ, రాజ మోహన్ని చూడగానే దగ్గరకు వచ్చాడు.

"సాయంత్రం సాగర్‌హోటల్‌లో ఏర్పాటుచేసిన రిసెప్షన్‌కి ఏర్పాట్లన్నీ పూర్తిఅయ్యాయా?" అనడిగాడు రాజమోహన్.

"అయినాయిసార్. నేను ఇప్పుడు అక్కడికే వెళుతున్నా మీకు చెప్పిపోదామని వచ్చాను."

"సరే వెళ్ళు. అన్నీ మీరే దగ్గరుండి చూసుకోండి" అన్నాడు రాజమోహన్.

"అలాగే సార్" అని వెనుదిరిగాడు అతని సెక్రటరీ.

3

జయదేవి బద్ధకంగా ఒళ్ళువిరచి కళ్ళు తెరచింది. వాచీ చూసింది. 1 గం॥ సమయం. తను 3 గంటలు నిద్ర పోయింది. బాత్‌రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కొని వచ్చి వాలుకుర్చీలో కూర్చుంది.

మనసంతా ఆందోళన, ఏవో ఆలోచనలు.

తలుపు చప్పుడయింది.

"కమిన్" అంది జయదేవి చిరాకుగా.

పనిమనిషి రంగమ్మ లోనికి వచ్చింది, చేతిలో ఏదో కాగితం.

"సెక్రటమ్మగారు మీ కివ్వమన్నారు," అంటూ ఆ కాగితం అందించింది.

"సరే. నువ్వెళ్ళు."

రంగమ్మ పోగానే ఇంటర్‌కమ్ స్విచ్ నొక్కి "లతా!" అని గట్టిగా అరచింది జయదేవి.

"యస్! మేడమ్!" లత గొంతు ఖంగారుగా విన్పిం

చింది.

"నన్ను డిస్టర్బ్ చెయ్యవద్దని చెప్పానా?"

"యస్! మేడమ్. కానీ ఇక్కడొకాయన మిమ్మల్ని కల్సుకుంటేగానీ వెళ్ళను అని మొరాయించుకు కూర్చున్నాడు. అందుకని...." తడబడుతూ అంది లత.

"ఊ. సరే. ఎవరతను!" అని కాగితంపై దృష్టి సారించింది.

లత అందమైన చేతివ్రాతలో "భానుమూర్తి", పేరు చూడగానే షాక్ తగిలినట్లయి కాగితాన్ని జారవిడిచింది.

"మేడమ్!" లత గొంతు.

"వన్ మినిట్." అని వంగి కాగితం తీస్తూ అంది జయదేవి.

కొద్ది క్షణాలు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చిందై, "లతా! అతన్ని నా ఆఫీసురూంలో కూర్చోమను, వస్తున్నా" అంది జయదేవి.

ఏం తిట్లు తినాలో అని వేచివున్న లత "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకొంది.

సోఫాలో ఎదురుగా కాలుమీద కాలువేసుకొని నిర్లక్ష్యంగా కూర్చున్న భానుమూర్తిని చూడగానే లతకు ఎక్కడలేని కోపం వచ్చింది.

"బాబూ! నీకో నమస్కారం. ఇకమీదట నన్నిలా ఇబ్బందిపెట్టకు. మా ఉద్యోగాలకు ఎసరుపెట్టకు. అదిగో వెళ్ళి ఆ ఆఫీసుగదిలో కూర్చో. మేడమ్ వస్తున్నారు." అన్నది.

భానుమూర్తి నవ్వుతూ లేచి నిల్చొని, జయదేవి ఆఫీసు గదిలోకి నడిచాడు.

మెత్తని కార్పెట్, ఖరీదైన సోఫాలు, గోడలకు

ఉడన్ పాన్‌తింగ్, ఫాల్స్ సీలింగ్‌తోవున్న ఆ ఏ.సి. రూం చూడగానే సంతృప్తిగా నవ్వుకుని మెత్తని కుషన్ ఛెయిర్‌లో కూర్చున్నాడు.

సుమారు పావుగంట గడిచింది. గదిలో అడుగు పెడ్తున్న జయదేవిని చూడగానే అతని మనసు అదుపు తప్పింది. "కులాసాగా ఉన్నావా చంద్రమ్మా?" అని ఆమె దగ్గరగా వెళ్ళబోయేడు.

ఆ పేరు వినగానే జయదేవికి అరికాలిమంట తల కెక్కింది.

"ఆగు," అంది కోపంగా.

ఠక్కున ఆగాడు భానుమూర్తి.

"ఎందుకు వచ్చావు." తిరిగి అంది జయదేవి.

"అదేం ప్రశ్న. భర్త భార్యదగ్గరకు ఎందుకువస్తాడు?"

"ఈ రోజు నాకు మరొకరితో వివాహం అయ్యింది. నువ్వు కూడా నా వివాహానికి అతిథిగా వచ్చావు. అయినా ఇప్పుడు వచ్చి నేను నీ భర్తను అని జ్ఞాపకం చేయటంలో అంతరార్థం?"

"ఒక భర్త ఉండగా అతనినుండి విడాకులు పొందకుండా ఈ పెళ్ళి ఎలా చేసుకున్నావని అడగటానికి వచ్చాను."

"నెలరోజులుగా పత్రికలన్నిటా నా వివాహపు ముచ్చట్లే. చదువలేదా నువ్వు. వివాహం జరిగిన నాలుగ్గంటల తర్వాత నీ మొగుడ్ని బ్రతికే ఉన్నాను—అంటూ రావడంలో నీ ఉద్దేశం?"

"కొద్దిగా పనుల వత్తిడివలన ముందుగా రాలేక పోయాను."

రెండ్రోజులక్రిందటే జైలునుంచి విడుదల అయ్యానని

చెప్తే జయదేవి ముఖకవళికలు ఎలా ఉంటాయో చూడా లనిపించింది భానుమూర్తికి.

"ఏకాకిగా నిలువ నీడలేకుండా ఆకలి మంటలకు నిర్దాక్షిణ్యంగా నన్ను ఏనాడు వదలి వెళ్ళావో — ఆనాడే నా మొగుడు చచ్చాడనుకున్నాను," జయదేవికి గతం గుర్తుకొచ్చి నిలువునా వణికిపోయింది.

"గతం అప్రస్తుతం. వర్తమానం సంగతి ఏమిటి. భవిష్యత్తు ఏమిటి?"

"అంటే"

"నువ్వు నా భార్యవన్న సంగతి నలుగురికీ తెలిస్తే నీ పరిస్థితి."

"బెదరిస్తున్నావా."

"కాదు. వాస్తవం గుర్తుచేస్తున్నాను."

"మిస్టర్ భానుమూర్తీ! ఈ డొంక తిరుగుడు మాటలు కట్టిపెట్టి చెప్పు. ఎంత కావాలి? లక్షా? రెండు లక్షలా?"

భానుమూర్తి ఏం మాట్లాడలేదు. ఆలోచనలో పడ్డాడు.

"ఒక్కక్షణం. ఇప్పుడే వస్తాను," అని ఎడంప్రక్కగా నున్న తలుపు తీసుకొని లోనికి వెళ్ళింది.

కొద్దిక్షణాలు గడిచాయి. రెండుచేతులనిండా నోట్ల కట్టలు తెచ్చి భానుమూర్తి ముందున్న బల్లపై పడవేసింది.

అంత డబ్బు చూడగానే భానుమూర్తి కళ్ళల్లో మెరపు మెరసి మాయమయింది. ఆత్రుతగా డబ్బు అందుకో బోయేడు.

"ఆగు. ఆ డబ్బు అంతా కలపి ఎంతో తెలుసా? రెండు లక్షలు. అంత డబ్బు ఇవ్వటానికి నేనేం వెర్రి దాన్ననుకున్నావా?"

"మరి?" ప్రశ్నార్థకంగా చూస్తూ, "నీకు వేరే దారి

లేదు." అన్నాడు భానుమూర్తి.

ఈ సొమ్మంతా ఖర్చుచేసి తిరిగిరావని ఏమిటినమ్మకం. అందుకనే సాయంత్రం వచ్చి విడాకుల పత్రాలపై సంతకం చేసి ఈ డబ్బు తీసుకెళ్ళవుగాని. ఏం బుచ్చీ. ఇంక వెళ్ళు." అంది ఈసడింపుగా.

ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టి, వెంటనే తేరుకొని నవ్వాడు. "గుడ్. నీ కిన్ని తెలివితేటలు ఎలా వచ్చాయి. సరే, నువ్వడిగినట్లు చేస్తాను. కానీ ఈ సొమ్ము చాలదు." అన్నాడు భానుమూర్తి.

"ఎంతకావాలి?" నిర్లక్ష్యంగా అడిగింది జయదేవి.

"5 లక్షలు."

"5 లక్షలా! సరే అయితే కరెక్టుగా సాయంత్రం నాలుగ్గంటలకు రా. ఆలస్యమయితే నన్ను కల్సుకొనే వీలు కుదరదు."

"కారణం?"

"సాయంత్రం 6 గం॥లకు హోటల్ సాగర్‌లో మా వివాహ సందర్భంగా విందు ఏర్పాటుచేసాం. తరవాత మా ఫస్ట్‌నైట్. రేపు ఉదయం హనిమూన్‌కు స్విట్జర్లాండు ప్రయాణం. తిరిగి వచ్చిన తరువాత వరుసగా నెలరోజులు అవుట్‌డోర్ షూటింగ్‌లు."

"కరెక్టుగా 4 గంటలకే వస్తాను." అని వెళ్లిపోయాడు భానుమూర్తి.

అతను వెళ్ళగానే టెలిఫోను రిసీవరు ఎత్తి డయల్ చేసింది.

"ఎవరు? లాయరుగారా. నేను జయదేవిని మాట్లాడు తున్నాను."

"ఆ. చెప్పమ్మా," అవతలిగొంతు వినిపించింది.

కొంతసేపు ఫోనులో మాట్లాడి, "ఆ కాగితాలు రెడీ చేసి కవరులో సీలు చేసి వుంచండి. నా సెక్రటరీ లతను మధ్యాహ్నం 3 గం॥లకు పంపిస్తాను. ఇక్కడుండి అని రిసీవర్ క్రెడిల్ చేసింది. టేబుల్ పై వున్న నోట్లకట్టలు తీసి లోపలి సేఫ్‌లో భద్రపరిచింది.

4

సాయంత్రం ఇంటికి ఓ ప్రక్కగానున్న తోటలో పచార్లు చేస్తోంది జయదేవి. మెయిన్ గేటులోంచి కాక తోటకున్న చిన్న గేటులోంచి రమ్మని చెప్పింది భాను మూర్తికి.

ఆమె దృష్టి అంతా ఆ గేటుమీదనే. సమయం 4 గం॥లు అవుతుంది అనగా వచ్చాడు భానుమూర్తి.

"రా.రా. నీ కోసమే ఎదురు చూస్తున్నాను, అంటూ ఆఫీసు గదికి అనుకొని వున్న గదిలోకి దారితీసింది జయదేవి.

ఆమె వెనుకే ఆ గదిలోకి వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు భానుమూర్తి.

జయదేవి సోఫావెనుక వుంచిన సూట్‌కేసుని భాను మూర్తి ఎదురుగా టీపాయ్ మీదుంచింది.

సూట్‌కేసు తెరచిన భానుమూర్తికి నోటమాట రాలేదు. కళ్ళప్పగించి నోట్లకట్టలను చూస్తూ ఉండిపోయాడు. నాలుగు వందరూపాయలు కట్టలు తీసి గుండెలకు హత్తు కొని తన్మయత్వంతో మురిసిపోయాడు.

"ఊ! ఊ! త్వరగా కానియ్. ఇదిగో ఈ కాగితాల మీద సంతకం చెయ్!" అంది.

భానుమూర్తి విడాకుల పత్రం సాంతం చదివాడు. "చాలా తెలివిగానే వ్రాసాడు మీ లాయర్. రెండు

సంవత్సరాల క్రిందటి తారీఖు స్టాంపు పేపర్లు సంపాదించి మరీ వ్రాయించావు. గుడ్. కానీ నీకో విషయం చెప్తాను విను." అన్నాడు భానుమూర్తి.

"ఏమిటది? త్వరగా చెప్పు?" అసహనంగా అంది జయదేవి.

"ఏమీలేదు. ఏ తేదీ అయితే ఈ విడాకుల పత్రం మీద ఉందో ఆ రోజున నేను హత్యానేరంపై జైలుశిక్ష విధించబడి జైలులో వున్నాను." అన్నాడు నవ్వుతూ.

"వ్హాట్!" జయదేవి ఖంగుతింది.

"యస్! మైడియర్."

"మైగాడ్."

"నీ కింక ఆ దేవుడే దిక్కు. మరి వెలవు. వస్తాను. తిరిగి వస్తాను. డబ్బు రెడీగావుంచు. అనవసరంగా ఖర్చు చేయకేం." అని గుమ్మంవైపు అడుగువేశాడు భానుమూర్తి.

"ఆగు. ఆ సూట్‌కేసు అక్కడపెట్టు" కోపంగా అంది జయదేవి.

విన్పించుకోనట్లే ముందుకు అడుగువేసాడు.

"నీకే చెప్తున్నా. కదిలావంటే ఛస్తావు."

"వ్హాట్," ఆశ్చర్యంగా వెనుతిరిగాడు భానుమూర్తి.

జయదేవి చేతిలో రివాల్వరు. ఖంగారుగా రెండడుగులు వెనక్కు వేసాడు.

"యస్ మై డార్లింగ్. నువ్వు దౌర్జన్యంచేస్తావని తెలిసే ఈ రివాల్వర్ తెచ్చాను. ఊ. ఆ సూట్‌కేసు ఇలాఇయ్యి." అంది జయదేవి.

ఊహించని వేగంతో సూట్‌కేసు ఆమెపై విసిరాడు.

హఠాత్పరిణామానికి ఖంగారుపడి వెనక్కు అడుగు

వేసింది, సోఫా తగిలి కూలబడింది. రివాల్వర్ చేజారింది.

సూట్ కేసు ఆమె భుజాన్ని తాకింది.

"అబ్బా," అంది బాధగా.

రివాల్వరు చేజిక్కించుకున్నాడు భానుమూర్తి.

"నన్ను చంపకు. నీకింకా ఎంత కావాలంటే అంత సొమ్ము ఇస్తాను." భయంగా రివాల్వర్ నే చూస్తూ అంది జయదేవి.

"భయపడకు. నిన్ను చంపను. బంగారపు గుడ్లుపెట్టే బాతును చంపుకునేంత వెర్రివాడ్నికాదు."

ఆ మాటలు వినగానే ప్రాణం లేచి వచ్చింది జయదేవికి.

"ఆ చీర విప్పి ఇలా ఇవ్వు." అన్నాడు భానుమూర్తి.

"చీరా! ఎందుకు?"

"ఇంకెందుకు. నిన్ను ఆ కుర్చీకి కట్టిపేయటానికి. ఊ. త్వరగా." కటువుగా అన్నాడు భానుమూర్తి.

జయదేవి కుర్చీలోంచి లేచి నిలబడింది.

ఇంతలో భానుమూర్తి వెనుక తలుపు మెల్లగా తెరచు కుంది. లోనికి అడుగుపెడ్తూ ఏదో అందామని వచ్చిన రాజమోహన్ నోరు వెళ్ళబెట్టి ఆశ్చర్యంగా నిల్చుండి పోయాడు అక్కడి దృశ్యం చూసి.

కర్తవ్యం గుర్తుకువచ్చి అటూ ఇటూ చూశాడు. గుమ్మానికి ప్రక్కనే చిన్న బల్లపై అందమైన నృత్య భంగిమలో నున్న అప్సరస కంచు విగ్రహం అతని కంట బడింది.

ఇంకేం ఆలోచించకుండా ఆ విగ్రహంతీసి భానుమూర్తి వెనుకకు సమీపించి, అతని తలపై గట్టిగా కొట్టేడు.

భానుమూర్తి ఓ మూలుగు మూలిగి కుప్పలా నేల కూలాడు.

గుండెల నిండా గాలి పీల్చుకొని హాయిగా నిట్టూర్చింది జయదేవి.

అంతలోనే జ్ఞాపకం వచ్చి 'కెవ్వు'మని అరిచింది నటి జయదేవి.

"హుష్! అరవకు" రాజమోహన్ చిరాగ్గా అన్నాడు.

జయదేవి నోటికి చేయి అడ్డం పెట్టుకొంది.

భానుమూర్తి తలకు తగిలిన గాయం నుంచి రక్తం వరదలుగా కారుతోంది.

రాజమోహన్ వంగి పరిశీలనగా చూసాడు.

ప్రాణం వున్న సూచనలు లేవు.

"చచ్చాడు. ఎవరితను?" లేచి నిలబడుతూ అడిగాడు.

"చెప్తాను. ముందు ఆ తలుపు గడియపెట్టు" అంది జయదేవి.

రాజమోహన్ గుమ్మం వద్దకు వెళ్ళాడు. అతను అటు తిరగగానే విడాకుల కాగితాలు తీసి సోఫామీద దిండు క్రిందకు తోసి దానిపై కూర్చుంది జయదేవి.

సోఫాలకు అమర్చిన క్లాత్ కవర్సు, టీపాయ్ గదిలో నేల ఎక్కడ చూసినా రక్తమే.

గడియవేసి తిరిగి వచ్చి ఆమె ప్రక్కనే సోఫాలో కూర్చుంటూ అడిగాడు రాజమోహన్.

"ఇప్పుడు చెప్పు, ఎవరితను?" సోఫాలో కూర్చుంటూ అడిగాడు.

"నీకు సర్ప్రైజింగ్ గిఫ్టు ఇద్దామని ఈ సూట్ కేసులో డబ్బు సర్దుతున్నాను. ఇంతలో అదిగో ఆ తలుపు త్రోసుకొని వచ్చాడు. బహుశా తోటలో నుంచి వచ్చివుంటాడు. 'ఎవర్నువ్వు?' అని కోపంగా అడిగాను. 'నేను మీ అభిమానిని. మీ వివాహం చూడటానికి విశాఖ నుంచి

వచ్చాను'—అన్నాడు" అంది జయదేవి.

"అభిమాని అంటున్నావు. కూడా రివాల్వర్ ఎందుకు తెచ్చాడో అడగలేదా?" రాజమోహన్ అన్నాడు.

"అడిగాను. నన్ను ఒంటరిగా కలుసుకోవాలనుకున్నాడట. కూడా రివాల్వర్ ఉంటే మంచిదని తెచ్చాడట—"

"ఊఁ. తర్వాత?"

"ఇంత డబ్బును చూడగానే దురాశ పుట్టింది. అభిమానం పక్కకు నెట్టి దౌర్జన్యంచేసి ఈ సొమ్ము పట్టుకు పారిపోదాం అనుకున్నాడు. విధి వక్రించి సమయానికి నువ్వు వచ్చావు" అంది జయదేవి.

"ఈ అభిమానులతో వచ్చిన చిక్కే ఇది" అని, "ఇప్పుడు ఈ శవాన్ని ఏం చేద్దాం?" అనడిగాడు.

"నువ్వే ఆలోచించు డియర్!"

"ఓ పని చేద్దాం. ఈ రోజు ఫస్ట్‌నైట్. నువ్వు క్రొత్తగా కట్టించిన ఇంటిలో జరుపుకుంటామన్న సంగతి నీకు,నాకు లతకు తప్ప ఇంకెవ్వరికి తెలీదు. అవునా?"

"ఆ. అవును. అయితే."

"ఏముంది ఈ శవాన్ని కారు డిక్కీలో పడేసి రాత్రి మనం ఆ ఇంటికి వెళ్ళినప్పుడు, ఇంటి వెనకాల తోటలో గొయ్యి తీసి పాతేద్దాం. ఏమంటావు?"

"బావుంది ఆలోచన. అలాగే చేద్దాం."

"నేను వెళ్ళి కారు తోటలోకి తెస్తాను. నౌఖర్లు ఎవ్వరూ అటు రాకుండా చూడు" అని వెళ్ళాడు రాజమోహన్.

రాజమోహన్ వెళ్ళగానే జయదేవి దిండు క్రిందనుంచి విడాకుల కాగితాలు తీసి హతుడి పాంటు జేబులోకి త్రోసింది. చేతికి అంటిన రక్తం హతుడి బట్టలకు

తుడిచి, బాత్‌రూంలోకి వెళ్ళి శుభ్రంగా చేతులు కడుక్కొంది.

గది గుమ్మంవద్దకు వెళ్ళి తలుపు గడియ తీసి హాలులోకి చూసింది. ఎవ్వరూ లేరు. తలుపు చేరవేసి అక్కడే నిల్చుంది.

ముసలి నౌఖరు రామన్న అటుగా వచ్చాడు.

"రామన్నా. నౌఖర్లు అంతా ఏరి?" అనడిగింది.

"లతమ్మగారు అందరినీ సాగర్ హోటల్‌కి పంపినారమ్మా. ఆ యమ్మ కూడా వెళ్ళారు. మీకు చెప్పమన్నారు" అన్నాడు.

"సరే. నువ్వెళ్ళి నీ పని చూసుకో" అంది జయదేవి.

"చిత్తం!" అని వెళ్ళిపోయాడు రామన్న.

జయదేవి తిరిగి గదిలో అడుగుపెట్టింది.

రాజమోహన్, జయదేవి కష్టపడి శవాన్ని కారు డిక్కీలోకి చేర్చారు!

జయదేవి చీరను నడుముకు బిగించి గది శుభ్రం చేయసాగింది. రాజమోహన్ బాత్‌రూంలోంచి బకెట్‌తో నీళ్ళు తెచ్చాడు. ఇద్దరూ కలసి గది అంతా శుభ్రంగా కడిగి నిస్సత్తువతో నీరసంగా సోఫాలో కూర్చున్నారు.

జయదేవి కొంతసేపు రెస్టు తీసుకొని తను కట్టుకొన్న చీర విప్పింది. రాజమోహన్ కూడా బట్టలు విప్పేసాడు. సోఫా కవర్సు తీసేసాడు. జయదేవి అవన్నీ తీసుకెళ్ళి డిక్కీలో శవంమీద పడేసి తాళం వేసింది.

5

సమయం 5-30. రాజమోహన్ జయదేవిలు డ్రస్ చేసుకొని హోటల్ సాగర్‌కు వెళ్ళారు.

విందుకు వస్తున్న అతిథులకు స్వాగతం పలుకుతూ, రిసెప్షన్ హాలంతా తిరుగుతూ చిరునవ్వులతో అందరినీ అలరిస్తున్నారే గానీ ఇద్దరి మనసులూ కారు డిక్కీ మీదే వున్నాయి.

నిజజీవితంలో నటించడం చాలా కష్టమే అనుకుంది జయదేవి.

హాలంతా పరికించి చూసింది జయదేవి. ఓ మూలగా గుంపుగా నిలబడి సినీ కబుర్లు, గాసిప్స్ చెప్పుకొని హుషారుగా వున్న పత్రికా విలేఖర్లను చూడగానే ఆమె గతుక్కుమంది. "దినతంతి" పత్రికా విలేఖరి సుందర్‌ని కూడా చూడగానే ఆమెకు గుండె ఆగింది.

సినీపరిశ్రమలోని చాలామంది సుందర్ అంటే భయపడతారు. అనుమానం కల్గిన ఏ చోటయినా మాటువేసి రహస్యాలు సేకరించడంలో అతనికి సరిలేరు. అందుకే తోటి విలేఖర్లు సుందర్‌ని "పులి" అని ముద్దుగా పిలుస్తారు.

జయదేవి అక్కడనుంచి కదిలి రాజమోహన్ వద్దకు వెళ్ళింది.

విందు ముగిసింది. నూతన వధూవరులకు మరోసారి శుభాకాంక్షలు తెల్పి అతిథులు అంతా వెళ్ళసాగేరు.

అందరూ వెళ్ళేవరకు ఉండి, సుమారు రాత్రి 11 గం.ల సమయంలో జయదేవి రాజమోహన్‌లు కారులో బయలుదేరారు.

మద్రాసు శివార్లలో ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న వి.ఐ.పి. కాలనీలో జయదేవి నూతనంగా నిర్మిస్తున్న ఓ పెద్ద ఇంటి ముందు పోర్టికోలో ఆగింది కారు.

రాజమోహన్ కారు దిగి చుట్టూ పరికించాడు.

నిర్మానుష్యంగా ఉంది.

గేటు వేసి వచ్చి కారు డిక్కీ తెరిచాడు.

శవాన్ని రెండు చేతుల్లోకి తీసుకొని ఇంటి మెట్లు ఎక్కాడు.

జయదేవి తలుపు తెరచి లైటు వేసింది.

సుందర్ రెడీగా వున్నాడు. అతని చేతిలోని కెమెరా క్లిక్‌మంది. ఫ్లాష్ బల్బు కాంతులు చిమ్మింది.

జయదేవి 'కెవ్వు' మంది.

రాజమోహన్ "బాప్‌రే." అన్నాడు.

శవం నేలకు జారింది.

మరోసారి కెమేరా 'క్లిక్' మంది. □

ఖరీదు?

సీరియల్

వసుంధర

(గత సంచిక తరువాయి)

"కథ కాదు. సైన్సు మారణాయుధాల్నే కాదు— ఎన్నో వింతలు చేయగలదు. నా అనుమానం పురాణాల్లోని అవతారాలు కూడా ఈ విధంగా సైంటిస్టులు సృష్టించినవేనని!" అన్నాడు జయరాజ్.

"నరసింహం గురించి మీరు చెప్పింది నమ్మలేక పోతున్నాను...." అన్నాడు ప్రకాష్.

"ప్రోజెక్ట్ నరసింహావతారం—ఫైలు చూశావంటే నీ అనుమానాలన్నీ ఎగిరిపోతాయి. మొత్తం సర్క్యూట్లన్నీ అందులో స్పష్టంగా వివరించబడ్డాయి. అది చదివితే నీకు—నరసింహావతారం—ఎలా తయారుచేయాలో తెలిసిపోతుంది. అది చదివి మూల సిద్ధాంతాల నర్థం చేసుకోగలవు కానీ నరసింహావతారాన్ని నువ్వే చేయలేవు...."

ప్రకాష్ ఆశ్చర్యంగా—"ఈ విషయంలో మీ రింత పట్టుదల వహించారంటే అందుకేదో 'బలమైన కారణ ముండాలి...." అన్నాడు.

"అవును—ఆ కారణం కూడా నువ్వు తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే అదే నీ సంకల్ప బలానికి తోడవుతుంది—" అన్నాడు జయరాజ్.

జయరాజ్ ప్రకాష్‌కు గతంలోని ఓ కథను చెప్పడం ప్రారంభించాడు. ఆయన కథ చెబుతూంటే అది కళ్ళకు కట్టి నట్లే ఉంది.

20

చాలా ఏళ్ళ క్రితం విషయం.

ప్రొఫెసర్ ధనుంజయ్‌కు ప్రియశిష్యుడు జయరాజ్. ఆయన వద్దనే డాక్టరేట్ చేశాడు జయరాజ్.

ధనుంజయ్ కావడానికి ఫిజిక్స్ ప్రొఫెసరే అయినా—మెడిసిన్ అంటే మంచి ఆసక్తి. ఆయనకు ముగ్గురు కొడుకులు. ముగ్గురికీ కూడా చదువు రాలేదు. వారిగురించి ఆయనకు బెంగగా ఉండేది.

కొద్ది నెలల్లో ధనుంజయ్ రిటైరవుతాడనగా జయరాజ్‌కు

అమెరికా ఛాన్సు వచ్చింది. ధనుంజయ్ అతడిని వెళ్ళ వద్దని చెప్పాడు.

"నీలో మంచి ఒరిజినాలిటీ ఉంది. నీవంటి వాడిప్పు డున్న వాతావరణం వదలకూడదు. ఇక్కడున్న పరికరా లతో ఎంతో సాధించావు. నీకున్న పరిమితులు నీ మేధకు పదును పెడతాయి. విదేశాల్లో శాస్త్రజ్ఞులు చాలా ముందు న్నారు. వారికున్న సదుపాయాలూ అటువంటివే. నువ్వి ప్పుడు అక్కడకు వెళ్ళావంటే ఆ సదుపాయాలు నీ ఒరిజి నాలిటీని చంపేస్తాయి. మొదట్నించీ అక్కడే పుట్టి పెరిగిన వారి విషయం వేరు...." అన్నాడు ధనుంజయ్.

ఆయన చెప్పిన కారణం జయరాజ్ కంత సబబుగా అనిపించలేదు. కానీ అతడు అమెరికా వెళ్ళే ప్రయత్నం మానుకున్నాడు. అందుకు శ్యామలకూడా కొంతవరకూ కారణం.

శ్యామల జయరాజ్‌కు మూడేళ్ళు జూనియర్. ఆమె ఎమ్మెస్సీలో చేరినప్పుడే జయరాజ్‌ను ఆకర్షించింది. అత డికీ ఆమెకూ అచిరకాలంలోనే పరిచయమేర్పడి ప్రేమగా మారింది. తమ పరిచయాన్నీ, ప్రేమనూ వారు రహ స్యంగా ఉంచుకున్నారు. ఇప్పుడు శ్యామల ధనుంజయ్‌వద్ద రీసెర్చిలో చేరింది.

"రిటైరవగానే నేను కాకినాడ వెళ్ళిపోతాను. కానీ డిపార్ట్‌మెంట్లో జయరాజుంటాడు. అతడు నీ వర్కు చూస్తాడు...." అని ధనుంజయ్ ఆమెకు చెప్పాడు. జయ రాజ్ కోసమే ఆమె ఆయనవద్ద రీసెర్చిలో చేరిందని ఆయ నకు తెలియదు.

"నాకూడా డిగ్రీ వచ్చేదాకా నువ్వు దేశం వద

లొద్దు...." అని శ్యామల జయరాజ్‌ను కోరింది. శ్యామ లేదైనా కోరితే మారాలోచన లేకుండా అంగీకరించడం జయరాజ్‌కు మామూలు.

తర్వాత ధనుంజయ్ రిటైరై కాకినాడ వెళ్ళిపోయాడు. శ్యామల జయరాజ్‌వద్ద రీసెర్చి కొనసాగిస్తోంది. ఆ విధంగా ఒక ఏడాది గడిచింది.

ఒకరోజున శ్యామలకు ఇంటి నుంచి టెలిగ్రాం వచ్చింది అర్జంటుగా బయల్దేరి రమ్మని. శ్యామల వెంటనే వచ్చేస్తానని చెప్పి వెళ్ళింది. ఆమెదీ కాకినాడే కావడంవల్ల జయరాజ్ ధనుంజయ్ కిష్టమని అనాసపళ్ళు ఆమెచేత ఆయనకోసం పంపించాడు.

శ్యామలవెళ్ళి వారం గడిచినా జయరాజ్ కామెగురించిన సమాచారం అందలేదు. అతడు ఖంగారుపడి ప్రొఫెస రింటికి ట్రంక్‌కాల్ బుక్‌చేశాడు.

శ్యామల ధనుంజయ్‌ను కలుసుకుని అనాసపళ్ళిచ్చింది. ఆ తర్వాత ఆయన మళ్ళీ ఆమెను చూడలేదు. త్వరగా తనకు ఫోన్ చేయమని శ్యామలకు చెప్పమని అతడు ప్రొఫెసర్ని కోరాడు. ప్రొఫెసర్ సరేనన్నాడు.

మర్నాడతడికి ప్రొఫెసర్నించి ట్రంక్‌కాల్ వచ్చింది. ఆయన అతణ్ణి అర్జంటుగా కాకినాడ రమ్మన్నాడు. శ్యామల గురించి ఏమీ చెప్పలేదు.

ఆఘమేఘాలమీద జ య రా జ్ కాకినాడకు వెళ్ళి ప్రొఫెసర్ని కలుసుకున్నాడు. ధనుంజయ్ ఇల్లు వైభవో పేతంగా ఉండడం చూసి ఆశ్చర్యపడ్డాడు. అయితే ధనుంజయ్ ముఖంలో ఉత్సాహంలేదు. ఆయన దీనంగా జయరాజ్ వంక చూసి — "జీవితంలో క్షమించరాని తప్పొకటి నేను చేశాను...." అన్నాడు.

ఫారము-4

1. ప్రచురణ స్థలము	:	హైద్రాబాదు-29.
2. ప్రచురణ కాలము	:	మాస పత్రిక.
3. ముద్రాపకుని పేరు	:	శ్యామ దామోదర రెడ్డి.
జాతీయత	:	భారతీయుడు.
చిరునామా	:	హైద్రాబాదు-29.
4. ప్రచురణ కర్త పేరు	:	-డిటో-
జాతీయత	:	
చిరునామా	:	
5. సంపాదకుని పేరు	:	-డిటో-
జాతీయత	:	
చిరునామా	:	
6. వార్తాపత్రికపై యాజమాన్యము గల వ్యక్తులు, భాగస్తులు పేర్లు, చిరునామాలు	:	శ్యామ దామోదర రెడ్డి 3-4-554, నారాయణగూడ, హైద్రాబాదు-29. (సోల్ ప్రొప్రయిటరు)

శ్యామ దామోదర రెడ్డి అయిన నేను, పై తెలిపిన వివరములు నాకు తెలిసినంత వరకు, నేను విశ్వసించినంత మేరకు సత్యమైనవని, ఇందు మూలముగా ప్రకటించు చున్నాను.

తేది :

1-3-86.

శ్యామదామోదరరెడ్డి

(ప్రచురణకర్త సంతకం)

"మీరు తప్పుచేయడమా?" అన్నాడు జయరాజ్ ఆశ్చర్యంగా.

ధనుంజయ్‌కు అసమర్థులైన తన ముగ్గురు కొడుకుల గురించీ బెంగ వుంది. ఉద్యోగం కాగానే ఆయనకు యూనివర్సిటీలో ఎమరిటస్ ప్రొఫెసరయ్యే అవకాశ ముంది. అయినా కాకినాడ రావడానికి కారణం డబ్బు! ఆ ఊళ్ళో జగపతిరావనే ఒక ఆసామీ ధనంజయ్ పరి శోధనలకు లక్షలకొద్దీ మూల్యం చెల్లించడానికి సిద్ధంగా వున్నాడు. అన్ని సదుపాయాలూ ఆయనే చేశాడు. వారిరువురి మధ్యా ఈ మాటలు ప్రొఫెసరుద్యోగంలో ఉండగానే ప్రారంభమయ్యాయి.

ప్రొఫెసర్ ధనుంజయ్ జగపతిరావు కోరిన పరిశోధన సాధించి—మంచి ప్రతిఫలం పొందాడు. కానీ జగపతి రావాయన పరిశోధనా ఫలితాలను దుర్వినియోజనాలకు వాడుతున్నాడు. జగపతిరావెంత దుర్మార్గుడో శ్యామల ఉదంతంతో ఆయనకు తెలిసింది.

"శ్యామలకేమయింది?" అన్నాడు జయరాజ్ ఆత్రుతగా.

"ఆమెను నువ్వు మళ్ళీ చూడలేవు...." అన్నాడు ధనుంజయ్.

"అంటే?"

శ్యామల తండ్రి జగపతిరావు అనుచరుడు. ఎందుకో జగపతిరావుకు శ్యామల తండ్రిపై అనుమానం కలిగింది. అంతే!

మొత్తం కుటుంబం గల్లంతైంది.

"ఏమయింది?"

"అంతా రెడ్ సెల్‌కు వెళ్లారు...."

యం. శేషాచలం & కంపెనీవారి

తాజా సూపర్ హిట్ నవల

మల్లాది వెంకటకృష్ణమూర్తి డైరెక్ట్ నవల

మందాకిని వెల: రూ. 20/-

3 వ ముద్రణ వెలువడింది!

పుస్తకాల ఖరీదు పెరిగి వాటిని పాఠకులు కొనలేని రోజుల్లో మల్లాది వెంకటకృష్ణమూర్తి డైరెక్ట్ నవల మందాకిని విడుదలైన నెలలోనే 8000 కాపీలు ఎలా అమ్మగలిగింది?

- మల్లాది డైరెక్ట్ నవల కాబట్టి.
- సస్పెన్స్ హార్రర్ నవలతో విసుగుపుడుతున్నప్పుడు సెంటిమెంటల్ నవలగా పెద్ద రిలీఫ్ ఇస్తుంది కాబట్టి.
- నవల పేరు చాలా బాగుంది కాబట్టి.
- ముఖచిత్రం బాగుంది కాబట్టి.
- ఇది ఎన్నిసార్లయినా చదువుకోవచ్చు కాబట్టి.
- పిల్లలకి పేర్లు పెట్టుకోటానికి ఓ మంచి పేర్ల జాబితా నవల చివర్లో ఉంది కాబట్టి.
- పబ్లిసిటీ బాగుంది కాబట్టి.

మీరింతవరకూ చదివి వుండకపోతే వెంటనే కొని చదవండి. పోస్టులో తెప్పించుకోదలిస్తే 10 రూ. ఎమ్ వో. చేయండి. మిగతా 10 రూ.లకి వి.పి. పెట్టి పంపిస్తాము.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్,

8237, రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్—500 003.

రెడ్ పెల్ గురించి జయరాజ్‌కు అప్పుడు తెలిసింది.

"నేనిప్పుడేం చేయాలిః" అన్నాడతడు.

ధనుంజయ్‌కు వీరి ప్రేమ గురించి తెలియదు. అందు కని—"ఆమె చేసిన వర్కు ఇంకో స్టూడెంటుకిచ్చే సేయ్...." అన్నాడాయన.

"అలా కాదు. జగపతిరావును నేనే కలుసుకుంటాను."

ధనుంజయ్ అతడిని వారించాడు. జగపతిరావెంత ప్రమాదకారో వివరించాడు. లేనిపోని గొడవల్లో తల దూర్చవద్దన్నాడు.

అప్పుడు జయరాజ్ ఏడుస్తూ తమ ప్రేమ గురించి చెప్పుకుని—"శ్యామల లేనిదే నేను బ్రతకలేను...." అన్నాడు.

ధనుంజయ్ తెల్లబోయాడు.

"నువ్వు నా ప్రియ శిష్యుడివి. శ్యామల నీ ప్రియు రాలని నాకు తెలియదు. ఇప్పుడు నాకు జగపతిరావంటే ఇంకా అసహ్యం, కసి, ద్వేషం పెరిగిపోయాయి. కానీ అవి నీకు నీ శ్యామలను వెనక్కు తెచ్చివ్వలేవు...." అన్నాడు ధనుంజయ్.

జయరాజ్ దుఃఖించాడు. ఆవేశపడ్డాడు. ధనుంజయ్ అతణ్ణి ఓదార్చి చల్లార్చాడు.

"ఆవేశపడితే శ్యామలతోపాటే నువ్వూ అంతమవు తావు. నిదానిస్తే నీ పగ తీరడమేకాక జగపతిరావు పీడ ఈ లోకానికే విరగడవుతుంది—" అన్నాడు ధనుంజయ్.

"ఏం చేయమంటారో చెప్పండి...." అన్నాడు జయరాజ్.

"ప్రస్తుతానికి విశాఖపట్నం వెళ్ళిపో. నేను కబురు పెట్టగానే కాకినాడకు తిరిగిరా. అవసరమైతే ఓ నెల్లాళ్ళు

అపరాధ పరిశోధన పోటీ-212

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితం పై వ్రాసి, దానితో 1.00 రూ విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1.00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-3-'86 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు మే' 86 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. ఇటీవల యీ అంతరిక్ష నౌక పేలిపోయింది—?
(ఇన్సాట్-ఎ, ఛాలెంజర్)

2. శ్రీమతి ఇందిరాగాంధీ హంతకులకు విధించిన శిక్ష ఏమిటి—?
(మరణ శిక్ష, ఉరిశిక్ష)

3. ప్రజల్లో వీటిపై వ్యతిరేకత కనిపిస్తున్నది—?
(బందులు, రిజర్వేషన్లు)

4. నేరస్థులలో చాలామంది—?
(త్రాగుబోతులు, వ్యభిచారులు)

5. న్యాయసహాయంలో ఇది ప్రధాన పాత్ర వహిస్తుంది—?
(సాక్ష్యం, డబ్బు)

పెలవు పెట్టాలి—" అన్నాడు ధనుంజయ్.

అయిదు వారాలు పిచ్చివాడిలా తిరిగాడు జయరాజ్. కళ్ళలో ఎన్నో ఆశలు నింపుకుని మళ్ళీ తిరిగివస్తానని చెప్పి వెళ్ళిన శ్యామల అతడి కనులముందే కదలాడుతూ- అతణ్ణి పిచ్చివాణ్ణి చేస్తోంది.

అతడికేమయిందో యూనివర్సిటీలో ఎవరికి అర్థం కాలేదు.

అప్పుడతడికి ధనుంజయ్‌నుంచి ఉత్తరం వచ్చింది.

"వెంటనే కాకినాడకు బయల్దేరిరా! పురుషోత్తమరావు గారింట్లో మకాంపెట్టు. నన్ను కలుసుకోకు. అన్నీ నీకే తెలుస్తాయి—" అని ఉందా ఉత్తరంలో.

జయరాజ్ అలాగే చేశాడు.

పురుషోత్తమరావు ఆ ఊళ్ళో ఎన్నదగ్గ భాగ్యవంతుడు. ఆయనకో కొడుకు. ఓ కూతురు. కూతురి పేరు చంద్రమతి.

జయరాజ్‌కు చంద్రమతినిచ్చి పెళ్ళిచేయమని ధనుంజయ్ పురుషోత్తమరావుకు సూచించాడు. అందుకే పురుషోత్తమరావు జయరాజ్‌కు తనింట్లో ఓ గదినిచ్చాడు. చూడగానే జయరాజ్ ఆయనకు నచ్చాడు. చంద్రమతిని తరచు అతడి వద్దకు పంపించేవాడు.

జయరాజ్ చంద్రమతి గురించి పట్టించుకోలేదు. ధనుంజయ్‌నుంచి కబురుకోసం ఎదురు చూస్తున్నాడు. అతడు వచ్చిన మర్నాడే ధనుంజయ్‌నుంచి కబురు అందింది.

ఓ కుర్రాడు వచ్చి అతడికి ఉత్తరం, ప్యాకెట్టు ఇచ్చాడు.

"డియర్ జయరాజ్!

ఈ ఉత్తరం చదవగానే నాశనం చేసెయ్.

పద్మాలయ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్

జనవరి విడుదలైనవి!

సూపర్ డైనమిక్ - సూపర్ సెన్సేషనల్

మధుబాబు

'షాడో' సృష్టికర్త

మధుబాబు

"నీడ" కథల నీడల్లోంచి

షాడో విన్యాసాల ఛాయల్లోంచి

కలాన్ని వెలికితీసి

వెన్నెల స్నానం చేయించి

మీ కందించిన సోషియో క్రైమ్ థ్రిల్లర్

ఆర్తి

వెల: రు: 15-00

కురుమద్దాలి విజయలక్ష్మి

సూపర్‌ఫాస్ట్ క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

హత్య

వెల: రు. 20 00

పద్మాలయ పబ్లికేషన్

లీలామహల్ ప్రక్కసందు, విజయవాడ-2

రేపట్నించి నీ వద్దకు నరసింహం అనే ఒకతడు వస్తాడు. అతడు చాలా మంచివాడు. జగపతిరావుకు బాగా నమ్మకస్థుడు. అతడితో స్నేహం పెంచుకో! అతడివద్ద జగపతిరావు గురించి మాట్లాడి—ముఖ భావాలు చూడు. రోజూ నేను నీ వద్దకో మనిషిని పంపుతూంటాను. అతడిద్వారా ఎప్పటికప్పుడు నీ అబ్జర్వేషన్ తెలియబర్చు.

నీకు పంపిన ప్యాకెట్లో కొన్ని బిళ్ళలున్నాయి. రోజుకు రెండు బిళ్ళలు చొప్పున ఎలాగో అలా నువ్వు నరసింహానికివ్వాలి....

నీ అంతట నువ్వు నన్ను కలుసుకుందుకు ఎటువంటి ప్రయత్నమూ చేయకు. నీ

ధనుంజయ్.''

జయరాజ్ ఉత్తరం చదివి, చింపి ముక్కలుచేసి డస్ట్ బిన్లో పారేశాడు.

అన్న ప్రకారం అతడి వద్దకు నరసింహం వచ్చాడు.

''ప్రొఫెసరుగారు మీ గురించి చెప్పారు. బీయస్సీతో చదువాపేసినా ఫిజిక్సు నా ఫావరేట్ సబ్జెక్ట్. మీనుంచి కొన్ని విశేషాలు తెలుసుకోవాలని వచ్చాను....'' అన్నాడు నరసింహం.

అతడి రూపం, గొంతు, మాట తీరు అన్నీ జయరాజ్‌కు నచ్చాయి.

''మన సుఖ సంతోషాలకు మూలమైనది ఫిజిక్సు. మన చుట్టూ వుండే వాతావరణంలో నెగెటివ్ అయాన్స్ ఎక్కువుంటే మనకెంతో ఆహ్లాదంగా వుంటుంది. పాజిటివ్ అయాన్సెక్కువుంటే తలనొప్పి పుడుతుంది. అంటే కేవలం ఎలక్ట్రిక్ ఛార్జిమీద ఆధారపడి ఉన్నాయి మన

"హోమ్ డెలివరీ"

1. 'హోమ్ డెలివరీ' లో పాఠకులు ఎవరైనను చేరవచ్చును. దీనికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 10/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

2. సభ్యులకు "అపరాధ పరిశోధన" పత్రికలు వాటి అసలు ధరకే లభిస్తాయి. అంతేకాదు—వారికి పత్రికలన్నీ 'రిజిష్టరు పోస్టు' లో అందజేస్తాము. ప్రతి 6 నెలలకు ఒకసారి అంటే- జనవరి మరియు జూలై నెలల పత్రికలు మాత్రం వి.పి. ద్వారా పంపబడతాయి. వి.పి. వచ్చినప్పుడు మీరు పోస్టుమాన్‌కు అర్థ సంవత్సర చందా చెల్లించవలసి వుంటుంది. పోస్టు ఖర్చులన్నీ (ఏడాదికి రు. 49/-లు) మేమే భరిస్తాము. పత్రికల ఖరీదుకు మించి మీరు పైసా చెల్లించనవసరం లేదు.

3. 'అపరాధ పరిశోధన' మాసపత్రిక మరియు సప్లిమెంట్‌కు కలిపి అర్థసంవత్సర చందా రు. 78/-లు మాత్రమే. మధ్యలో సభ్యులుగా చేరినవారికి మాత్రం తర్వాత నెలలకు లెక్కవేసి మొదటి వి.పి. పంపబడుతుంది.

4. ఏ కారణం చేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో, మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది. మీ చిరునామా మారినప్పుడు వెంటనే మాకు తెలియజేయాలి. ఆ సమయంలో మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంది. కావున మీకు ప్రతి నెలా వచ్చే ప్యాకెట్ పై-మీ పేరుకు ముందు వుండే నెంబరును మాత్రమే ఉత్తర ప్రత్యుత్తరాలలో వ్రాయగోర్తాము.

5. సభ్యులకు ప్రతి నెలా V.P. ద్వారా పత్రికలు తెప్పించుకునే సౌకర్యంకూడా వుంది. అయితే వి.పి. ఖర్చులుకూడా వారే భరించవలసి వుంటుంది. ఈ పద్ధతిలో పత్రికలను ఏ నెలకానెల రు. 16-60 లు చెల్లించి పొందవచ్చును. యీ సౌకర్యం కావలసిన వారు మాకు ప్రత్యేకంగా తెలియజేయాలి.

హోమ్ డెలివరీ! —పత్రికలకు గ్యారంటీ!!

సుఖసంతోషాలు...."

నరసింహం ఆశ్చర్యంగా—"ఫిజిక్సులోని లేటెస్టు డెవలప్మెంట్సు చెప్పండి. వింటాను...." అన్నాడు.

"ఒకటని ఏం చెప్పను? సైన్సు మొత్తం ఫిజిక్సుతో కలిసి పరుగెడుతోంది. ఏ ఫీల్డులో మీకింట్రస్టుందో చెప్పండి—" అన్నాడు జయరాజ్.

ఇద్దరూ కాసేపు ఫిజిక్సు మాట్లాడుకున్నాక—"నేను ఫిజికల్ ప్రిన్సిపుల్స్‌మీద ఓ ప్రత్యేకమైన పానీయాన్ని తయారుచేశాను. తాగి మీ అభిప్రాయం చెప్పాలి." అన్నాడు జయరాజ్. అతడు నరసింహానికి మంచినీళ్ళలో రెండు టాబ్లెట్లు కలిపిచ్చాడు.

నరసింహం మంచినీళ్లు తాగి—"తాగుతుంటూనే మా జగపతిరావుగారితో మాట్లాడుతున్నంత ఆ న ం ద ం గా వుంది—" అన్నాడు.

"జగపతిరావుగారెవరు?" అన్నాడు జయరాజ్.

"మన అదృష్టంకొద్దీ మనదేశంలో పుట్టిన ఓ మహాను భావుడు...." అంటూ నరసింహం జగపతిరావును విప రీతంగా పొగిడాడు.

జయరాజ్‌కు రక్తం మరిగింది కానీ ఆవేశాన్నణచు కున్నాడు. తర్వాత ధనుంజయ్ ఎవరో మనిషిని పంపగా అతడిద్వారా ఉత్తరంలో జరిగినది తెలియబర్చాడు.

అలా రోజులు గడిచిపోయాయి.

నరసింహంలో క్రమంగా మార్పు రాసాగింది. అతడు జగపతిరావు పేరెత్తగానే ముఖం చిట్లించడం ప్రారం భించి మూడు వారాలు గడిచేసరికి—"వాడా—పరమ కిరాతకుడు. వయవంచకుడు. వాడి ఆటలలా సాగడం మన దురదృష్టం...." అని దారుణంగా నిందించే స్థితికి

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-3-'86 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు 'మే' 86 నెల సంచికలో ప్రకటిస్తాము.

జనవరి '86 పోటీ ఫలితాలు:

(1) జనవరి '86 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఇద్దరి నడుమన ఇంతి!

ఎవరిపై పడనున్నదో బంతి!!

పంపినవారు: శ్రీ సి. హెచ్. రాజు, 11/460, తూకుమాను మిట్ట, సంతపేట, నెల్లూరు.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

చిత్రమయిన పోరు!

చిన్నదాని తీరు!!

పంపినవారు: శ్రీ యన్. శివానంద్, మెయిన్ రోడ్, బెల్లంపల్లి—504 251.

వచ్చాడు.

ఒకరోజున నరసింహం జయరాజ్‌తో—"సైన్స్‌లో నీకు తెలియనిది లేదనిపిస్తోంది. జగపతిరావువంటి వాడి పీచమణచడానికి నీవంటివాడికే వీలవుతుంది. నాకు జగపతిరావు రహస్యాలు చాలా తెలుసు. మనమిద్దరం కలిసి వాడి అంతు చూద్దాం నీకిష్టమేనా?" అన్నాడు.

జయరాజ్‌లో ఉత్సాహం పొంగింది. అయినా అతడు బయటపడకుండా — "జగపతిరావుతో నాకేమీ విరోధం లేదే!" అన్నాడు.

"నువ్వు మంచివాడివి. వాడు చెడ్డవాడు. మంచికీ చెడ్డకీ ఎప్పుడూ విరోధమే—కాదంటావా?" అన్నాడు నరసింహం.

"అదేమో నాకు తెలియదు. నువ్వు మంచివాడివి. నేను నీకు సాయపడతాను—" అన్నాడు జయరాజ్.

నరసింహం ఆ రోజతడికి థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాక-జయరాజ్ జరిగిన విశేషం ప్రొఫెసరుకు యధాప్రకారం తెలియబరిచాడు. ఆ రోజతడికి ప్రొఫెసర్నించి కలుసుకోమని కబురొచ్చింది.

జయరాజ్ వెళ్ళాడు.

"నువ్వు ఊరొదిలి విశాఖపట్నం వెళ్ళిపో-అక్కడకు నేను మళ్ళీ కబురు పంపిస్తాను ...." అన్నాడు ధనుంజయ్.

"మీరేం చేస్తున్నారో నాకు తెలియడంలేదు—" అన్నాడు జయరాజ్.

"నేను చేసిన తప్పు దిద్దుకుంటున్నాను. ఆ వివరాలన్నీ మొత్తం నీకు తెలియబరుస్తాను. ప్రస్తుతానికింకేమీ

మల్లాది వెంకటకృష్ణమూర్తి

సా వి ర హే

విడుదలైంది!

వెల: రూ. 25-00

మీరు ప్రేమించేవారికి ఆ సంగతి అందంగా ఎలా తెలియ చేయటం!

ఎన్ని విధాలుగా తెలియ చేయవచ్చు!

మీరు ప్రేమించే అమ్మాయితో వాహనాలు వేగంగా తిరిగేప్పుడు రోడ్డుమీద ఓ నిముషం పడుకుంటానని బెట్ కట్టి, ఏక్సిడెంట్ జరక్కుండా ఎలా పడుకోవటం!

హోటల్‌లో టిఫిన్ తిన్నాక మీ దగ్గర బిల్ చెల్లించటానికి డబ్బు లేకపోతే, పిండిరుబ్బకుండా ఎలా హాయిగా బయట పడగలగడం?!

మల్లాది వెంకటకృష్ణమూర్తి రాసిన సాంఘిక నవలల్లో కూడా, థ్రిల్స్ ఫీలయ్యేలా రాసిన ఈ టీనేజ్ లవ్ స్టోరీ 'సావిరహే' ప్రేమించిన వాళ్ళని, ప్రేమించే వాళ్ళని, ప్రేమించబోయేవాళ్ళని అందరినీ సమానంగా ఆకర్షిస్తుంది.

నేడే అడ్వాన్సుతో పాటు మీ ఆర్డరు పంపండి

పుస్తకం ధర M. O. చేసిన వారికి పోస్టు ఖర్చులతో V. P. P. లో పంపిస్తాం.

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్

మ్యూజియం రోడ్, విజయవాడ-2.

అదక్కు...." అన్నాడు ధనుంజయ్.

"నరసింహం విషయమేం చేస్తారు?"

"అతడే మన ఆశాజ్యోతి. అతణ్ణి త్వరలో నీ దగ్గరకు పంపుతాను. నువ్వు మాత్రం ఇక్కడ జరిగినవన్నీ మర్చిపో...." అన్నాడు ధనుంజయ్.

"మీ మాట నాకు శిరోధార్యం—"

"ఆ విషయం నాకు తెలుసు. అందుకే నిన్నిక్కడికి పిలిపించాను. నా మాట నీకు శిరోధార్యమే అయితే—నేను చెప్పేది అక్షరాలా పాటించాలి నువ్వు...."

"చెప్పండి!"

"చంద్రమతిపై నీ అభిప్రాయ మేమిటి?"

జయరాజ్ ఉలిక్కిపడి "చంద్రమతి అంటే?" అన్నాడు.

"పురుషోత్తమరావుగారమ్మాయి...."

జయరాజ్ మౌనంగా వుండిపోయాడు.

"ప్రస్తుతం నేను కూడా ప్రమాదంలో ఉన్నాను. నా తర్వాత నువ్వో కొన్ని ప్రయోగాలు కొనసాగించవలసి ఉంటుంది. బహుశా ఉద్యోగం వదిలిపెట్టి ఇక్కడే ఉండిపోవాల్సొంటుంది కూడా! అందుకు డబ్బున్నవారి అండదండలు నీకు అవసరం. పురుషోత్తరావు అన్ని విధాలా నీకు తగినవాడు. నువ్వాయన కూతుర్ని పెళ్ళి చేసుకుంటే జగపతిరావునుండి నీకు రక్షణ లభిస్తుంది.."

—(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600 001.